ప్రజాశక్తి
గుంటూరు
బుధవారం
జనవరి - 3
2018
16 పేజీలు



మాట్లాడుతున్న పాశం రామారావు

నిలదీతలు



మంగళగిరి మండలం పెదవడ్లపూడిలో అధికారులు, ప్రజా ప్రతినిధులను నిలదీస్తున్న ప్రజలు

- జిల్లా వ్యాప్తంగా ప్రారంభమైన జన్మభూమి సభలు
- పలు అంశాలపై భారీగా విజ్ఞాపనలు
- తొలిరోజు 4,234 అర్జీలు
- సభలకు స్పీకర్ కోడెల, మంత్రులు పుల్లారావు, ఆనందబాబు హాజరు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

జిల్లాలో ఐదో విడత జన్మభూమి-మాఊరు సభలు మంగళవారం ప్రారంభం అయ్యాయి. డెల్టాలోని పలు గ్రామాల్లో నిరసనలు వ్యక్తం అయ్యాయి. పల్నాడులో సభలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. జిల్లాలో పింఛన్లు, రేషన్ కార్డులు, ఇళ్ల స్థలాలు, పక్కా ఇళ్లు, గతంలో ఇచ్చిన స్థలాలను మెరక చేసుకునేందుకు నిధులు మంజూరు, శ్మశానాలు అభివృద్ధి, తాగునీరు, రహదారుల సమస్యలను ప్రజలు ప్రస్తావించారు. పలువురు దరఖాస్తులు అందచేశారు. జిల్లా వ్యాప్తంగా తొలి రోజు 4,234 వేల దరఖాస్తులు అందినట్టు అధికారులు తెలిపారు. నర్సరావుపేటలో స్పీకర్ కోడెల శివప్రసాదరావు, చిలకలూరిపేట నియోజకవర్గంలో పౌరసరఫరాల శాఖ మంత్రి పత్తిపాటి పుల్లారావు, వేమూరు నియోజకవర్గంలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి నక్కా ఆనందబాబు పాల్గొన్నారు. భట్టిప్రోలు మండలంలో మంత్రి ఆనందబాబు మాట్లాడే సందర్భంలో సిపిఎం నాయకులు కలుగజేసుకుని పథకాల అమలులో పక్షపాతాన్ని, ఉపాధి హామీ పనులు చేసిన కూలీలకు బిల్లులు రాకపోవడాన్ని ప్రశ్నించారు. తుళ్లూరు మండలంలో సిఐటియు నాయకులు జె.నవీన్‌కుమార్ కార్మికుల సమస్యలపై ప్రస్తావించారు. నిర్మాణ రంగం పెరిగిన క్రమంలో భవన నిర్మాణ కార్మికులు ఎక్కువయ్యారని, అయినా కార్మిక శాఖాధికారిని నియమించలేదని అన్నారు. పిడుగురాళ్లలో సుందరయ్య కాలనీలో సదుపాయాలపై సిపిఎం నాయకులు విన్నవించారు. వినుకొండలో వెన్నుపూస కాలనీలో సమస్యలను సిపిఎం నాయకులు ప్రస్తావించారు. రొంపిచర్ల మండలంలో మాచవరం, నల్లగార్లపాడు, అచ్చయ్యపాలెం గ్రామాల్లో స్థానికులు నిలదీశారు. మాచవరంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, రోడ్లు సక్రమంగా లేవని, నల్లగార్లపాడులో వ్యవసాయాధికారులు రైతులకు విత్తనాల పంపిణీలో పక్షపాత వైఖరిని చూపించారని, అర్హులకు కాకుండా, అనర్హులకు పింఛన్లు పంపిణీ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళగిరి మండలం పెదవడ్లపూడి లో అనేక సమస్యలపై గతంలో పలుమార్లు వినతిపత్రాలు సమర్పించామని జన్మభూమి సభల్లో అధికారుల దృష్టికి తెచ్చామని, అయినా ఎవ్వరూ పట్టించుకోవడం లేదని తప్పుబట్టారు. షుగరు ఫ్యాక్టరీ డొంక రోడ్డును, చిలువూరు రోడ్డులకు మరమ్మతులు చేపట్టాలని కోరారు. మాచర్లలో 1,2,3 వార్డులకు చెందిన మహిళలు జన్మభూమి కార్యక్రమానికి పెద్దఎత్తున తరలివచ్చారు. ఇళ్లస్థలాలు, పెన్షన్లు, రేషన్‌కార్డులకు దరఖాస్తులు చేసుకునేందు మహిళలు జన్మభూమికి వచ్చారు. తనకు ఇళ్లులేవని, పెన్షన్ రావడం లేదని అభ్యర్థిస్తుండగా పక్కా ఆధారాలతో దరఖాస్తు చేసుకుంటే విచారించి మంజూరు చేస్తామని అధికారులు చెప్పడంతో వారు నిరాశతో వెనుదిరిగారు. స్పీకర్, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరైన సభలకు ప్రజలు ఒక మోస్తరుగా హాజరు కాగా అధికారులు మాత్రమే నిర్వహించిన సభలకు హాజరు శాతం పల్చగానే కన్పించింది.

ప్రచారార్భాటాలకే

- జన్మభూమి సభలపై సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు
- పెదగొట్టిపాడు దళితులపై దాడికి ఖండన

ప్రజాశక్తి-గుంటూరు

జన్మభూమి సభలను సిఎం సందేశాలు వినిపించటానికి ప్రచార్భాటాలకు పరిమితం చేయకుండా ప్రజా సమస్యల పరిష్కారానికి వేదికగా నిర్వహించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు పేర్కొన్నారు. మంగళవారం బ్రాడీపేట సిపియం కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో షుమారు 1లక్ష కుటుంబాలకు ఇళ్ళ స్థలాలు లేవని, వివిధ రకాల ప్రభుత్వ భూముల్లో గత అనేక సంవత్సరాల నుండి స్థిర నివాసం ఏర్పాటు చేసుకుని నివాసముంటున్న వేలాది మందికి పట్టాలు ఇవ్వాల్సి ఉందన్నారు. వారందరికీ జన్మభూమిలో పట్టాలు మంజూరు చేయాలని కోరారు. మంగళగిరి, తాడేపల్లి ప్రాంతాల్లోనే పిడబ్ల్యూడి, ఇరిగేషన్, చెరువు, వాగు, డొంక, అటవీ భూములు, ఇతర ప్రభుత్వ భూముల్లో 10 వేల కుటుంబాలు నివాసముంటున్నారని, వారిలో ఒక్కరికి కూడా ఇంత వరకు పట్టా మంజూరు చేయలేదని తెలిపారు. గుంటూరులో నగరంలో ప్రగతి నగర్, సుందరయ్యనగర్, పెదకాకానిలో సుందరయ్యకాలనీ, నంబూరులో ఆలీరఫత్ నగర్, ఆత్మకూరులో నిమ్మగడ్డ రామమోహన్ రావు నగర్, వినకొండ, పిడుగురాళ్ళలో సుందరయ్యనగర్‌లలో గత 10 సంవత్సరాల నుండి ప్రభుత్వ 6లో

జాతీయ వైద్య కమిషన్ బిల్లు

ప్రజల ఆరోగ్యానికి గొడ్డలి పెట్టు

14లో

నిరసనగా వైద్య సేవల బంద్ పాటించిన వైద్యులు

గుంటూరుకు ఇద్దరు తహసీల్దార్లు

- త్వరలోరెండుగా విభజన కానున్న రెవెన్యూ మండలం
- మారనున్న మండల సరిహద్దులు

6లో



పెత్తందార్ల పనులకు వెళ్లడం లేదని

6లో

పథకం ప్రకారమే దాడి



పెదగొట్టిపాడులో మాట్లాడుతున్న కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి, పక్కన వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు, జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు

- పెదగొట్టిపాడులో కెవిపిఎస్, వ్యకాస పరిశీలన
- ఎస్‌పితో మాట్లాడిన నాయకులు
- గ్రామంలో మోహరించిన పోలీసులు - డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షణ
- ఇరు పక్షాలకు చెందిన 53 మందిపై కేసులు



బోర్ల ద్వారా తవ్వకాలు చేపట్టిన ఒఎన్‌జిసి సిబ్బంది

చమురు నిక్షేపాల పరిశీలనకు తవ్వకాలు

ప్రజాశక్తి - పెదకాకాని

చమురు నిక్షేపాల సమాచారం తెలుసుకునేందుకు ఒఎన్‌జిసి ఆధ్వర్యంలో మండలంలోని పలుచోట్ల బోర్ల తవ్వకం చేపట్టారు. కృష్ణా జిల్లా హనుమాన్ జంక్షన్ నుండి గుంటూరు వరకు ఆయిల్ నిక్షేపాల వివరాలపై తవ్వకాలు నిర్వహించాలని నిర్ణయించారు. ఐదు నెల్లపాటు కొనసాగే తవ్వకాల్లో భాగంగా రెండు నెలల నుండి ఈ పరిశీలన చేపట్టారు. ఈ క్రమంలో మంగళవారం మండల పరిధిలోని నంబూరులో వివిఐటి కాలేజీ సమీపంలో 1000 అడుగుల లోతులో బోర్లు వేస్తున్నారు. మట్టి నమూనాల పరిశీలానానంతరం నిక్షేపాలపై నిర్ధారణకు రానున్నారు.

ఒఎన్‌జిసి వాహనాలు





పౌష్టికాహారాన్ని అందిస్తున్న ట్రస్ట్ నిర్వాహకులు

పేరలి నరసయ్య ట్రస్ట్ ఆధ్వర్యంలో పౌష్టికాహారం

ప్రజాశక్తి - కర్లపాలెం

పేరలి నరసయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు పౌష్టిహారాన్ని మంగళవారం పంపిణీ చేశారు. ట్రస్ట్ అధ్యక్షులు బాలకృష్ణమూర్తి సహకారంతో రూ.10 వేలతో చిరుధాన్యాలతో కూడిన పౌష్టికాహారాన్ని పంపిణీ చేస్తున్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ కార్యదర్శి బి.సాంబయ్య, కన్వీనర్ టి.సుబ్బారావు, హెచ్‌ఎం సుబ్బారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కర్లపాలెం ఎఎస్ఐ బదిలీ



ప్రజాశక్తి - కర్లపాలెం

కర్లపాలెం పోలీస్‌స్టేషన్ ఎఎస్ఐగా పనిచేస్తున్న ఎన్.పౌలేస్ బదిలీ అయ్యారు. నరసరరావుపేట ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులిచ్చారు.

రెండేళ్ల ఐటిఐ తర్వాత డిప్లమోకు అవకాశం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

ఐటిఐ రెండేళ్ల కోర్సు పూర్తిచేసిన విద్యార్థులు పాలిటెక్నిక్ డిప్లమో రెండో సంవత్సరం నేరుగా చేరేందుకు ప్రభుత్వం అనుమతించిందని తెనాలి ప్రభుత్వ ఐటిఐ కళాశాల ప్రిన్సిపల్ జె.సత్యనారాయణ తెలిపారు. ఈనెల తొమ్మిది నుంచి ఫిబ్రవరి ఎనిమిది వరకు దీనికి సంబంధించిన బ్రిడ్జికోర్సు శిక్షణ తరగతులు నిర్వహిస్తామని ఆయన చెప్పారు. అర్హత కలిగిన విద్యార్థులు ఒరిజినల్ ధ్రువపత్రాలతో కళాశాల పనిదినాల్లో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 08644228575 ఫోన్ నంబర్లకు సంప్రదించాలన్నారు.

ఇదేనా అభివృద్ధి !

ఒ వైపు నాయకులు, అధికారుల ప్రసంగం.. మరోవైపు విద్యార్థినుల ప్రయాస



వేదిక పక్కగా నీళ్లు మోసుకెళ్తుతున్న చిన్నారులు

ప్రజాశక్తి-పొన్నూరు

జన్మభూమి కార్యక్రమంలో అధికారులు, టీడీపీ నాయకులు అభివృద్ధిపై తెగ చెప్పేస్తున్న సమయంలోనే ఇద్దరు చిన్నారులు బాత్‌రూమ్‌కు బరువైన నీళ్ల బక్కెట్ మోసుకుంటూ వెళుతున్న దృశ్యం చాలామందిని ఆలోచింపచేసింది. వేదికమీద ఉన్న నాయకులు చెప్పే అభివృద్ధికి, వాస్తవ పరిస్థితులకు ఎంత వ్యత్యాసం ఉందో కళ్లకు కట్టినట్టుగా చిన్నారుల అవస్థ కళ్లు తెరిపించిందనే వ్యాఖ్యలూ వినిపించాయి. మంగళవారం ఉదయం మండల పరిధిలోని ఆరెమండ ఎంపిపి పాఠశాల ప్రాంగణం వేదికపై నుంచి అధికారులు 5వ విడత జన్మభూమిని నిర్వహించారు. ప్రధానంగా అభివృద్ధిపైనే అంతా మాట్లాడారు. ఇందులో భాగంగా 'చంద్రన్న సారధ్యంలో ఇంటింటా సంక్షేమం' పేరుతో మల్టీకలర్ బ్రోచర్లు పంపిణీ చేశారు. ఎనిమిది పేజీలున్న ఈ బ్రోచర్‌లో ప్రధానంగా ప్రీ మెట్రిక్, మెట్రిక్, పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్స్, బెస్ట్ అవైలబులిటీ స్కూల్స్, విదేశీ విద్యా పథకం, హాస్టల్స్, ఎన్‌టిఆర్ విద్యోన్నతి, ఎస్సీ, ఎస్టీ పథకాల గురించి పేర్కొన్నారు. ఆ బ్రోచర్‌లో విద్యార్థులకు ఎంతెంత ఖర్చు చేస్తున్నదీ పేర్కొన్నారు. అయితే వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయని పాఠశాలల విద్యార్థులను చూస్తేనే అర్థమవుతోంది. పైగా తమ ప్రథమిక పాఠశాల విద్యార్థులకు మౌలిక సదుపాయాలు అంట్లేదు. పాఠశాలకు ప్రహరీలేదు. కేవలం రెండు గదుల్లో ఐదు తరగతులు విద్యార్థులు చదువుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. కనీసం టాయిలెట్స్, యూరినల్స్‌లో రన్నింగ్ వాటర్ అందదు. దూరంగా ఉన్న చేతిపంపు నుంచి బక్కెట్లో నీళ్లు నింపుకుని తీసుకుపోవాల్సిన పరిస్థితి. ఆ నీళ్ల బక్కెట్‌ను ఒక్కరే మోయలేక ఇద్దరు బాలికలు కలసి మోసుకుపోతున్న దృశ్యం అక్కడివారిని ఆలోచింపచేసింది. వేదికమీద ఉన్నవారు చెబుతున్న మాటలకు, కళ్ల ఎదుట కనిపిస్తున్న దృశ్యానికీ పొంతన లేకపోవటంతో చిన్నారులు కళ్ళుతెరిపించారని కొందరు బహిరంగగానే వ్యాఖ్యానించారు!.

డిజిటల్ క్లాస్‌రూమ్ ఏమైంది?

ప్రజాశక్తి-పొన్నూరు

మండల పరిధిలోని ఆరెమండ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం చేబ్రోలు వీరరాఘవమ్మ ఆ పాఠశాల డిజిటల్ క్లాస్ రూమ్‌కు రూ.50 వేలు ప్రకటించి మంగళవారానికి కచ్చితంగా ఏడాదైంది. అయితే ఈ ఏడాదిలో పాఠశాలలో ఎటువంటి మార్పు లేదు. 4వ విడత 'జన్మభూమి - మా ఊరు' గ్రామ సభను ఉద్దేశించి నాటి ఎంఇఒ నవీన్‌కుమార్ 'బడి రుణం తీర్చుకుందాం' కార్యక్రమాన్ని వివరించిన సందర్భంలో వీరరాఘవమ్మ రూ.50 వేలు విరాళం ప్రకటించారు. దీనికి ప్రభుత్వ పరంగా రూ. లక్ష అందే అవకాశం ఉంది. ఈ మొత్తంతో డిజిటల్ క్లాస్ రూమ్ ఏర్పాటవుతుందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. వారంతా అధికారులతో కలసి ఆమెకు శాలువాకప్పి సన్మానించారు. అయితే ఏడాదైనా పాఠశాలలో డిజిటల్ క్లాస్ రూం ఆరంభం కాలేదు.



వీరరాఘవమ్మను సన్మానిస్తున్న అధికారులు, గ్రామస్తులు (ఫైల్)

ప్రభుత్వం నుండి నిధులు రాలేదు

డిజిటల్ క్లాస్ రూమ్ కోసం నేను రూ.50 వేలు డిపాజిట్ చేసే ఉంచాను. అయితే ప్రాథమిక పాఠశాలలకు డిజిటల్ క్లాస్ రూమ్‌ల ఏర్పాటు సౌకర్యం లేకపోవటంతో ప్రభుత్వం నుండి రావాల్సిన రూ.లక్ష అందలేరు. అయినా నేను విరాళంగా ప్రకటించిన రూ.50 వేలను పాఠశాలకే వినియోగించాలనే దృక్పథంతో ఉన్నాం.

వీరరాఘవమ్మ, దాత, హెచ్‌ఎం, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, ఆరెమండ.

46 కుటుంబాలకు హెల్త్ కార్డులు పంపిణీ

ప్రజాశక్తి-అమర్తలూరు

గ్రామాల్లో నిరుపేదలకు ఎన్‌ఆర్‌ఐలు సహాయ, సహకారాలు అందించడం అభినందనీయమని సాంఘిక సంక్షేమ, గిరిజన శాఖా మంత్రి నక్కా ఆనందబాబు పేర్కొన్నారు. మండల పరిధిలోని మోపర్రులో మంగళవారం ఎపి ఎన్‌ఆర్‌టి సంస్థ ఆధ్వర్యంలో 46 పేద కుటుంబాలకు ఆరోగ్య కార్డులను మంత్రి ద్వారా మంగళవారం అందించారు. సందర్భంగా నిర్వహించిన సభకు సర్పంచ్ తుమాటి బాలరాజు అధ్యక్షత వహించారు. మంత్రి ఆనందబాబు మాట్లాడుతూ పుట్టిన గ్రామాలను ఎన్‌ఆర్‌ఐలు మరిచిపోకుండా ఆ గ్రామాల్లో ఆర్థికంగా వెనుకబడి వారికి సహాయం అందించడం సంతోషకరమైన విషయమన్నారు. కార్యక్రమంలో ఎంపిపి బి.నాగమల్లేశ్వరి, సంస్థ అధ్యక్షులు, ముఖ్యమంత్రి సలహాదారు, ఎన్‌ఆర్ఐ రవికుమార్, డైరెక్టర్ రాజశేఖర్, కో-ఆర్డినేటర్ మాధవి మేడి, టిడిపి నాయకులు కొడాలి నాగయ్య, రవీంద్రబాబు, క్రాప మహేంద్ర పాల్గొన్నారు.



కార్డులు అందిస్తున్న మంత్రి ఆనందబాబు

సమస్యలు పక్కన పెట్టి ప్రచారాలు విడ్డూరం : వైసిపి

ప్రజాశక్తి - పెదకాకాని

గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పట్టించుకోకుండా జన్మభూమి మా ఊరు పేరుతో ప్రభుత్వం ప్రచారాలు చేసుకోవడం విడ్డూరంగా ఉందని వైసిపి గుంటూరు పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు రావి వెంకటరమణ విమర్శించారు. ఈ మేరకు మండల కేంద్రమైన పెదకాకానిలోని వైసిపి కార్యాలయంలో మంగళవారం విలేకర్లతో మాట్లాడారు. మండల వ్యాప్తంగా గత నాలుగు విడత జన్మభూమిలో పింఛన్ల కోసం 1700, రేషన్ కార్డుల కోసం 1500, ఇళ్ల స్థలాల కోసం 5 వేలు, గృహ నిర్మాణం కోసం 500 దరఖస్తులు వచ్చాయని, వాటిని పరిష్కరించకుండా అధికారుల ద్వారా ప్రచారాలు చేయించుకుంటున్నారని అన్నారు. వైసిపి సర్పంచులను పక్కనపెట్టి జన్మభూమి కమిటీల పేరుతో టిడిపి నాయకులతో సభల్లో మాట్లాడించడం నీచ రాజకీయాలకు నిదర్శనమన్న రావి వైసిపి సర్పంచుల చెక్‌పవర్‌ను రద్దు చేయించడమే కాకుండా పనులకు అనుమతులు ఇప్పించడం లేదని, ఒక వేళ చేసినా బిల్లులు మంజూరవకుండా అడ్డు కుంటున్నారని ఆరోపించారు. జన్మభూమికి చేస్తున్న ఖర్చును ప్రజా సమస్యల పరిష్కారానికి వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి ఎం.శేషగిరిరావు, నాయకులు జి.శ్యాం ముఖర్జీ, సొసైటీ ఉపాధ్యక్షులు డి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.



విలేకర్లతో మాట్లాడుతున్న రావి వెంకటరమణ

దళితులపై దాడులు చేసిన వారిని శిక్షించాలి

ప్రజాశక్తి-అమర్తలూరు

పత్తిపాడు మండలం గొట్టిపాడు దళితులపై దాడులు చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని కెవిపిఎస్ తెనాలి డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు పి.జోనేష్, బొనిగల అగస్టిన్, వ్యవసాయ కార్మిక సంఘం డివిజన్ అధ్యక్షులు మట్టపూడి థామస్, సభ్యులు పులివర్తి రాజు, కూచిపూడి రాజబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన జారీ చేశారు. దళితులపై ఇంకా దాడులు చేయడం ఘోరమైన చర్య అని పేర్కొన్నారు. దాడులకు పాల్పడిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి దళితులకు రక్షణ కల్పించాలని, గ్రామంలో పోలీస్ బందోబస్తు నిర్వహించి శాంతిభద్రతలను కాపాడాలని కోరారు.

కేకులు, చాక్లెట్లు వద్దు.. యాపిల్ ముద్దు..

ప్రజాశక్తి - తాడేపల్లి

పిల్లలకు కేకులు, చాక్లెట్లు తినిపించవద్దని, వాటి బదులు యాపిల్ పండు పెడితే ఆరోగ్యానికి మంచిదని బూసిరెడ్డి జగన్ పేర్కొన్నారు. పట్టణ పరిధిలోని నులకపేట అంగన్వాడీ కేంద్రంలో బి.అభినవ్ పుట్టినరోజు సందర్భంగా అంగన్వాడీ పాఠశాలలో 20 మంది చిన్నారులు కూర్చునేందుకు కుర్చీలు మంగళవారం వితరణిచ్చారు. అనంతరం పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనచుట్టూ ఉన్న సమాజంకోసం ఎంతోకొంత చేయాలనే ఆలోచనతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు. అంగన్వాడీ కేంద్రానికి ఫ్యాన్లు, లైట్లు ఏర్పాటు చేసి కరెంటు బిల్లు తానే చెల్లించేలా జగన్ ముందుకు రావడంపై స్థానిక కౌన్సిలర్ ఈ.డేవిడ్ రాజు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో 12, 13 వార్డు కౌన్సిలర్లు ఎమ్‌డి.గోరెబాబు, కె.నిర్మల, ఎఎన్ఎంలు అన్నమ్మ, రాణి, లక్ష్మి, అంగన్వాడీలు పాల్గొన్నారు.



వేర్వేరు చోట్ల చోరీలు

ప్రజాశక్తి - తాడేపల్లి

తాడేపల్లి పట్టణంలో, ఉండవల్లి సెంటర్లో ఒకేరోజు పట్టపగలు రెండు ప్రాంతాల్లో దొంగలు తమ హవా కొనసాగించారు. ఉండవల్లి సెంటర్‌లోని నల్లపురాజు నరసింహరాజు ఇంట్లో తలుపులు గడియపగులకొట్టి దొంగలు లోనికి ప్రవేశించారు. బీరువా తలుపులు పగులకొట్టి అందులో ఉన్న రూ.80 వేలు నగదును దొంగలెత్తికెళ్లారు. ఈ ఘటనలో మిగతా వస్తువులు ఏమి దొంగలు ముట్టుకోకపోవడం చర్చనీయాంశమైంది. బాగా తెలిసినవారే ఈ దొంగతనం చేసి ఉంటారని భావిస్తున్నారు. పట్టణంలోని ప్రకాష్‌నగర్‌లో షేక్ జాన్‌బి ఇంట్లో దొంగలు పడి రెండు జతల బంగారు చెవిదిద్దులతోపాటు ఇత్తడి, రాగి, బకెట్, బిందె తీసుకెళ్లారు. ఈ రెండు దొంగతనాలు కూడా తెలిసినవారే చేసి


బీరువా తాళాలు పగులగొట్టిన దుండగలు

ఉంటారని భావిస్తున్నారు. బాధితులు తాడేపల్లి పోలీస్టేషన్లో ఫిర్యాదు చేశారు. తాడేపల్లి ఎస్ఐ ప్రతాప్‌కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కారంపూడి : చాకచక్యంగా చోరీ జరిగిన ఘటన మండల కేంద్రమైన కారంపూడి పోలీస్ స్టేషన్ సమీపంలో జరిగింది. బాధితుల కథనం ప్రకారం.. నరసరావుపేట రోడ్డులో ఉన్న సెయింట్ జాన్స్ ఇంగ్లీషు మీడియం స్కూల్ ఎదురుగా ఉన్న బడ్డీ బొంకులో దేవర కొండ అంకమ్మ అనే మహిళ చిరువ్యాపారం నిర్వహిస్తుంటుంది. సాయంత్రం 3.30 గంటల సమయంలో ఇద్దరు వ్యక్తులు బంకు వద్దకు వచ్చి సిగిరెట్లు కావాలని అడగగా ఆమె ఇవ్వటానికి వంగడంతో మెడలో ఉన్న నాలుగు సవర్ల బంగారు నాన్‌తాడు లాక్కుని నిందితులు పరారయ్యారు. జరిగిన ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్ఐ మురళీ, సిఐ బి.నరసింహారావు హుటాహుటిన ప్రధాన రహదారిలో ఉన్న జ్యూయలరీ షాపుల వద్ద సిసి కెమెరాలను పరిశీలించారు. అయితే ఆ నిందితులు 2.57 నిమిషాలకు కారంపూడి పోలీస్ స్టేషన్ కాంప్లెక్ వద్ద నుండి వెళ్లినట్లు సిసి కెమెరాలో గుర్తించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


నాంచారయ్య మృతదేహం

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - బాపట్ల

అనుమానాస్పద స్థితిలో హత్యకు గురైన వ్యక్తి మృతదేహం దుర్వాసన వెదజల్లటాన్ని గమనించిన స్థానికులు మంగళవారం పోలీసులకు సమాచారం అందించారు. పిట్టలవానిపాలెం మండలం ఖాజీపాలెం-పుచ్చకుట్టువారిపాలెం రహదారి మార్గంలో ఏటికట్ట సమీపంలో మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. పోలీసులు వివరాల ప్రకారం కర్లపాలెం మండలం దమ్మనవారిపాలెం గ్రామానికి చెందిన మన్నెం ఏడుకొండలు(45)ను ఎవరో హత్య చేసి ఏటికట్ట ప్రాంతంలో పొలాల్లో పడేశారు. శనివారం సాయంత్రం ఏడుకొండలు ఖాజీపాలెంలో మద్యం దుకాణం వద్ద కనిపించినట్లు స్థానికులు చెబుతున్నారు. మృతుని భార్య మన్నెం దేవి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఎప్పుడు హత్యకు గురైయ్యాడు. ఎవరు హత్య చేశారనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం బాపట్ల వైద్యశాలకు తరలించినట్లు చందోలు ఎస్ఐ చెన్నకేశవులు తెలిపారు. హత్య చేసిన వ్యక్తి యంవా పాం ళ్లు

నాంచారయ్య రేపల్లెలో పురుగులు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మృతదేహాన్ని గుర్తించిన కుటుంబ సభ్యులు

సత్తెనపల్లి రూరల్ : ఇటీవల సాగర్ కెనాల్‌లో లభించిన గుర్తు తెలియని మృత దేహాన్ని కుటుంబ సభ్యులు గుర్తించారు. పట్టణంలోని బార్బర్‌షాపు నిర్వహిస్తున్న పిల్లుట్ల శ్రీనివాసరావు(56)గా మంగళవారం గుర్తించారు. పట్టణంలోని 5వ వార్డుకు చెందిన పిల్లుట్ల శ్రీనివాసరావు రెండునెలల కిందట జరిగిన ప్రమాదంలో కాలు విరిగింది. దిన కార్యక్రమాలకు కటింగ్ చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గత శుక్రవారం శ్రీశైలం వెళ్తున్నాని ఇంట్లో చెప్పి వెళ్లిన శ్రీనివాసరావు సాగర్ కాలువలో శవమై తేలాడు. అయితే కుటుంబ సభ్యులు మాత్రం ప్రమాదవశాత్తు కాలువలోపడి మృతి చెంది ఉండవచ్చని భావిస్తున్నారు. గుడిపూడి విఆర్ఒ ప్రసన్న ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

మినీ లారీ బోల్తా

పొన్నూరురూరల్ : మినీ లారీ బోల్తా పడిన ఘటన పొన్నూరులో మంగళవారం చోటుచేసుకుంది. చందోలు నుంచి పొన్నూరుకు కోళ్లను తీసుకొచ్చే మినిలారీ బ్రిడ్జిపైకి వచ్చేసరికి టైరు బొల్టు ఊడి వాహనం బోల్తా కొట్టింది. ఈ ప్రమాదం ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు.



రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు


తాడేపల్లి వద్ద ప్రమాదంలో గాయపడిన బాబు


వినుకొండ వద్ద ప్రమాదంలో గాయపడిన గోవిందు

ప్రజాశక్తి - తాడేపల్లి

తాడేపల్లి ప్రకాశం బ్యారేజీ 41వ ఖానా వద్ద ఎదురెదురుగా వస్తున్న రెండు బైకులు ఢీకొన్నాయి. ఈప్రమాదంలో మంగళగిరికి చెందిన బాబు అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. బైకులు రెండు దెబ్బతిన్నాయి. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వినుకొండ రూరల్ : లారీ, ద్విచక్రవాహనం ఢీ కొని యువకుడికి గాయాలైన ఘటన మండలంలోని ఎ.కొత్తపాలెం వద్ద చోటుచేసుకుంది. వివరాల మేరకు ప్రకాశం జిల్లా తర్లుపాడు మండలం బుదంపల్లి గ్రామానికి చెందిన తిరుపతి గోవిందు పని నిమిత్తం తన ద్విచక్రవాహనం పై వినుకొండకు బయలుదేరాడు. మార్గమధ్యమైన వినుకొండ మండలం ఎ.కొత్తపాలం వద్దకు రాగానే వినుకొండ నుండి మార్కాపురం వైపు వెళ్తున్న లారీ ఢీ కొట్టింది. ప్రమాదంలో తిరుపతి గోవిందుకు గాయాలు కావటంతో 108 సాయంతో వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు.

చికెన్ ధరలు

గుంటూరు వెంకాబ్

(కిలో 1కి రూ.లలో)

బాయిలర్ రైతు ధర	:91
రిటైల్ ధర	:106
చికెన్ విత్ స్కిన్	:148
చికెన్ స్కిన్ లెస్	:175



నెక్ కోడిగుడ్ల ధరలు

రైతు ధర	: రూ.4.50
వినియోగదారుల ధర	: రూ.5.00



మిర్చి నిల్వలు

	బ్యాగులు
మిర్చి దిగుమతి	: 36,143
మిర్చి ఎగుమతి	: 39,428
మిర్చి నిల్వ	: 3,414

మిర్చి ధరలు

	రూపాయలలో
334	3,000-7,900
నెం.5	3,000-8,300
273	5,200-8,800
341	4,000-9,300
సూపర్-10	5,700-6,200
నాన్ ఎసి	
తేజ	2,800-12,000
బడిగి	3,000-10,800
దేవనూరు డీలక్స్	2,800-11,000
తాలుకాయలు	1,000-5,000
ఎసి	
334	2,100- 7,700
నెం.5	3,200-8,200
273	3,600-7,200
341	4,000-8700
సూపర్-10	6,300-6,400
తేజ	3,800-9,000
బడిగి	3,500-8,600
దేవనూరు డీలక్స్	6,000-8,500
తాలుకాయలు	5,00-4,500

రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య


ఆత్మహత్యకు పాల్పడిన గుర్తు తెలియని వ్యక్తి


ప్రజాశక్తి - తాడేపల్లి

కృష్ణాకెనాల్ జంక్షన్(తాడపల్లి) 5వ నెంబరు ప్లాట్‌ఫారంపై మంగళవారం గుర్తు తెలియని వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. తల విడిపోయి మొండం వేరుగా పడిపోయింది. మృతదేహంపై తెల్లటి షర్టు, స్నఫ్‌కలర్ ప్యాంటు ఉన్నాయి. రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇస్లామియా షరియత్‌కు త్రిబుల్ తలాఖ్ బిల్లు వ్యతిరేకం

ప్రజాశక్తి - మంగళగిరి

భారత రాజ్యాంగానికి ఇస్లామియా షరియత్‌కు ట్రిబుల్ తలాఖ్ బిల్లు విరుద్ధమని జమాఅతే ఇస్లామి హింద్ రాష్ట్ర మీడియా సెక్రటరీ మహ్మద్ అక్బర్‌బాషా అన్నారు. మంగళవారం మంగళగిరిలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ తెలిపారు. ఆర్టికల్ 25కు సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు విరుద్ధంగా ఉందని అన్నారు. ఈ బిల్లు షరియత్ ప్రకారం ఉందని చెబుతున్న ప్రభుత్వం బిల్లును తయారు చేసేటపుడు ముస్లిం మేధావులను, ధార్మిక పండితులను సంప్రదించకుండా అనాలోచితంగా ప్రవేశపెట్టారని విమర్శించారు. కెఐహెచ్ జిల్లా ఆర్గనైజర్ షఫీయున్నిసా, జెఐహెచ్ పట్టణ అధ్యక్షులు ఎహెచ్.షరీఫ్, తబ్లిక్ జమాఅత్ అధ్యక్షులు ఎండి.రఫీ, ఎస్‌కె.మున్నీర్, ఎండి.యుసుఫ్, ఎస్‌డి రషీద్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జమాఅతే ఇస్లామి హింద్ రాష్ట్ర మీడియా సెక్రటరీ అక్బర్‌బాషా



ఆర్టీసీ రిజర్వేషన్ సమాచారం

గుంటూరు ఎన్టీఆర్ బస్టాండ్ నుండి బుధవారం బయలుదేరే దూరప్రాంత బస్ సర్వీసులు, సీట్ల వివరాలను ఆర్టీసీ ఆర్ఎం జ్ఞానంగారి శ్రీహరి తెలిపారు. ముందస్తు రిజర్వేషన్ కోసం ఫోన్ నెం.08632221573లో సంప్రదించాలని పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం 4.00 గంటలకు బయలుదేరే బెంగళూరు సూపర్‌లగ్జరి 26, రాత్రి 9.45 గంటల ఇంద్ర ఎసి 39, రాత్రి 10.15 గంటల ఇంద్ర ఎసి 39, రాత్రి 11 గంటల కెపిహెచ్‌బి గరుడ ఎసి 39, రాత్రి 10.50 అమరావతి ఎసి 0, 11.15 గంటలకు కెపిహెచ్‌బి ఎసి 43, రాత్రి 8.30 గంటల చెన్నై సూపర్ లగ్జరీలో 26, విశాఖ సూపర్ లగ్జరీ రాత్రి 8 గంటలకు ఖాళీలు 34, రాత్రి 9.30 గంటలకు 32, తిరుపతి సూపర్ లగ్జరీ 6.45 గంటలకు 35 ఖాళీలు, 9.45 గంటలకు 35, 10.15 గంటలకు 33 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఎంక్వయిరీ నెం. 9959061597.

జిజిహెచ్ సమాచారం



గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో బుధవారం అందించే ఒపి, ఐపి వైద్య సేవలు, వైద్యుల వివరాలు..

జనరల్ మెడిసిన్: మూడవ యూనిట్ డాక్టర్ బి.శైలజ
శస్త్రచికిత్సలు: డాక్టర్ భవాని
గైనకాలజీ: డాక్టర్ సి.అనురాధ
ఆర్థోపెడిక్ : డాక్టర్ విఎన్.కృష్ణప్రసాద్
కార్డియాలజీ (సూపర్ స్పెషాలిటీ: డాక్టర్ ఎం.శ్రీనివాసరావు
రేడియోథెరపీ: డాక్టర్ డిఎస్ రాజునాయుడు
గాస్ట్రోఎంటరాలజీ: డాక్టర్ ఎ.కవిత
యూరాలజీ: డాక్టర్ యు సూర్యకుమారి
ప్లాస్టిక్ సర్జరీ: డాక్టర్ ఎం.మార్కండేయులు
చర్మ వ్యాధులు: డాక్టర్ ఎస్.నాగేశ్వరమ్మ
మానసిక విభాగం: డాక్టర్ ఎన్.మురళీకృష్ణ
చెవి, ముక్కు, గొంతు వ్యాధులు: డాక్టర్ ఎన్.శాంతయ్య
ఆప్తమాలజీ: డాక్టర్ ఉదయ్‌కుమార్
చిన్నపిల్లల విభాగం: ప్రొఫెసర్ డాక్టర్ యశోధర
యోగా నేచురోపతి: డాక్టర్ ఉమాసుందరి
జిజిహెచ్ ఫోన్ నెం: 0863-2220035
సూపరింటెండెంట్: డాక్టర్ డిఎస్ రాజునాయుడు - 9849903089
డిసిఎస్‌ఆర్ఎంఒ: డాక్టర్ కె.ఆదినారాయణ, సిఎఎస్ **ఆర్ఎంఒ:** డాక్టర్ వైరమేష్
నర్సింగ్ సూపరింటెండెంట్ : పుష్పావతి
ఒపి సమయం: ఉదయం 8 గంటల నుండి 11.30 గంటల వరకు
ఉచితంగా గుండె ఆపరేషన్లు అవసరమైనవారికి డాక్టర్ పాదిల ప్రసాద్ మిలీనియం బ్లాక్‌లోని రెండో ఫ్లోర్‌లో ప్రతిరోజూ వైద్యపరీక్షలు చేస్తారు.



గృహ నిర్మాణాల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సత్యప్రసాద్

గృహ నిర్మాణానికి అనగాని శంకుస్థాపన

ప్రజాశక్తి-నగరం/నిజాంపట్నం

నిజాంపట్నం, నగరం మండలాల్లో మంగళవారం నిర్వహించిన ఐదో విడత జన్మభూమి కార్యక్రమాల్లో ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ మాట్లాడారు. పేదల సొంతింటి కలను సాకారం చేస్తామని, అర్హులందరికీ రేషన్‌కార్డులు, పెన్షన్లు అందిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా నగరం గ్రామపంచాయితీ శివారులోని ఎస్టీ కాలనీకి అనగాని రంగారావు కాలనీగా నామకరణం చేసి అక్కడ నివసిస్తున్న పేదలకు విఆర్‌జి స్వచ్ఛంద సంస్థ సహకారంతో 33 గృహాల నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. నిజాంపట్నం మండలం పల్లపట్ల గ్రామంలో నిర్వహించిన జన్మభూమిలో రేషన్‌కార్డులు, పెన్షన్లు పంపిణీ చేయడంతోపాటు, డ్వాక్రా మహిళలకు 1.5 కోట్ల చెక్కు అందించారు. వివిధ సమస్యలపై అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ ఎస్.నాగశివరావు, ఎంపిపి వి.వీరయ్య, జెడ్పీటీసీ ఎం.వెంకట శివరామకృష్ణ, టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి జి.శ్రీనివాసరావు, పల్లపట్ల సర్పంచ్ ద్వారయ్య పాల్గొన్నారు.



రైతు రథం కింద ట్రాక్టర్‌ను అందిస్తున్న ఎమ్మెల్సీ అన్నం సతీష్

గ్రామాలను పూర్తిగా అభివృద్ధి చేస్తాం : ఎమ్మెల్సీ

ప్రజాశక్తి - బాపట్ల, బాపట్ల రూరల్

పట్టణంలోని 32వ వార్డు దగ్గుమల్లివారిపాలెంలో మంగళవారం నిర్వహించిన జన్మభూమి సభలో ఎమ్మెల్సీ అన్నం సతీష్‌ప్రభాకర్ మాట్లాడారు. గ్రామాలను పూర్తిస్థాయి అభివృద్ధి చేస్తామని చెప్పారు. ముందుగా కాకుమాను సాంఘిక సంక్షేమ వసతి గృహం విద్యార్థులు నిర్వహించిన పర్యావరణ ర్యాలీల పాల్గొన్నారు. గుడిపూడి, ఈతేరు, కర్లపాలెం మండలం నాగరాజుపాలెం, పిట్టలవానిపాలెం, కోడూరు సభల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ రైతు రథం పథకం కింద కోడూరుకు చెందిన ఐనంపూడి నరసింహారావునకు ట్రాక్టర్‌ను అందించారు. నియోజకవర్గ ప్రత్యేకాధికారి సోమేపల్లి వెంకట సుబ్బయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ తోట మల్లేశ్వరి, కమిషనర్ వెంకట కృష్ణయ్య, ఏఎంసి చైర్మన్ పి.ఆంజనేయరాజు ఎంపిపిలు వెంకటరత్నం, వెంకటసులోచన పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్

సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకుని అభివృద్ధి పథంలో పయనించాలని ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ సూచించారు. మామిళ్లపల్లి, దండమూడిలో జన్మభూమి సభలు నిర్వహించారు. మామిళ్లపల్లి సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. పశువుల వైద్యశాలలో వైద్యుడు లేక ఇబ్బంది పడుతున్నామని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తేగా నియామిస్తామని ఎమ్మెల్యే ప్రకటించారు. అనంతరం పింఛను ధ్రువపత్రాలు, రేషన్ కార్డులు, చంద్రన్న కానుకలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిపి బి.సీతమ్మ, ఎంపిడిఒ శ్రీనివాసరావు, ఎడిఎ తిరుమలదేవి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ ఎం.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మంత్రి ఎదుట నిలదీత

ప్రజాశక్తి - భట్టిప్రోలు

జన్మభూమి - మా ఊరు గ్రామసభల్లో తొలిరోజే వివిధ సమస్యలపై స్థానికులు నిలదీశారు. పలు అంశాలపై దరఖాస్తులిచ్చారు. దీంతో అధికారులు పక్కా సమాచారంతో వచ్చి ప్రజల ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలని అధికార్లకు సూచించారు. మండలంలోని చింతమోటు, పెదలంక, పెసర్లంక గ్రామాల్లో మంగళవారం సభలు నిర్వహించారు. పెసర్లంక డికె జెడ్‌పి పాఠశాలలో నిర్వహించిన సభలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి ఆనందబాబు మాట్లాడుతుండగా సిపిఎం నాయకులు ముమ్మనేని నాగేశ్వరరావు, జి.సుధాకర్, కె.రామస్వామి కలుగజేసుకున్నారు. రైతు రథం పేరుతో రైతులకు రాయితీపై అందిస్తున్న ట్రాక్టర్లు ఇష్టం వచ్చినవారికి ఇస్తున్నారని, లబ్ధిదార్ల జాబితాను అధికారులు వెల్లడించాలని కోరారు. వ్యవసాయ పరికరాలను అర్హులకు అందించడంలోనూ వివక్ష చూపుతున్నారన్నారు. గతేడాది ఉపాధి హామీ పనులు చేసిన కూలీలకు నేటికీ బిల్లులు అందలేదని, జన్మభూమి కమిటీలు సూచించిన వారికే ఎన్‌టిఆర్ గృహ నిర్మాణానికి అనుమతిస్తున్నారని చెప్పారు. వీటన్నింటిపై స్పష్టతివ్వాలని డిమాండ్ చేశారు. తొలుత పెదలంకలో సిసి రహదార్లను మంత్రి ప్రారంభించారు. అనంతరం రేషన్‌కార్డులు, పింఛను పత్రాలను పంపిణీ చేశారు.

ఆన్‌లైన్‌లో పొందుపర్చిన అందరికీ పింఛను ఇవ్వాలి

ఆన్‌లైన్ ద్వారా సిద్ధం చేసిన జాబితా ప్రకారం అందరికీ పింఛను మంజూరు చేయాలని వెల్లటూరు సర్పంచ్ చీకటి భుజంగరావు డిమాండ్ చేశారు. మండల వ్యాప్తంగా 746 మంది దరఖాస్తు చేసుకోగా 400 మాత్రమే మంజూరయ్యాయని, దీని ప్రకారం తమ గ్రామానికి 40కు మించి రావని అన్నారు. తమ గ్రామంలో ఇప్పటికే 93 దఖాస్తులు అర్హత పొందాయని, అందులో వికలాంగులు, వితంతువులకు చెందినవి 37 ఉన్నాయని పేర్కొన్నారు. మరోవైపు రేషన్ కార్డు కోసం 317 దరఖాస్తులు ఆన్‌లైన్‌లో అర్హత పొందినా తొలిరోజు సభలో 67 మాత్రమే అందించామని, మిగతావారికీ అందిస్తామని తహశీల్దార్ కెవిఎల్ ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి వి.సుధ, జెడ్‌పిటిసి బి.కుమారి, ఎంపిడిఒ పి.సునీత, సర్పంచులు పి.ప్రమీలరాణి, జి.విజయలక్ష్మీ, వి.సునీత పాల్గొన్నారు.





భట్టిప్రోలు మండలంలో పింఛను ధ్రువ పత్రాన్ని అందిస్తున్న మంత్రి ఆనందబాబు, అమర్తలూరు మండలంలో గురుకుల విద్యార్థినుల నృత్య ప్రదర్శన

ప్రజాశక్తి-అమర్తలూరు

కూడిపూడి పంచాయతీ కార్యాలయం వద్ద సభలో మంత్రి ఆనందబాబు మాట్లాడారు. 2017 రబీలో మినుము పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించాలని వ్యవసాయ కార్మిక సంఘం డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు మట్టుపూడి ధామస్, బొనిగల అగస్టిన్, కౌలురైతు సంఘం మండల నాయకులు పులివర్తి రాజు, కూచిపూడి రాజబాబు, సభ్యులు శాంసన్, మరియదాసు మంత్రికి వినతి పత్రం అందజేశారు. కూచిపూడిలో 400 మంది సుమారు 800 ఎకరాలల్లో పంట నష్టపోతే ఒక్కరికైనా పరిహారం అందలేదని చెప్పారు. వారం రోజుల్లోపు అందించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్‌పి మాజీ చైర్‌పర్సన్ కూచిపూడి విజయమ్మ, ఎంపిపి బొంతా నాగమల్లేశ్వరి, నియోజకవర్గ ప్రత్యేకాధికారి మల్లికార్జున రావు, మండల ప్రత్యేకాధికారి రామ్మోహన్, ఎంపిటిసి ఎం.విజయకుమారి, తహశీల్దార్ అజయ్ కుమార్‌రాజు, ఎంపిడిఒ పి.శ్రీనివాసు పాల్గొన్నారు. బాపట్ల గురుకుల పాఠశాల విద్యార్థినుల నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

ఎస్సీ కాలనీలో రూపాయి ఖర్చుపెట్టలేదు

మంత్రి శంఖుస్థాపన చేసిన రోడ్డుకే దిక్కులేదు

ప్రజాశక్తి-పొన్నూరు

మండలంలో అభివృద్ధి పనులు బాగా చేపట్టినట్లు జన్మభూమి వేదికపై నుంచి పలువురు నాయకులు చెప్పగా ఇదే వేదికపై నుంచి ఎంపిటిసి కె.అంకమ్మరావు మాట్లాడారు. ఎస్సీ కాలనీలో రూపాయి ఖర్చుపెట్టలేదని, రెండేళ్ల కిందట మంత్రి శంకుస్థాపన చేసిన రోడ్డుకు ఇప్పటికీ మోక్షం కలగలేదని ఎద్దేవా చేశారు. ఆరెమండ ఎంపిపి పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన జన్మభూమి సభకు సర్పంచ్ ఇండ్ల మంగమ్మ అధ్యక్షత వహించారు. ఎంపిటిసి కె.అంకమ్మరావు మాట్లాడుతూ మంత్రిగా రావెల కిషోర్‌బాబు పదవిలో ఉన్న రోజుల్లో శంకుస్థాపన చేసిన రోడ్డు ఇంత వరకు ప్రారంభం కాకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ఎస్సీ కాలనీలో మరో రోడ్డు శంకుస్థాపనకే పరిమితమైందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఒక్కో బృందం ద్వారా వంద రేషన్ కార్డులు



మాట్లాడుతున్న ఎంపిటిసి అంకమ్మరావు

సభల్లో రేషన్ కార్డులకు అర్హులైనవారు దరఖాస్తులు అందజేస్తే తహశీల్దారు బృందానికి వంద, ఎంపిడిఒ బృందానికి వంద చొప్పున రేషన్ కార్డులు మంజూరయ్యే అవకాశం ఉందని తహశీల్దార్ ఆర్ వెంకటరమణ నాయక్ తెలిపారు. రైతులు మీ-సేవ ద్వారా రూ.25లు చెల్లిస్తే, సింగిల్ షీట్ పాస్‌బుక్ కాపీని తీసుకోవచ్చని సూచించారు. 1-బి కాపిని ఉచితంగా అంజేస్తామన్నారు.

15 ఏళ్లుగా బస్సుల్లేవు..

ప్రజాశక్తి - పెదకాకాని

తమ గ్రామాలకు 15 ఏళ్లుగా ఆర్‌టిసి బస్సులు నడవడం లేదని మండలంలోని తంగెళ్లమూడి, అనమర్లమూడి గ్రామస్తులు వాపోయారు. జన్మభూమి సభల్లో వారు మాట్లాడుతూ గుంటూరు, తెనాలి, పెదకాకాని వెళ్లాలంటే ఇతర వాహనాలపై ఆధారపడాల్సి వస్తోందని, లేనివారు శేకూరు, హాఫ్‌పేటకు నడిచి వెళ్లాల్సిన దుస్థితి నెలకొందని చెప్పారు. గ్రామంలో మూడు అంగన్వాడీ కేంద్రాలకు గాను రెండు అద్దె భవనాల్లో నడుస్తున్నాయని, మరో భవనానికి విద్యుత్ సదుపాయం లేదని కార్యకర్తలు ప్రస్తావించారు. మండలానికి 58 ఇళ్లు మంజూరు కాగా 28 నిర్మాణంలో ఉన్నాయని అధికారులు పేర్కొనగా పొజిషన్ సర్టిఫికెట్ ఇవ్వడంలో అధికారులు జాప్యం చేస్తున్నందువల్లే ఈ పరిస్థితి నెలకొందని స్థానికులు అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ టి.శ్రీనివాసరావు, ఎంపిపి బి.చంద్రకళ, తంగెళ్లమూడి సర్పంచ్ బి.ఏసోబు పాల్గొన్నారు.

పలుచోట్ల జన్మభూమి గ్రామసభలు



ప్రజాశక్తి-తెనాలి

పట్టణంలోని 1, 2, 3, 4 వార్డుల్లో నిర్వహించిన జన్మభూమి సభల్లో ఎమ్మెల్యే ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడారు. 1వ వార్డులోని ఎన్ఎస్ఎస్ఎం ఉన్నత పాఠశాల అభివృద్ధికి రూ.2.42 కోట్లతో పనులు చేపట్టామని, పట్టణంలో 8 వేల మందిని గృహ నిర్మాణం కోసం గుర్తించామని చెప్పారు. ఇప్పటికే తొలివిడతగా 1152 మందికి ఇళ్ల నిర్మాణం చేపట్టినట్లు చెప్పారు. 1230 మందికి రెండో విడతలో మంజూరవుతాయన్నారు. 2014 తర్వాత ఇళ్లు నిర్మించుకున్న అర్హులకు రుణం ఇస్తామని చెప్పారు. అనంతరం రేషన్‌కార్డులు, పింఛన్లు, ఆయా ప్రభుత్వ పథకాలను లబ్దిదారులకు పంపిణీ చేశారు. మున్సిపల్ చైర్మన్ పెండేల వెంకట్రావు, ప్రత్యేకాధికారి ప్రసన్నలక్ష్మి, వైస్ చైర్మన్ షేక్ నియాజుద్దీన్, మార్కెట్‌యార్డు చైర్మన్ జి.సుబ్బయ్య, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తెనాలిరూరల్

సోమసుందరపాలెం, కంచర్లపాలెం సభల్లో రేషన్‌కార్డులు, వృద్ధాప్య పింఛన్లు మంజూరు ధ్రువపత్రాలు అందించారు. కంచర్లపాలెంలో రూ.15 లక్షలతో నిర్మించి న పంచాయతీ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఎంపీపీ ఎస్.వెంకట్రావ్, జెడ్పీటీసీ ఎ.జయలక్ష్మి, తహశీల్దార్ జీవీ సుబ్బారెడ్డి, ఎంపీడీవో జి.వాణి, సర్పంచులు ఆంతోని, నిర్మలకుమారి, ఎంపీటీసీ తులసీలక్ష్మి పాల్గొన్నారు.



వేమూరు మండలంలో ధ్రువపత్రాలిస్తున్న విజయబాబు

ప్రజాశక్తి-వేమూరు

చదలవాడ, కాకర్లమూడి సభల్లో వేమూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జొన్నలగడ్డ విజయబాబు మాట్లాడారు. బిడ్డ కడుపులో ఉన్నది మొదలు వృద్ధుల వరకూ రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమల్లో ఉన్నాయన్నారు. రేషన్ కార్డులు, పింఛను మంజూరు పత్రాలు, గృహనిర్మాణ మంజూరు పత్రాలను అందించారు. సర్పంచ్ కనకత్నం, ఎంపీపీ చవ్వాకుల రాఘవరావు, తహశీల్దార్ ఎ.కోటిరెడ్డి, ఎంపీడీవో కె.నరసింహరావు, స్పెషల్ ఆఫీసర్ సువర్చల పాల్గొన్నారు.

జన్మభూమిలో టిడిపి కార్యకర్తల వీరంగం

అడ్డుకున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - మంగళగిరి

పట్టణంలోని 3వ వార్డులో జరిగిన జన్మభూమిలో వార్డు కౌన్సిలర్ ఎం.రాగవీణపై దరఖాస్తు పూర్తిచేసే విధానంపై టిడిపి కార్యకర్త యుద్ధం అప్పారావు వీరంగం వేశారు. పక్కనే ఉన్న సిపిఎం పట్టణ కార్యదర్శి ఎస్ఎస్.చెంగయ్య టిడిపి కార్యకర్తను అడ్డుకోపోగా కార్యకర్త చెంగయ్యను పక్కకు నెట్టి ఘర్షణకు దిగారు. దీంతో పావుగంటకుపైగా తోపులాట జరిగింది. ఈ తోపులాటలో సిపిఎం పట్టణ కార్యదర్శి ఎస్ఎస్.చెంగయ్య, వై.కమలాకరరావు, కౌన్సిలర్ రాగవీణ గాయపడ్డారు. తోపులాట జరుగుతుండగా దరఖాస్తు చేసుకోవడానికి వచ్చిన పేదలు, అధికారులు భయాందోళనకు గురయ్యారు. ఇంతలో పోలీసులు రావడంతో సమస్య కొంతవరకు సద్దుమణిగింది. ఈమేరకు పట్టణ పోలీస్టేషన్లో కౌన్సిలర్ ఎం.రాగవీణ, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు వై.కమలాకరరావు ఫిర్యాదుచేశారు. అంతా అయిపోయిన తరువాత మున్సిపల్ చైర్మన్ గంజి చిరంజీవి, టిడిపి నాయకులు జన్మభూమి కార్యక్రమానికి హాజరయ్యారు. చిరంజీవి ప్రసంగించిన తరువాత మంజూరైన రేషన్‌కార్డులను పంపిణీ చేస్తున్నపుడు టిడిపి నాయకులు జి.ధనుంజయరావు మరల కార్యక్రమంలో గందరగోళం సృష్టించారు. దీంతో కొంతసేపు సిపిఎం నాయకులకు, టిడిపి నాయకులకు మధ్య వాగ్వాదం జరిగింది. మంగళవారం పట్టణంలోని 1,2 వార్డుల్లో జన్మభూమి కార్యక్రమం జరిగింది. జన్మభూమి కార్యక్రమంలో గతంలో పెన్షన్లు పంపిణీచేసేవారు. ఈ 5వ విడత జన్మభూమిలో ఆన్‌లైన్‌లో ఉన్న పెన్షన్ పేర్లు చదివి ఈ నెలాఖరుకు పెన్షన్లు పంపిణీచేయడం జరుగుతుందని ప్రకటించారు. 2వ వార్డులో జరిగిన జన్మభూమి కార్యక్రమంలో కొత్తపేట నివాస ప్రాంత ప్రజలు ఈ ప్రాంతంలో రిజిస్ట్రేషన్లు నిలిపివేశారని నిరసన వ్యక్తంచేశారు. రేషన్‌కార్డు, పెన్షన్‌కు వివిధ సమస్యల అర్జీలు ముందుగానే వ్రాసుకొని జన్మభూమికి ప్రజలు హాజరయ్యారు. అయితే అధికారులు మాత్రం ఆన్‌లైన్‌లో ఉన్న దరఖాస్తులు మాత్రమే స్వీకరిస్తామని చెప్పారు. ఆన్‌లైన్‌లో ఉన్న దరఖాస్తులు జన్మభూమి అధికారులకు కొన్ని మాత్రమే తీసుకొచ్చారు. అది పూర్తిచేసి ఇవ్వాల్సి ఉంది. దీంతో కొంత ప్రజలు గందరగోళపడ్డారు. అర్జీలు ఇచ్చినవారికి రశీదులు ఇవ్వడంలేదు. గతంలో రశీదులు ఇచ్చారు. ఆన్‌లైన్ దరఖాస్తులో ఫోన్‌నెంబర్లు వేస్తే ఫోన్‌కు మెసేజ్ వస్తుందని అధికారులు చెబుతున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ 1వ వార్డుకౌన్సిలర్ వివి.జవహర్‌లాల్, 2వ వార్డు కౌన్సిలర్ ఆర్.నరేంద్ర, మున్సిపల్ కమిషనర్ ఎన్‌వి.నాగేశ్వరరావు, డిఈ పి.ఏడుకొండలు, ఎఈ ఎం.వెంకటరామన్, టిపిఓ శ్రీనివాసరావు, ఆర్ఓ దివ్యకుమారి, టిపిఎస్ డి.మోహన్ బాబు, జన్మభూమి కమిటీ సభ్యులు మునగపాటి వెంకటమారుతిరావు పాల్గొన్నారు.



జన్మభూమిలో దరఖాస్తులు ఇస్తున్న పేదలు

ప్రభుత్వ పథకాల అమలెక్కడ..?

జన్మభూమిలో అధికారులను నిలదీసిన గ్రామస్తులు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

ప్రభుత్వం పేదలకు సంక్షేమపథకాలు పెడుతుందంటూ వాటిని వినియోగించుకోవాలంటూ ప్రజాప్రతినిధులు ఊదరగొడుతున్నారని, వాటి అమలుతీరుతెన్నులు ఎక్కడ అంటూ మండలంలోని పెదవడ్లపూడి గ్రామంలో గ్రామస్తులు అధికారులను నిలదీశారు. గ్రామంలో నెలకొని ఉన్న అనేక సమస్యలపై గతంలో పలుమార్లు వినతిపత్రాలు సమర్పించడం జరిగిందని, జన్మభూమి సభల్లో అధికారుల దృష్టికి కూడా తీసుకొచ్చామని, కానీ వాటి అమలు మాత్రం కనిపించడంలేదంటూ అధికారుల తీరును తప్పుబట్టారు. షుగరు ఫ్యాక్టరీ డొంక రోడ్డును, చిలువూరు రోడ్డులకుమరమ్మతులు చేపట్టాలని అనేకమార్లు విన్నవించామని కానీ అధికారులు మాత్రం పట్టించుకోవడంలేదన్నారు. గుంతలమయంగా రోడ్లు తయారైనా స్పందించరా అంటూ అధికారుల తీరుపై మండిపడ్డారు. గ్రామంలో ఇద్దరే విద్యుత్ సిబ్బంది ఉన్నారని ఎంతోకాలంగా సిబ్బందిని పెంచాలని కోరుతున్నా ఎందుకు పట్టించుకోవడంలేదంటూ ప్రశ్నించారు. ఎంపిటిసి సభ్యులు అన్నె శేషారావు మాట్లాడుతూ నీటి సమస్య పరిష్కారం ఎప్పుడంటూ అధికారులను ప్రశ్నించారు. రూ.7కోట్లతో ప్రతిపాదనలుసిద్ధం చేశామని చెబుతున్నారని, కానీ చింతల కుంటలో ఏర్పాటుచేసిన వాటర్ ట్యాంకు నిరుపయోగంగాపెటారని, దాన్ని వినియోగంలోకి ఎప్పుడు తీసుకొస్తారంటూ ప్రశ్నించారు. ఇప్పటికైనా దాన్ని వినియోగంలోకి తీసుకురావాలని కోరారు. మండల పరిషత్ ఉపాధ్యక్షులు మొసలి పకీరయ్య మాట్లాడుతూ పథకాలు బాగున్నప్పటికీ ప్రజల్లోకి తీసుకెళ్ళడంలో సమన్వయ లోపం అధికారుల్లో నెలకొని ఉండటం వలన పేదలకు అవిచేరడంలేదన్నారు. వెంటనే ఆయా లోపాలను సరిదిద్దుకొని పథకాలను పేదలకు అందించాలన్నారు. షుగరు ఫ్యాక్టరీ డొంకరోడ్డు మరమ్మతులకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తామని ఈ సందర్భంగా హామీనిచ్చారు. జడ్పిటిసి ఆకుల జయసత్య మాట్లాడుతూ ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమపథకాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామంలో అభివృద్ధి పనులకు సంబంధించి మండలపరిషత్, జిల్లా పరిషత్ నిధులను వినియోగించుకొని గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. అనంతరం పేదలకు రేషన్‌కార్డులు, పింఛన్లు పంపిణీచేశారు. వైద్య సిబ్బంది గ్రామస్తులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారిణి లక్ష్మి, గ్రామ సర్పంచ్ చిట్టిబొమ్మ వెంకటేశ్వరరావు, తహశీల్దార్ బి.వసంతబాబు పాల్గొన్నారు.



రేషన్‌కార్డులు పంపిణీచేస్తున్న జడ్పిటిసి

బతికిఉన్నా.. మరణించినట్లు పింఛను నిలిపేశారు

ప్రజాశక్తి - తాడికొండ

ప్రతి పేదవాడికి ప్రభుత్వ పథకాలు అందాలనే ఉద్దేశ్యంతో జన్మభూమి- మా ఊరు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని జడ్పి వైస్‌చైర్మన్ వడ్లమూడి పూర్ణచంద్రరావు అన్నారు. మంగళవారం తాడికొండ మండలంలోని కంతేరు, నిడుముక్కల గ్రామాల్లో జన్మభూమి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రతి కుటుంబం నెలకు రూ.10వేలు ఆదాయం ఉండేలా ప్రభుత్వం సహాయపడుతుందని ఆయన అన్నారు. నిడుముక్కల గ్రామంలో మహిళలు తమకు అర్హత ఉన్నా పెన్షన్ మంజూరు చేయడంలేదని, బ్రతికి ఉన్నా తమను మరణించినట్లు పెన్షన్ నిలిపివేశారని మహిళలు వైస్ చైర్మన్‌కు వివరించారు. వైస్‌చైర్మన్ పరిశీలించి న్యాయం చేస్తామని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో అధికారులు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించండి : ఎమ్మెల్సీ

ప్రజాశక్తి - తాడేపల్లి

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని ఎమ్మెల్సీ ఎఎస్.రామకృష్ణ కోరారు. మనఊరు - జన్మభూమి కార్యక్రమం చిర్రావూరు గ్రామంలో సర్పంచ్ అద్దెపల్లి వెంకటరమణకుమారి అధ్యక్షతన జరిగింది. జన్మభూమి పరిశీలకులు ఐఎఎస్ అధికారి జె.మురళి మాట్లాడుతూ జన్మభూమి యొక్క విశిష్టతను తెలిపారు. సభలో జడ్పిటిసి డి.శైలజారాణి, తహశీల్దార్ పద్మనాభుడు, ఎండిఒ బాలునాయక్, రూరల్ అధ్యక్షులు కొమ్మారెడ్డి కిరణ్, పెనుమాక సర్పంచ్ కళ్ళం పానకాలరెడ్డి పాల్గొన్నారు.

సమస్యలపై సిపిఎం వినతిపత్రం


చిర్రావూరులో జరిగిన సభలో సిపిఎం నాయకులు వినతిపత్రం అందజేశారు. పశు సంపద ఎక్కువగా ఉన్న గ్రామంలో పశువుల డాక్టర్‌ను నియమించాలని కోరారు. అసం పూర్తిగా ఉన్న పశువుల ఆసుపత్రి నిర్మాణాన్ని వెంటనే పూర్తిచేయాలని పేర్కొన్నారు. గ్రామంలో ఇసుక క్వారీలు మూతపడి 200 కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆందోళన వ్యక్తంచేశారు. మరోవైపు 60 ట్రాక్టర్లు కొనుగోలుచేసినవారు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వీటిని దృష్టిలో పెట్టుకొని వెంటనే ఇసుక క్వారీ తెరిపించాలని కోరారు. గ్రామంలో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్థంగా ఉందని, సరిచేయాలని కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుఎన్నికల్లో ఇళ్ళ స్థలంలేని ప్రతికుటుంబానికి 3 సెంట్లు స్థలం ఇస్తామని, ఇళ్ళు నిర్మించి ఇస్తామని చెప్పిన వాగ్ధానాలు నెరవేర్చాలని కోరారు. రైతులు పండించినపంటకు గిట్టుబాటు ధరలు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రూరల్ కార్యదర్శి దొంతిరెడ్డి వెంకటరెడ్డి, పంచాయతీ పాలకవర్గ సభ్యులు ఎం.ఆదిలక్ష్మి, బొప్పన గోపాలరావు, మేడూరి పాములు, పోకల శంకరరావు, పరిమిశెట్టి శివనాగేశ్వరరావు పాల్గొన్నారు

శ్మశానవాటికకు ప్రహరీ

ప్రజాశక్తి - దుగ్గిరాల

మండలంలోని పెదకొండూరు గ్రామంలో మంగళవారం జరిగిన జన్మభూమి కార్యక్రమంలో జెడ్పిటిసి జయలక్ష్మి పాల్గొన్నారు. ఇటీవల గ్రామ దళితవాడ శ్మశానవాటికలో గోడ నిర్మించే క్రమంలో సమాధులు పగులకొట్టారని స్థానిక దళితవాడకు చెందిన యువకులు జన్మభూమి కార్యక్రమంలో ఒకింత ఆగ్రహం వ్యక్తంచేశారు. దీంతో జెడ్పిటిసి, మాజీ సర్పంచ్ కుంపటి వెంకటరత్నం సర్వే చేయించిన అనంతరం గోడ నిర్మించేందుకు కృషిచేస్తామని శ్మశానవాటికలో ఉన్న కంప మొత్తాన్ని వెంటనే తొలగిస్తామన్నారు. అంతకుముందు ట్రైనీ కలెక్టర్ స్వప్నిల్ పుండేకర్ మాట్లాడుతూ సమస్యలపై ఇచ్చిన అర్జీలకు రశీదులు తీసుకోవాలని, సమస్యల పరిష్కారానికి జన్మభూమి కార్యక్రమాన్ని వినియోగించుకోవలసిందిగా కోరారు. అనంతరం 10వ తరగతి విద్యార్థినీ విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్ అందజేయడంతోపాటు, గర్భిణులకు శ్రీమంతం నిర్వహించి పౌష్టికాహారాన్ని అందజేశారు. గొడవర్రు గ్రామంలో జరిగిన జన్మభూమి కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు, జన్మభూమి కమిటీ సభ్యులు గూడూరు వెంకట్రావు మాట్లాడుతూ ప్రజల సమస్యలు అధికారులు వెంటనే పరిష్కరించాలన్నారు.

శ్మశాన వాటిక స్థలంపై ఆగ్రహం వ్యక్తంచేస్తున్న స్థానికులు



సిపిఐ నేత ఎబి.బర్ధన్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి - మంగళగిరి

సిపిఐ నేత ఎబి.బర్ధన్ 2వ వర్ధంతి సందర్భంగా సిపిఐ కార్యాలయంలో బర్ధన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, వైస్ చైర్మన్ నందం బ్రహ్మేశ్వరరావు పాల్గొన్నారు.

ఐఇఎ అధ్యక్షులకు ఆర్‌కె సన్మానం

ప్రజాశక్తి - మంగళగిరి

ఐఇఎ అధ్యక్షులు సూర్యదేవర మహేంద్రదేవ్‌ను మంగళవారం ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు ఉపయోగకరమైన నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైసిపినాయకులు పాల్గొన్నారు.

ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ

ప్రజాశక్తి - మంగళగిరి

శ్రీ భద్రావతి సమేత భావనాఋషి స్వామి కళ్యాణ మహోత్సవ ఆహ్వానపత్రిక మంగళవారం పాతమంగళగిరి కళ్యాణమండపంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు మునగాల భాస్కరరావు, ఉపాధ్యక్షులు పి. లక్ష్మణరావు, కార్యదర్శి మునగాల వెంకటేశ్వరరావు, సహాయ కార్యదర్శి ఊట్ల సాంబశివరావు పాల్గొన్నారు.

హెల్ప్ యువర్ హార్ట్‌నెవర్ సంస్థ వితరణ

ప్రజాశక్తి - మంగళగిరి

శివముక్కోటి సందర్భంగా పట్టణంలోని శివాలయంలో హెల్ప్‌యువర్ హార్ట్‌నెవర్ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం పేదలకు, సాధువులకు వస్త్రాలను పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు కాకుమాను భాగ్యేశ్వరరావు, చేనేత జాతీయ బోర్డు సభ్యులు జగ్గారపు శ్రీనివాసరావు, శివాలయం ట్రస్టుబోర్డు చైర్మన్ బోగి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

6 నుండి జన్మభూమి క్రీడాపోటీలు

ప్రజాశక్తి - మంగళగిరి

జన్మభూమి కార్యక్రమం సందర్భంగా విటిజెఎం అండ్ ఐవిటిఆర్ డిగ్రీ కళాశాలలో ఈ నెల 6వ తేదీనుండి 9వ తేదీవరకు ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లుగా టోర్నమెంట్ కార్యదర్శి డాక్టర్ రాజామెర్సిన్ మంగళవారం తెలిపారు. మహిళల కబడ్డీ పోటీలు, త్రోబాల్ పోటీలు, పురుషులకు కబడ్డీ, వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లుగా తెలిపారు. పోటీల్లో సికె.జూనియర్ కాలేజీ, నిర్మల జూనియర్ కాలేజీ, విజె జూనియర్‌కాలేజీ, శ్రీచైతన్య జూనియర్‌కాలేజీ, నారాయణ జూనియర్ కాలేజీ, గురూస్ అకాడమీ నిర్మల ఫార్మశీ కాలేజి, విజె డిగ్రీ కాలేజి, విజెపి అండ్ డిఎల్‌బి డిగ్రీ కాలేజీ, విటిజెఎం అండ్ ఐవిటిఆర్ డిగ్రీ కాలేజీ విద్యార్థులు పాల్గొనాలని తెలిపారు. 6వ తేదీలోపు పేర్లు నమోదుచేసుకోవాలని కోరారు.

సేంద్రీయ వ్యవసాయ పొలాల్లో పరిశీలన

ప్రజాశక్తి - దుగ్గిరాల

రసాయనిక ఎరువులు తగ్గించి సేంద్రియ వ్యవసాయాన్ని పెంచుకోవాలని జగదీశ్వర్ గోవర్ధన్ హైకమిషన్ ఆఫ్ మారిషస్ అన్నారు. మండలంలోని రేవేంద్రపాడు గ్రామంలో సేంద్రియ వ్యవసాయం చేస్తున్న పొలాలను ఆయన మంగళవారం పరిశీలనకు వచ్చారు. డాక్టర్ సుభాష్ పాలేకర్ ఆధ్వర్యంలో గుంటూరులో జరుగుతున్న సేంద్రియ వ్యవసాయం శిక్షణా కార్యక్రమంలో శిక్షణ ఇవ్వడానికి వచ్చిన సందర్భంగా ఆయన పొలాలను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ (సేంద్రియ వ్యవసాయం) రామ్మోహ నరావు, ఎడిఎ ఆంజనేయులు, ఎఈఒ సౌజన్య పాల్గొన్నారు.

వడ్డేశ్వరం హైస్కూల్లో క్లీన్ అండ్ గ్రీన్

ప్రజాశక్తి - తాడేపల్లి

మనిషి జీవన మనుగడకు మొక్కలు తోడ్పడతాయని వడ్డేశ్వరం హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు తెలిపారు. మంగళవారం పాఠశాలలో మొక్కల పెంపకం యొక్క ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మొక్కలకు సేంద్రియ ఎరువులు వేయించారు. వాటికి నీటి సరఫరా కోసం కాలువలు తీయించి శుభ్రం చేశారు. మనిషికి కావలసిన ఆక్సీజన్ మొక్కలు విడుదలచేస్తాయని, కార్బన్‌డై ఆక్సైడ్‌ను తీసుకొని మనిషికి తోడ్పడతాయని ఈసందర్భంగా వివరించారు. క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు ఆయన చెప్పారు.

ప్రచారార్భాటాలకే

భూముల్లో నివాసముంటున్న పేదలకు పట్టాలు మంజూరు చేయాలని కోరారు. రెగ్యులరైజేషన్ చేస్తామని ఆర్భాటంగా జిఒలు జారీ చేసినా ఆచరణలో అమలు జరగలేదన్నారు. జన్మభూమి కార్యక్రమంలో ఆర్భాటంగా ప్రకటనలు చేయడం తప్ప ఆచరణలో శూన్యమన్నారు. ఒక వైపు రాజధానిలో వేలాది ఎకరాలు రకరకాల ప్రభుత్వ భూములను సేకరిస్తూ, ఇళ్ళ స్థలాలకు సేకరించే భూములకు నిబంధనలు వర్తించవని చెప్పడం ప్రభుత్వ ద్వంద నీతికి నిదర్శనమన్నారు. జిల్లాలో అర్హులైన పేదలందరికీ వృద్ధాప్య, వితంతు, వికలాంగుల పెన్షన్లు, రేషన్ కార్డులు ఇవ్వాలని, ఎస్సీ కార్పోరేషన్ ద్వారా దళితులకు ఋణాలు మంజూరు చేయాలని, జన్మభూమి కమిటీల ప్రమేయం లేకుండా గ్రామ సభల్లోనే సంక్షేమ పథకాలను లబ్ధిదారులను ఎంపిక చేయాలని కోరారు.

దళితులపై దాడికి ఖండన

ప్రత్తిపాడు మండలం పెదగొట్టిపాడులో దళితులపై అగ్రకుల పెత్తందార్లు జరిపిన దాడిని సిపియం జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తున్న రామారావు పేర్కొన్నారు. చిన్న వివాదాన్ని ఆధారం చేసుకుని దళితులపై దాడి చేయడం సరికాదన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 70 సంవత్సరాలైనా దళితులపై దాడులు నిత్యకృత్యమయ్యాయని, ప్రభుత్వ అధికారులు స్పందించి నిందుతులను తక్షణమే అరెస్టు చేయాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగు చర్చలు తీసుకోవాలన్నారు. సమావేశంలో సిపియం జిల్లా నాయకులు వై.రాధాకృష్ణ, యన్.కాళిదాసు ఇ.అప్పారావు పాల్గొన్నారు.

గుంటూరుకు ఇద్దరు తహసీల్దార్లు

రెండుగా విభజన కానున్న రెవెన్యూ మండలం
మారనున్న మండల సరిహద్దులు

ప్రజాశక్తి-గుంటూరు సిటీ ప్రతినిధి

గుంటూరు రెవెన్యూ మండలాన్ని రెండు మండలాలుగా విభజిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు గుంటూరు నగరం, రూరల్ గ్రామాలకు కలిసి ఒకే రెవెన్యూ మండలం కొనసాగింది. ఇకమీదట గుంటూరు తూర్పు, గుంటూరు పశ్చిమ నియోజకవర్గాలకు వేర్వేరు మండలాలు ఏర్పాటయ్యాయి. వీటికి మండలంలోని గ్రామాలను కూడా కలుపుతూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ డాక్టరు మన్మోహన్‌సింగ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఇద్దరు తహసీల్దార్లు నియమితులవుతారు. గుంటూరు తూర్పు మండలం కింద గుంటూరు తూర్పు నియోజకవర్గం, జొన్నలగడ్డ, గోరంట్ల, ఏటుకూరు, బుడంపాడు, గుంటూరు నగరంలోని రెడ్డిపాలెం ను ఏర్పాటు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. గుంటూరు పశ్చిమ మండలం కింద గుంటూరు పశ్చిమ నియోజక వర్గం, కొరిటెపాడు, రామచంద్రాపురం అగ్రహారం(ఆర్ అగ్రహారం), పెదపలకలూరు, చినపలకలూరు, నల్లపాడు, అంకిరెడ్డిపాలెం, పొత్తూరు, చౌడవరం కేటాయిస్తూ నిర్ణయం తీసుకున్నారు.

టిడిపికి గుబులు పుట్టిస్తున్న వైసిపి హామీలు

ప్రజాశక్తి-గుంటూరు అర్బన్

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముందుగానే రాష్ట్ర ప్రయోజనాల కోసం ఇస్తున్న హామీలను చూస్తుంటే టిడిపి నేతలకు గుండెల్లో గుబులు పుడుతుందని ఆ పార్టీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి తిప్పారెడ్డి రామకృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ వైఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రైతులకు స్వర్ణయుగం వస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదని తెలిపారు. ప్రజా సంకల్ప యాత్రలో జగన్మోన్‌రెడ్డి రైతులకు అనేక వరాలు ఇచ్చారని ఆ వరాలన్ని నెరవేరే రోజు దగ్గరలో ఉందని ఆయన తెలిపారు. కర్ణాటకలో మాదిరిగా మన రాష్ట్రంలో పాడిపరిశ్రమను అభివద్ధి చేసేందుకు జగన్ సిద్ధమయ్యారు పేర్కొన్నారు. ప్రతి ఏటా సన్న చిన్న కారు రైతులకు రూ.12 500 ఇస్తామని, పంట వెయ్యక ముందే గిట్టుబాటు ధర ఇస్తామని వైకాపా అధినేత చెప్పారని గుర్తు చేశారు. దీని వల్ల రైతుకు ఎంతోలాభదాయకంగా ఉంటుందని రైతులను ఆదుకునేందుకు ధరల స్థిరీకరణ నిధి మూడు కోట్లతో ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ఈ హామీలను అమలు చేయడం జగన్మోహన్‌రెడ్డికి సాధ్యమవుతుందన్నారు. వ్యవసాయ అనుబంధమైన పాడి పరిశ్రమను అభివద్ధి చేసేందుకు జగన్ కంకణం కట్టుకున్నారని ఆయన అన్నారు. కొంతమంది టిడిపి నేతలకు జగన్ యాత్ర చూసి బెంబేలెత్తున్నారని ఆయన ఆరోపించారు. ఇప్పటికైనా టిడిపి నేతలు నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడితే మంచిదని ఆయన హితవు పలికారు.

పెత్తందార్ల పనులకు రావడం లేదని పథకం ప్రకారమే దాడి

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం పెదగొట్టిపాడులో దళితులపై పెత్తందార్లు దాడికి పాల్పడిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో భయాందోళనలో ఉన్న ఎస్సీ కాలనీని కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆంఢ్ర మాల్యాద్రి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు, భీమ్ పత్రిక ఎడిటర్ మాతంగి దిలీప్‌కుమార్, దళిత నాయకులు ప్రసాద్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా దళితులతో మాట్లాడి వివరాలు సేకరించారు. వివాదమైనప్పటి నుండి తమను పనులకు పిలవడం లేదని మహిళలు పేర్కొన్నారు. ఈ క్రమంలో అక్కడికి వచ్చిన జిల్లా అర్బన్ ఎస్‌పి సిహెచ్ విజయరావుతో మాల్యాద్రి మాట్లాడి స్థానికుల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఎస్‌పి మాట్లాడుతూ ఎవరికీ ఇబ్బంది రానివ్వబోమని, డ్రోన్ కెమెరాల ద్వారా పరిస్థితిని పర్యవేక్షిస్తున్నామని, కొన్నిరోజుల పాటు 144 సెక్షన్ అమలులో ఉంటుందని చెప్పారు.

అనంతరం స్థానిక దళితులను ఉద్దేశించి ఆంఢ్ర మాల్యాద్రి మాట్లాడుతూ చిన్న ఘటనను ఆసరగా చేసుకున్న పెత్తందార్లు తమ స్వార్థ, రాజకీయ ప్రయోజనాల కోసం దళితులపై దాడికి పాల్పడ్డారని అన్నారు. ఖాళీ బీరు సీసాలు, గులకరాళ్లు, కర్రలను వాహనాల్లో పెట్టుకున్న పెత్తందార్లు మధ్యాహ్నం 12 గంటల సమయంలో చర్చిలో ప్రార్థనలకు వెళ్లిన సందర్భంలో దాడికి పాల్పడ్డం చూస్తుంటే ఇది పథకం ప్రకారం చేసిన దాడి మాదిరే ఉందన్నారు. గ్రామంలో ఏళ్ల తరబడి తీవ్ర వివక్ష కొనసాగుతోందన్న మాల్యాద్రి వందల ఏళ్ల నుండి మాదిగల అధీనంలో ఉన్న కుంటలోకి వారిని రానివ్వకుండా రెండేళ్ల కిందట అడ్డుకున్నారని గుర్తు చేశారు. ఆ సమస్య నేటికీ పరిష్కారం కాలేదని, అనేక రూపాల్లో వివక్ష కొనసాగుతోందని చెప్పారు. టిడిపి అధికారంలోకి వచ్చాక దళితులపై దాడులు పెరిగాయన్న మాల్యాద్రి గరగపర్రులో సామాజిక అణచివేత, మహాభారత కార్యక్రమంలో దళితులను బహిష్కరణ ప్రకాశం జిల్లా దేవరపల్లి, గుంటూరు జిల్లా యడ్లపాడు, నాదెండ్ల మండలాల్లోని దళితుల పొలాల్లో మట్టి తవ్వకాల ఘటనలను గుర్తు చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు మాట్లాడుతూ ఇక్కడ దళిత వాడలో ఇంటికొకరు డిగ్రీ, పీజీ, బీటెక్ చేసిన విద్యార్థులున్నారని చెప్పారు. వీరంతా ప్రభుత్వం ఇచ్చే ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా సొంతకాళ్లపై నిలబడ్డారని, యువకులంతా భవన నిర్మాణ కార్మిక పనులకు వెళ్తూ ద్విచక్ర వాహనాలు కొనుక్కున్నారని అన్నారు. ఇక్కడి వారు కష్టపడే తత్వం ఉన్నవారేగాని గొడవలకు పోయేవారు కాదన్నారు. అయితే వీరంతా వ్యవసాయ పనులకు వెళ్లకుండా ఇతర పనులకు వెళు న్నారని, తమ అవసరాలకు కూలీలు దొరకని పెత్తందార్లు దళితులపై అక్కసు పెంచుకున్నారని, దాడిలో వారి స్వార్థ ప్రయోజనమే కనిపిస్తోందని చెప్పారు. దళిత వాడను జిల్లా కలెక్టర్, ఎస్‌పి సందర్శించి 24 గంటలైనా దాడి చేసినవారిని అరెస్టు చేయకపోవడం దారుణమన్నారు. దళితవాడలోకి దళిత సంఘాలు, నాయకులను రానివ్వకుండా ఒంటరిని చేసి భయపెడుతుండడం బాధాకరమన్నారు. 'బాంబులు కూడా తెచ్చాం.. సర్వనాశనం చేస్తాం..' అని పెత్తందార్ల హెచ్చరికలతో దళితులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని బతుకుతున్నారని ఆవేదన వెలిబుచ్చారు. 'ఐదు నిమిషాలు కళ్లు మూసుకోండి.. లేదా పక్కకైనా వెళ్లండి' అని పోలీసులతోనే అంటున్నారంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చని దుయ్యబట్టారు. పరిశీలనలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు, సిఐటియు ప్రత్తిపాడు నియోజవకర్గ కన్వీనర్ కె.ఆదినారాయణ పాల్గొన్నారు. ఇదిలా ఉండగా దాడి చేసినవారిని అరెస్టు చేసి అట్రాసిటీ కేసు పెట్టాలని, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని, వైద్యం అందకుండా అడ్డుపడుతున్న పెత్తందార్లను అరెస్టు చేయాలని, దళితులకు రక్షణ కల్పించాలని, ధ్వంసానికి గురైన నాలుగు ద్విచక్ర వాహనాలను బయటకు తేవాలని నాయకులు డిమాండ్ చేశారు. అనంతరం గ్రామంలో ప్రజా సంఘాల నిజనిర్ధారణ కమిటీ పరిశీలన చేపట్టింది. వారిలో పౌరహక్కుల సంఘం రాష్ట్ర కార్యదర్శి చిలకా చంద్రశేఖర్, కెఎన్‌పిఎస్ రాష్ట్ర కార్యదర్శి కె.కృష్ణ, నాగేశ్వరరావు, నల్లపాటి రామారావు, పి.సాంబశివరావు, బి.విజయభాస్కరరావు ఉన్నారు.



53 మందిపై కేసు - మోహరించిన పోలీసులు

ఇదిలా ఉండగా ఇరుపక్షాలకు చెందిన 53 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వీరిలో 35 మంది ఎస్సీలు కాగా 18 మంది పెత్తందార్లవడం గమనార్హం. మరోవైపు గ్రామంలో పోలీసులు పెద్దఎత్తున మోహరించారు. ఇద్దరు డిఎస్‌పిలు, నలుగురు సిఐలు, 8 ఎస్ఐలు, 150 మంది సిబ్బంది విధుల్లో ఉన్నారు.

మంత్రిని కలిసిన దళితసంఘాలు

మంత్రి నక్కా ఆనందబాబు దళిత సంఘాలతో గుంటూరు నగరంలోని తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం సమావేశమయ్యారు. దళితులపై దాడిచేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం నిష్పక్షపాతంగా విచారణ జరుపుతున్నదని, సమస్యను సామరస్య పూర్వకంగా పరిష్కరించేందకు కృష చేస్తున్నదన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో భూతాపం పెరగదు

సుభాష్ పాలేకర్



ప్రజాశక్తి-గుంటూరు సిటీ ప్రతినిధి

నాడెపు కంపోస్టు, వర్మి కంపోస్టు, పెంటకుప్ప (దిబ్బ) కంపోస్టుల వల్ల అనేక హరిత గృహవాయువులు వెలువడి, భూతాపం పెరిగి అనూహ్య ఘటనలు చోటుచేసుకుంటున్నాయని, దీనివల్ల మిత్ర కీటకాలు నశించి, అతి వృష్టి, అనావృష్టి సంభవిస్తున్నాయని, రైతులు ప్రకృతి వ్యవసాయంను అనుసరించటం వల్ల భూతాపం పెరగదని ప్రకృతి వ్యవసాయం ప్రచార సారధి సుభాష్ పాలేకర్ అన్నారు.

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదురుగా బైబిల్ మిషన్ ప్రాంగణంలో పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయంపై రైతు శిక్షణా కార్యక్రమం మంగళవారం కొనసాగింది. ఈ సందర్భంగా పాలేకర్ మాట్లాడుతూ ఈ దేశంలో 7 లక్షల మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడటం విచారకరమన్నారు. రైతులు తరుచుగా ఎదుర్కొనే ఇబ్బందులను, వాటిని ఏవిధంగా ఎదుర్కోవాలో వివరించారు. హ్యూమస్, ఆచ్ఛాదన, జడ్‌బిఎన్‌ఎఫ్, గ్రామంలో ఉన్న సంపదను ఏవిధంగా ఉపయోగించాలి? అంతరపంటలను ఏవిధంగా వేయాలి? ఘనజీవామృతం ఏవిధంగా ఉపయోగించాలి? అనే అంశాలను తెలిపారు. హ్యూమస్ వల్ల మొక్కలు ఏపుగా పెరిగి, దిగుబడులు పెరుగుతాయని, రసాయనిక వ్యవసాయం వల్ల హ్యూమస్ శాతం తగ్గిపోయి పంటదిగుబడి తగ్గుతుందన్నారు. హ్యూమస్ అనగా 60 శాతం సేంద్రీయ కర్బనము, 6 శాతం సేంద్రీయ నత్రజని ఉంటాయన్నారు. ఆచ్ఛాదన అనగా గ్రామీణ కుటుంబానికి చెందిన చెరకు, గడ్డిజాలి మొక్కలను భూమి మీద పరచాలని, ద్రవజీవామృతము చల్లాలని, అది మొక్కకు కావాల్సిన ఎన్‌పికె ఇస్తుందన్నారు. జడ్‌బిఎన్ఎఫ్ అనగా ప్రధాన పంటలో మునగ, అపరాలను అంతర పంటలుగా వేయాలని, అంతర పంటల ద్వారా వచ్చే ఆదాయము పెట్టుబడికి బదులుగా తీసుకుని, ప్రధాన పంట ద్వారా వచ్చే మొత్తాన్ని ఆదాయంగా మలుచుకోవాలన్నారు. కర్బన ఉద్గారాలను 22 శాతం తగ్గిస్తామని భారత ప్రభుత్వం ప్రకటించిందని, ఇది కేవలం ప్రకృతి వ్యవసాయం ద్వారా మాత్రమే సాధ్యమన్నారు. ప్రకృతి వ్యవసాయంలో పంటలను తగలబెట్టాల్సిన అవసరముండదని, మీథేన్ వాయువును వెలువరించే ఎటువంటి కంపోస్ట్‌లను తయారు చేయమనని, సేంద్రీయ వ్యవసాయ పద్ధతుల్లో కంపోస్టును తయారుచేస్తామన్నారు.

రసాయనిక ఎరువులు, పురుగుల మందుల వల్ల వ్యవసాయ కూలీలకు గొంతు క్యాన్సర్, వినియోగదారులకు చక్కెర వ్యాధి, ఊబకాయం, అనేక రకాల క్యాన్సర్లు సంభవిస్తున్నాయని వీటిపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ప్రకృతి వ్యవసాయంలో కాష్టాచ్ఛాదన చేయడం వల్ల మొక్కల వేరు వ్యవస్థ వద్దనే జీవన ద్రవ్యం తయారవుతుందన్నారు. ఈ జీవన ద్రవ్యం వల్ల మొక్కలు దృఢంగా పెరగడానికి, చీడపీడలను ఎదుర్కొనే శక్తిని సంతరించుకుంటాయని తెలిపారు. హ్యూమస్ ఒక అన్నపూర్ణ అని, ఇందులో సకల పోషకాలుంటాయని, హ్యూమస్ కేవలం వేరు వ్యవస్థ దగ్గర మాత్రమే తయారవుతుందని, ఇది భగవంతుని ప్రకృతి నియమం అని చెప్పారు. రసాయనిక ఎరువుల వాడకం వల్ల హ్యూమస్ తయారి తగ్గిపోతుందని, దీంతో దిగుబడులు, భూసారం తగ్గిపోతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖ డైరెక్టర్ బి.రాజశేఖర్, రాష్ట్ర ప్రకృతి వ్యవసాయం ముఖ్య సలహాదారు టి.విజయ్‌కుమార్, వివిధ జిల్లాలకు చెందిన వ్యవసాయ శాఖ అధికారులు, ప్రకృతి వ్యవసాయదారులు, రైతులు, ఐటి ప్రొఫెషనల్స్, మహిళా రైతులు పాల్గొన్నారు.

వసతులు కల్పించాలని వినతి

ప్రజాశక్తి-వినుకొండ


సమస్యలు వివరిస్తున్న సిపిఎం నాయకులు

1వ వార్డులోని వెన్నపూస కాలనీ, మాస్టిన్ కాలనీలో పేద ప్రజలకు మౌలిక వసతులు కల్పించాలని సీపీఎం డివిజన్ కార్యదర్శి కె.హనుమంతరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం 1వ వార్డులో నిర్వహించిన జన్మభూమి – మా ఊరు సభలో ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై ఆయా కాలనీ వాసులు సీపీఎం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జీవీకి ఫిర్యాదు చేశారు. వెన్నపూస కాలనీలో డ్రెయినేజీ సమస్య జఠిలంగా ఉందని, మురుగు రోడ్లపై ప్రవహిస్తూ ఆయా ప్రాంతాలు మురికి కూపాలుగా మారి, దుర్గంధం వెదజల్లుతూ, దోమలు స్వైర విహారం చేస్తూ ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని వివరించారు. అలాగే వీధి లైట్లు లేవని, పేదలు నివశిస్తున్న పూరిళ్లకు విద్యుత్‌శాఖ అధికారులు మీటర్లు మంజూరు చేశారే కానీ, కరెంటు లైన్ వేయలేదని అన్నారు. దీంతో ఇచ్చిన మీటర్లు తుప్పుపట్టి పోతున్నాయని, విద్యుత్ పోల్స్ వేసి కరెంటు సౌకర్యం ఎప్పుడు కల్పిస్తారని ప్రశ్నించారు. అలాగే తాగునీటి సమస్యతో పేదలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. మాస్టిన్ కాలనీలో విద్యుత్, డ్రెయినేజీ సమస్య అధికంగా ఉందన్నారు. 1వ వార్డుకు స్మశాన వాటిక లేదని, అనేక సార్లు అధికారుల దృష్టికి తీసుకొచ్చినా ప్రయోజనం లేదని వాపోయారు. సమస్యలపై స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. కమిషనర్ డి.రవీంద్ర మాట్లాడుతూ డ్రెయినేజీ సమస్యను త్వరలో పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు చిదంబరం, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఉత్తుత్తి "జన్మభూమి" ఎందుకు

గత జన్మభూమి అర్జీలు పరిష్కరించలేదని వ్యాఖ్య - ప్రభుత్వంపై డీసీసీ మక్కెన విమర్శ

ప్రజాశక్తి, వినుకొండ


మాట్లాడుతున్న డీసీసీ మక్కెన మల్లికార్జునరావు

ప్రజలకు ఏమాత్రం ఉపయోగపడని ఉత్తుత్తి జన్మభూమి కార్యక్రమాలు ఎందుకని డీసీసీ అధ్యక్షులు మక్కెన మల్లికార్జునరావు విమర్శించారు. జన్మభూమి–మా ఊరు 5వ విడత కార్యక్రమాలన్ని పురస్కరించుకుని మంగళవారం స్థానిక రాజీవ్ ఫౌండేషన్ కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నాలుగు జన్మభూమి కార్యక్రమాల ద్వారా టిడిపి ప్రభుత్వం ప్రజలకు చేసిందేమిలేదని, అర్జీలు తీసుకుని బుట్టదాఖలు చేశారని అన్నారు. మరల ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని జన్మభూమిలో ప్రజాసమస్యలు పరిస్కరిస్తామని చెపుతున్నారో అర్ధం కావటం లేదన్నారు. జన్మభూమి కార్యక్రమాలు ప్రజలకు, రాష్ట్రానికి ఒక్క మేలు జరగలేదన్నారు. సంక్షమ పథకాలకు అర్హులు ఎవరో అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్ధారించాలని, జన్మభూమి ముసుగులో ఉన్న టిడిపి నాయకులు నిజమైన లబ్ధిదారులను ఎలా ఎంపిక చేస్తారని ఆయన నిలదీశారు. ప్రజలచే ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులు, అధికారుల ప్రమేయం లేకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో లబ్ధిదారుల ఎంపిక జన్మభూమి కమిటీలకు పెత్తనం ఇవ్వటం దారుణమన్నారు. గృహలు, ఇళ్లస్థలాలు, పెన్షన్లు, రేషన్ కార్డుల తదితర ప్రభుత్వ పథకాల అమలులో అర్హుల ఎంపిక విషయంలో జన్మభూమి కమిటీల జోక్యం లేకుండా అధికారులు, ప్రజాప్రతినిధలకు ఎంపిక ప్రక్రియ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. 5వ విడత జన్మభూమి – మా ఊరు కార్యక్రమంలో దరఖాస్తు చేస్తున్న అర్జీలపై నిష్పక్షపాతంగా విచారించి, జన్మభూమి కమిటీల ప్రమేయం లేకుండా అర్హులను గుర్తించి పేదలకు న్యాయం చేయాలని ఆయన కోరారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ములకా రాంతులసీరెడ్డి, గంటా కాలేషా, గుంటకల ప్రసాద్, గుర్నాధం ఉన్నారు.


మాట్లాడుతున్న జివి

బొల్లాకు విమర్శలు తగవు : ఎమ్మెల్యే జివి

ప్రజాశక్తి -వినుకొండ

వైసిపి నియోజకవర్గ ఇన్‌చార్జి బొల్లా బ్రహ్మనాయుడు వాస్తవాలను తెలుసుకోకుండా విమర్శించడం సరికాదకని, బొల్లా చేసిన విమర్శలను ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఖండించారు. మంగళవారం స్థానిక స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ బొల్లాపల్లి మండలం గుమ్మనంపాడు దక్షణాదిమటం భూములు అధికారపార్టీవారు ఆక్రమణలకు పాల్పడుతున్నారని బొల్లా విమర్శిస్తున్నారన్నారు. మటం భూములను సర్వేచేయించి రైతులకు హక్కు కల్పించేదుకు ఒకవైపు కృషి చేస్తుంటే మంచి అడ్డుకోవటానికి ప్రతి పక్షనేత ప్రయత్నించడం సరికాదని అన్నారు. అగ్రహార భూముల్లో కొన్ని దశాబ్దాలుగా ఉన్న రైతులకు హక్కులు కల్పించేందుకు రైతులు పడుతున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి న్యాయం చేస్తుంటే బొల్లా అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. నూజెండ్ల మండలం కొండ్రప్రోలు, త్రిపురాపురం గ్రామాల్లో అగ్రహార భూమలను సర్వే చేయిస్తున్నామని తెలిపారు.

ఎన్ఎమ్‌సి బిల్లుకు వ్యతిరేకంగా వైద్యుల నిరసన

ప్రజాశక్తి -వినుకొండ


నిరసన తెలుపుతున్న వైద్యులు

మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాని రద్దు చేసి నేషనల్ మెడికల్ కమీషన్‌ని పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్న బిల్లును వ్యతిరేకిస్తూ వినుకొండ వైద్యులు నిరసన వ్యక్తం చేశారు. స్థానిక నిమ్స్ 24 వైద్యశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఎన్ఎంసికి వ్యతిరేకంగా జనవరి 2ను బ్లాక్‌డేగా ప్రకటించి నలబ్యాడ్జీలు దరించి నిరసన తలిపారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ వినుకొండ అధ్యక్షులు ఎస్‌కె. దస్తగిరి మాట్లాడుతూ 130 మంది డాక్టర్లు సభ్యులతో నడుపబడుతున్న ఎంసిఐని రద్దు చేసి 25 మంది నామినేటెడ్ సభ్యులతో ఎన్ఎంసి ఏర్పాటు వ్యతిరేకిస్తున్నామని అన్నారు. 25 మంది సభ్యుల ఎన్ఎంసిలో కేవలం ముగ్గురు డాక్టర్లను మాత్రమే సభ్యులను చేయటం ఏమిటన్నారు. ప్రైవేటు మెడికల్ కాలేజిలలో కేవలం 40 శాతం మాత్రమే ఫీజులు నిర్ణయిచబడినది, మిగతా 60 శాతం సీట్ల పై ఫీజు గురించి స్పష్టత లేదన్నారు. లైసెన్స్‌యేట్ ఎక్సామినేషన్ అని కొత్తగా ప్రవేశపెట్టబోతున్నారు. ఎంబిబిఎస్ డిగ్రి పూర్తి చేసిన తరువాత మరలా ఎంట్రెన్స్ రాసే విధంగా ఎన్ఎంసి బిల్లులో ఉందన్నారు. ఇది కేవలం ఇతర దేశాలలో చదివే మన విద్యార్థులకు మాత్రమే ఉండేదన్నారు. బ్రిడ్జ్ కోర్సు అనేది ఎన్ఎంసిలో ఉన్నదని, హోమియో, ఆయుర్వే వైద్యులకు ఒక సంవత్సరం పాటు ట్రైనింగ్ ఇచ్చి, అలోపతి వైద్యం చేయు విధంగా నిర్ణయించిరని అన్నారు. దీని అమలును వ్యతిరేకిస్తున్నామన్నారు. ప్రభుత్వ వైద్యశాలలో తగిన వసతులు లేకుండానే వైద్యులను వైద్యం చేయటం ఏమిటని తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలోని వైద్యులు ఓపిలను నిలుపుదల వేసి తమ నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పట్టణంలోని ప్రైవేటు వైద్యశాలల డాక్టర్లు గోగినేని సాంబశివరావు, చిన్నపురెడ్డి, ఎన్ఎన్ రావు, ఇన్నారెడ్డి, మాధవరావు, ముసలారెడ్డి, కుర్రా శ్రీనివాసరావు, గుడిపాటి తేజా , జోస్నా, పద్మజా, తదితర వైద్యులు పాల్గొన్నారు.


విజేతలకు బహుమతులు అందజేస్తున్న భగవాన్‌దాస్, తదితరులు

విద్య ఉన్నత శిఖరాలకు చేరుస్తుంది : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి–పెదకూరపాడు

విద్య ఉన్నత శిఖరాలకు చేరుస్తుందని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి భగవాన్‌దాస్ అన్నారు. గతనెల 20వ తేదీన నిర్వహించిన వ్యాసరచన, టిటెబ్ పోటీల్లో గెలుపొందిన విజేతలకు స్థానిక ఎంఆర్‌సి కార్యాలయం వద్ద బహుమతుల అందజేశారు. ఈ సందర్భంగా భగవాన్‌దాస్ మాట్లాడుతూ అందరికీ విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యంగా పని చేయాలన్నారు. విద్యార్థులు ఉన్నతవిద్యను అభ్యసించాలన్నారు. ప్రతి విషయాన్ని అధ్యయనం చేయడం ద్వారానే జ్ఞానం పెంపొందుతుందన్నారు. డివైఎఫ్ఐ జిల్లా సభ్యులు వెంకట్ మాట్లాడుతూ పుస్తకపఠనం పట్ల విద్యార్థులు అసక్తి కనపరచాలన్నారు. ఫేస్‌బుక్, తదితర వాటికి నిరంతరం దూరంగా ఉండాలన్నారు. అప్పుడు మాత్రమే విద్యార్థులకు మంచి ఫలితాలు వస్తాయన్నారు. నిర్వహించారు. కార్యక్రమంలో ఓంకార్, మండల యుటిఎఫ్ సమన్వయకర్త చంద్రశేఖర్‌రావు, ఉపాధ్యాయులు కాషాయని పాల్గొన్నారు.


క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే శ్రీధర్

ప్రజాశక్తి 2018 క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి–అమరావతి

ప్రజాశక్తి దినపత్రిక 2018 క్యాలెండర్‌ను పెదకూరపాడు ఎమ్మెల్యే డాక్టర్ కొమ్మాలపాటి శ్రీధర్ మంగళవారం ముత్తాయిపాలెం గ్రామంలో ఆవిష్కరించారు. ప్రజాశక్తి దినపత్రిక ప్రజలపక్షాన నిలిచేపత్రిక అని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజాశక్తిని ఆదరిస్తే పేదవారికి చేయూత నిచ్చినట్లవుతుందని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డ్వామాపిడి పులి హబీబ్‌భాషా, తహశీల్దార్ పి.భాస్కరరావు, మునగోడు పిఎసిఎస్ అధ్యక్షులు సిహెచ్ శౌరయ్య, టిడిపి మండల అధ్యక్షులు మల్లాది విష్ణు, తెలుగుయువత అధ్యక్షులు హమానుల్లా, జానీ, టి.రామకృష్ణ, కోటయ్య ఉన్నారు.


కరాటేలో విద్యార్థినులకు శిక్షణిస్తున్న శిక్షకుడు

ఆత్మరక్షణ కోసం విద్యార్థినులు కరాటే నేర్చుకోవాలి

ప్రజాశక్తి–సత్తెనపల్లి రూరల్

విద్యార్థినులు స్వీయ రక్షణ కోసం తప్పనిసరిగా కరాటే నేర్చుకోవాలని నందిగం జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.సోమనాథ్ అన్నారు. మండలంలోని నందిగం జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల్లో ఆర్ఎంఎస్ఎ ఆధ్వర్యంలో సబలా కరాటే అకాడమీ వారిచే విద్యార్థినులకు కరాటే శిక్షణా కార్యక్రమం మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సోమనాథ్ మాట్లాడుతూ ఆకతాయిల నుంచి తమను తాము రక్షించుకునేందుకు కరాటే ఎంతో ఉపయోగపడుతుందని విద్యార్థినులకు సూచించారు. కార్యక్రమంలో కరాటే శిక్షకులు వై.సాయి, వ్యాయామ ఉపాధ్యాయులు లాతు పిచ్చయ్య పాల్గొన్నారు.

క్రీడా దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి–ఈపూరు

ఆటపాటలతో కూడిన విద్యతో మెరుగైన ఫలితాలు సాధించవచ్చని అయినాల కోటేశ్వరరావు అన్నారు. మండలంలోని కొచ్చెర్ల గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో కాకతీయ యువసేన ఆధ్వర్యంలో 50 మంది విద్యార్థులకు క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. అనంతరం సమావేశంలో వక్తలు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించాలన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు అన్ని రకాల మౌళిక వసతులను కల్పిస్తుందని వాటి అందిపుచ్చుకొని విజయాల వైపు పరుగులు తీయాలని అన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం వి.శ్రీరాములు నాయక్, పీడీ ఎస్.రూత్‌మేరి, కాకతీయ యువసేన అధ్యక్షుడు నెల్లూరి హరి, సాగునీటి సంఘం అధ్యక్షులు నెల్లూరి శివరామయ్య,మండల తెలుగు రైతు సంఘం అధ్యక్షులు నలబోతు వీరయ్య, గోనుగుంట్ల శరభయ్య, కాసరగడ్డ వెంకట్రామయ్య, లక్ష్మయ్య, ఇత్తడి ఆదెయ్య పాల్గొన్నారు.


దుస్తులు పంపిణీ చేస్తున్న కాకతీయ యువసేన



ప్రజాశక్తి
www.prajasakti.com
గుంటూరు
బుధవారం
3 జనవరి 2018

చిన్నారుల పుస్తకాలు ఎన్నెన్నో...

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్

విజయవాడ బుక్‌ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యంలో నగరంలోని స్వరాజ్య మైదాన్‌లో ఏర్పాటు చేసిన 29వ పుస్తక మహోత్సవ్‌లో మంగళవారం యువత, విద్యార్థులు ఎక్కువ మంది కనిపించారు. పుస్తకాభిమానులు, పుస్తక ప్రియులను అమితంగా పుస్తక మహోత్సవ్ ఆకట్టుకుంటుంది. ప్రధానంగా పిల్లల పుస్తకాల పట్ల ఎక్కువ మంది ఆసక్తి చూపుతున్నారు. నగరానికి చెందిన అలరు ప్రచురణలు సంస్థ ప్రత్యేకంగా ప్రదర్శనలో స్టాల్స్‌ను ఏర్పాటుచేసి చిన్నారులకు సంబంధించిన ఎన్నో పుస్తకాలను అందుబాటులోకి తీసుకువచ్చింది. వీటిని ఎక్కువ మంది కొనుగోలు చేస్తున్నారు ధర కూడా ఈపుస్తకాలు తక్కువగా ఉండంతో పాటు, పిల్లలకు ఉపయోగపడేలా ఉన్నాయి. వై.మాలతీకృష్ణ రచించిన ఆటలు... కథలు... డ్రామాలు... పాటలు... పిల్లలకు ఎందుకు..? అనే పుస్తకం ఎంతగానో ఆకట్టుకుంటుంది. చిన్న పిల్లలకు సబ్జెక్టు పుస్తకాలు కాకుండా వారికి ఆటలు ఆడిటంచడం, పాటలు పాడించడం, వంటి అంశాలనుఏవిధంగా నేర్పించాలో పుస్తకాలలో చక్కగా ఉన్నాయి. పిల్లలకు పరిపూర్ణ విద్య అందించడం ఎలా..? అనే పుస్తకం, మంచి విద్య అందించడానికి ఓ స్కూలు ప్రయత్నం అనేపుస్తకాలు స్టాల్స్‌లో ఏర్పాటుచేశారు. వీటి పట్ల ఎక్కువ మంది ఆసక్తి చూపుతున్నారు.

మంచి పుస్తకం స్టాల్

సికింద్రాబాద్‌కు చెందిన మంచి పుస్తకం స్టాల్‌లో పిల్లల కథల పుస్తకాలు,కామిక్ పుస్తకాలు, చిన్నారులుకు సంబంధించిన చిత్రలేఖనం పుస్తకాలు ఎన్నో ఉన్నాయి. సైన్సుతో పాటు విజ్ఞానం అందించే పుస్తకాలు కూడా ఎన్నో ఉన్నాయి.

పెద్దబాల శిక్ష

పెద్దబాల శిక్ష ఈపుస్తకం తెలియని వారు ఉండరు. తెలుగు అక్షరమాల గురించి తెలుసుకోవాలంటే కచ్చితంగా ఈపుస్తకం కొనుగోలు చేయాల్సిందే. గాజుల సత్యనారాయణ రచించిన పెద్దబాల శిక్ష 168వ ముద్రణ పుస్తక మహోత్సవ్‌లోని 168వ స్టాల్‌లో పెద్దబాల శిక్ష పేరుతో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గాజుల సత్యనారాయణ మాట్లాడుతూ 168వ ముద్రణ ఇటీవల వచ్చిందని దీనిని పుస్తక మహోత్సవ్‌లోనే ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పెద్దబాల శిక్ష తొలి ముద్రణ 2004లో విజయవాడ పుస్తక మహోత్సవ్‌లోనే ప్రారంభమైందన్నారు. అప్పట్లో రెండు వేలు పుస్తకాలు కేవలం పదిరోజుల్లో అమ్ముడయ్యాయని తెలిపారు. ఆతరువాత పెద్దబాల శిక్ష ముద్రణ పెరుగుతూ వచ్చిందన్నారు. ఇప్పటి వరకు సుమారు 10 లక్షల 84వేలు పుస్తకాలు ప్రచురితమయ్యాయని తెలిపారు. ఎప్పటికపుడు మార్పులు చేస్తూ నూతనంగా తీసుకువస్తున్నట్లు తెలిపారు. రెండు భాగాల్లో పెద్దబాల శిక్ష పుస్తకం వస్తుందన్నారు. ప్రథమ ముద్రణ ప్రపంచ విజ్ఞా సర్వసం అందిస్తుందన్నారు. ద్వితీయ ముద్రణ తెలుగుభాష విజ్ఞాన సర్వసం గురించి తెలియచేస్తుందన్నారు. అక్షర మాల నుండి అష్టాదశ పుస్తకాలు ఉంటాయన్నారు. రెండు పుస్తకాలు ఉంటే విజ్ఞాన సర్వస్యం ఉన్నట్లేనన్నారు. తెలుగునాట 80 శాతం మంది వద్ద పెద్ద బాల శిక్ష ఉంటుందన్నారు. పుస్తక ప్రదర్శనలో 10 శాతం రాయితీతో పుస్తకం అందిస్తున్నామన్నారు.

పోటీ పరీక్షల ప్రత్యేకం ' మనోరమ ఇయర్‌బుక్ -2018'

మరికొద్ది రోజుల్లో వార్షిక విద్యా సంవత్సరం ముగియడంతో ప్రతి ఒక్కరూ పోటీ పరీక్షలవైపు ఆసక్తి చూపుతారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే ప్రతి విద్యార్థి తప్పకుండా మనోరమ ఇయర్ బుక్ తెచ్చుకుంటారు. అటువంటి వారికోసం 2018 సంవత్సరానికి సంబంధించి లేటెస్ట్‌గా శ్రీ మనోరమ ఇయర్ బుక్ – 2018ను మార్కెట్లోకి తీసుకు వచ్చినట్లు గాజుల సత్యనారాయణ తెలిపారు. ముఖ్యంగా కరంట్ అఫైర్స్, జనరల్ నాలెడ్జి, ప్రపంచ విజ్ఞానం, దేశ, రాష్ట్ర, జిల్లా అంశాలతో కూడిన అన్ని జనరల్ టాపిక్స్ ఇందులో ఉంటాయన్నారు. ముఖ్యంగా టెట్, డియస్సీ పరీక్షలకు కరెంట్ అఫైర్స్ బిట్‌బ్యాంక్‌గా ఎంతగానో ఉపయోగపడనుంది. ఈ పుస్తకం వెల రు. 162లు ఉండగా, ప్రదర్శన సందర్భంగా రు. 100లకే అందిస్తున్నామని తెలిపారు.

సివి సాహిత్యంలో సమాజ మార్పు రచనలు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

సమాజ మార్పునకు ఎటువంటి పుస్తకాలు అవసరమో అటువంటి పుస్తకాలను తన సాహిత్యం ద్వారా అందించిన గొప్ప వ్యక్తి సి.వి అని సాహితీ విమర్శకులు కొత్తపల్లి రవిబాబు అన్నారు. స్వరాజ్యమైదాన్‌లో జరుగుతున్న 28వ విజయవాడ పుస్తక మహోత్సవ్‌లో మంగళవారం సాయంత్రం 'సి.వి. సాహిత్య సమీక్ష' పై సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ సి.వి మార్క్సిజం, లెనినిజంను నమ్మాడన్నారు. తన రచనలు సామాన్య ప్రజానికానికి అందించడంలో ఆయన విశేష కృషి చేశారని తెలిపారు. చదువుకునే రోజుల్లోనే ఆర్థిక విషయాలపై సి.వి అనేక వ్యాసాలు రాశారన్నారు. మార్క్సిజం దృక్పథం కారణంగానే సమాజానికి ఉపయోగపడే రచనలు ఎన్నో చేశారన్నారు. ప్రధానంగా హేతువాదం, నాస్తిక వాదంపై పుస్తకాలు రాశార న్నారు. దళిత, బిసి సంఘాలకు ఉపయోగపడే పుస్తకాలు కూడా ఆయన రాశారని తెలిపారు. అందుకే ఎవరికి వారు తమవారే సివి అని అనేవారన్నారు. సి.వి సమాజంలో అన్ని వర్గాల వారి గురించి రాశారంటే కారణం మార్క్సిస్టు దృక్పథం ఉండబట్టేనన్నారు. సాంస్కృతిక విప్లవం ఎలా సాధ్యపడుతుంతో ఆయన తన రచనల ద్వారా చూపిం చారన్నారు. నేటి సమాజానికి సాంస్కృతిక విప్లవం అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ ఎన్.అంజయ్య సి.వి సాహిత్యం గురించి ఆయన రచనలు గురించి కూలంకుషంగా తెలిపారు. సభకు అధ్యక్షత వహించిన ప్రజాశక్తి బుక్‌హౌస్ ఎడిటర్ ఉషారాణి మాట్లాడుతూ విజయవాడ పుస్తక మహోత్సవ్‌లోని సాహిత్య కార్యక్రమాలకు సి.వి పేరుపెట్టడం సముచిత నిర్ణయమని తెలిపారు. సి.వి దాదాపు 40 సంవత్సరాలు సాహిత్యాన్ని అందించా రన్నారు. ఆయన రచనలు నేటి యువతకు ఎంతో అవసరమని తెలిపారు. సి.వి రచించిన 30 పుస్తకాలలో 24 పుస్తకాలు ప్రజాశక్తి బుక్‌హౌస్ ముద్రణ చేసిందని తెలిపారు. నేటి సమాజానికి సివి రచనలు ఎంతో అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పుస్తక మహో త్సవ్ సమన్వయ కర్త బి.బాజ్జి, సి.వి కుటుంబ సభ్యులు పాల్గొ నగా, అంతకు ముందు వేదిక పైకి అతి థులను పుస్తక మహో త్సవ్ కార్యదర్శి వి.లక్ష్మ య్య ఆహ్వా నించారు.

తెలుగు భాషా వికాసానికి కృషిచేయాలి

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

తెలుగులోనే భాష వికసించేలా విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, అన్ని సంస్థల్లో కృషిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు వక్తలు అన్నారు. నగరంలోని స్వరాజ్య మైదాన్‌లో ఏర్పాటు చేసిన విజయవాడ పుస్తకమహోత్సవ్‌లో 'తెలుగు భాష – వికాసం' అనే అంశంపై సదస్సు మంగళవారం సాయంత్రం జరిగింది. ఈ సదస్సులో పలువురు సాహితీ వేత్తలు, కవులు, ప్రముఖులు పాల్గొన్నారు. తొలుత శాసన మండలి సభ్యులు డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ నేడు విద్యా సంస్థల్లో తెలుగు సబ్జెక్టుగానే చదువుతున్నారని దానితో పాటు తెలుగు సాహిత్యం కూడా నేటి విద్యార్థులకు చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. మాతృభాషలోనే మాట్లాడటానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఆంగ్ల భాష అవసరమని కాని అది ఉన్నత విద్యకు మాత్రమే కావాలని అవసరమైన సమయంలో ప్రతి ఒక్కరూ తెలుగులోనే మాట్లాడాలని అన్నారు. ముఖ్యంగా విద్యా సంస్థల్లో పాఠ్యాంశాలు కూడా తెలుగులోనే ప్రాథమిక విద్యను పూర్తి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. ఈ సందర్భంగా తెలుగుభాషా వికాసంలో సాహిత్యం పాత్ర గురించి ప్రముఖ రచయిత వాసిరెడ్డి నవీన్, గ్రంథాలయ పునరుద్ధరణ గురించి రావి శారద, తెలుగు భాష – శాసన సాహిత్యం గురించి ప్రముఖ చరిత్రకారులు ఈమని శివనాగిరెడ్డి ప్రసంగించారు.

స్టాల్స్‌ను పరిశీలించిన ఎంఎల్‌సి...

పుస్తకమహోత్సవ్‌లో ఏర్పాటుచేసిన స్టాల్స్‌ను శాసన మండలిసభ్యులు డొక్కా మాణిక్య వరప్రసాద్ సందర్శించి పలుపుస్తకాలను కొనుగోలు చేశారు.

నేడు పిల్లల పెంపకం ఒక కళ పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్

ప్రసిద్ధ సెలబ్రిటీ రైటర్ యుండమూరి వీరేంద్రనాథ్, ప్రముఖ చైల్డ్ సైకియాట్రిస్టు డాక్టర్ విశాల్ ఇండ్ల కలిపి సంయుక్తంగా రచించిన 'టీన్స్ పిల్లల పెంపకం – ఒక కళ' అనే పుస్తకాన్ని ఈ నెల 3వ తేదీన పుస్తక మహోత్సవంలో ఆవిష్కరించనున్నారు. నవ సాహితీ బుక్ హౌస్ ప్రచురణలో ఈ పుస్తకం రూపుదిద్దుకుంది. జనవరి 3వ తేదీ సాయంత్రం 7 గంటలకు స్వరాజ్యమైదాన్‌లోని పుస్తక మహోత్సవ్ ప్రాంగణంలో రాష్ట్ర క్రీడలు, యువజన శాఖా మంత్రి కొల్లు రవీంద్ర ఆవిష్కరించనున్నారు. ప్రత్యేక అతిథిగా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ కమిషనర్ బి.ఉదయలక్ష్మి, ప్రముఖ మానసిక వైద్యులు డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి పాల్గొననున్నారు. పుస్తకం ఆవిష్కరణ అనంతరం పేరెంటింగ్ స్కిల్స్‌పై టాక్‌షో, తల్లిదండ్రులతో ముకాముఖి కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

థింకింగ్ హార్టు పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్

విద్యార్థుల కెరీర్‌కు ఉపయోగపడే విధంగా ప్రముఖ విద్యావేత్త వి.శ్రీనివాస్ రచించిన 'థింకింగ్ హార్టు' పుస్తకావిష్కరణ విజయవాడ పుస్తక మహోత్సవ్ ప్రాంగణంలోని సి.వి.సాహిత్య వేదికపై మంగళవారం సాయంత్రం జరిగింది. పుస్తకాన్ని తాడికొండ శాసన సభ్యులు టి.శ్రవణ్‌కుమార్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మన జీవితంలో ఉన్నత లక్ష్యంతో ఎలా ముందుకు వెళ్లాలో చక్కగా ఈ పుస్తకం ద్వారా శ్రీనివాస్ వివరించారన్నారు. విద్యార్థులు, యువత, ఉన్నత ఆశయం కోసం కృషి చేసేప్రతి ఒక్కరూ ఈ పుస్తకాన్ని చదవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌కమ్‌ట్యాక్స్ కమిషనర్ వి.మధువాణి, ఆంధ్రా లయోలా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ గుమ్మా సాంబశివరావు, ఎంప్లా య్‌మెంట్ విభాగం డైరెక్టర్ వి.హిమబిందు, బిసి వెల్ఫేర్ డిపార్టు మెంట్ విభా గం జాయిం ట్ డైరె క్టర్ పి.మాదవీలత పలు వురు ప్రముఖులు పాల్గొన్నారు.

ఇయర్ బుక్





మాట్లాడుతున్న మాణిక్యాలరావు



మాట్లాడుతున్న కొత్తపల్లి రవిబాబు



ప్రదర్శనలో ఉంచిన పలు ఆట వస్తువులు



ప్రదర్శనలో ఉంచిన ప్రముఖుల జీవిత చరిత్రల పుస్తకాలు





ఫిజియోథెరపీ ఉన్నట్టా..లేనట్టా !

ప్రమాదాల్లో గాయాలపాలై ప్రభుత్వా సుపత్రిలో చికిత్స పొందే వారి సంఖ్య ఎక్కువగా నమోదవుతోంది. ముఖ్యంగా యాక్సిడెంటు కు గురై ఎముకలు సంబంధిత చికిత్సకోసం వచ్చేవారే వీరిలో అధికం. అటువంటి వారికి చకిత్స అనంతరం ఎముకల, కండరాల పనితీరు సక్రమంగా ఉండేలా చికిత్సనందించే విభాగమే ఫిజియోథెరఫీ. ఈ థెరపీ ద్వారా చాలా వరకు శరీర భాగాలు యథాస్థితికి వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. వైద్య నిపుణుల సమక్షంలోనే ఫిజియోథెరపీ చేయాల్సి ఉంటుంది. జిజిహెచ్‌లో ఈ విభాగం పనితీరు అధ్వానంగా ఉంది. దీనిని అన్నిరకాలుగా అభివృద్ధి చేయడాన్ని అధికార యంత్రాంగం పూర్తిగా విస్మరిస్తున్నది. ఫలితంగా రోగులకు ఫిజియోథెరపీ వైద్య సేవలు పూర్తి స్థాయిలో అందటం లేదు. పరికరాలు సమకూర్చాల్సిన అధికారులు కానీ, అభివృద్ధి కమిటీ కానీ ఈ విభాగంపై కన్నెత్తి చూడటం లేదు. దీంతో ప్రభుత్వాసు పత్రిలో ఫిజియోథెరఫీ సేవలు ఉన్నటా? లేనట్టా? అన్న సందిగ్ధ పరిస్థితి నెలకొంది.

ప్రజాశక్తి–గుంటూరు అర్బన్

మరమ్మతులకు నోచుకోని పరికరాలు

స్టిమ్‌లేషన్ కిట్ ఉన్నా పాడైపోయింది. ఇప్పటి వరకూ మరమ్మతుకు నోచుకోలేదు. కొత్తదీ ఏర్పాటు చేయాలనే ఆలోచన ఆసుపత్రి అధికారులకు లేదు. ట్రాక్షన్‌కిట్ కూడా పూర్తిగా పాడైపోయింది. ఎన్నో సంవత్సరాల క్రితమే పాడవటంతో ఇంత వరకు కొత్తది ఏర్పాటు చేయలేదు. ఇంకా సైక్లింగ్, బెడ్ థెరపీకి సంబంధించిన బెడ్ కిట్ కూడా పాతబడిపోయాయి.



శిథిలావస్థలో ఉన్న ఫిజియోథెరఫీ విభాగం

ఉన్నది ఒక్కటే సిటి స్కాన్..

సిటి స్కాన్ గతంలో పాత ఆసుపత్రి విభాగంలో ఉన్నది. తరువాత పొదిలి ప్రసాద్ జింఖానా ఆసుపత్రి నిర్మించిన తరువాత ట్రామాకేర్ కోటా కింద మంజూరు కావటంతో కొత్త ఆస్పత్రిలో ఏర్పాటు చేశారు. ఈ లోగా పాత సిటి స్కాన్ పాడైపోవటంతో పట్టించ కోలేదు. కొత్త సిటి స్కాన్‌లోనే ప్రతిరోజు ఓపీ రోగులకు, అత్యవసర రోగులకు కలిపి పరీక్షలు చేస్తున్నారు. దీంతో రోజుకు చేయాల్సిన పరీక్షల కంటే ఎక్కువగా చేయటంతో ఆ యంత్రంపై ఒత్తిడి పెరిగిపోతుంది. రోజుకు 50 నుంచి 60 వరకు పరీక్షలు చేయాల్సి ఉండగా ప్రస్తుతం 90 వరకు స్కానింగ్ తీస్తున్నారు. కొద్దిపాటి మరమ్మతులు వస్తే విజయవాడకు చెందిన 'జిఈ' కంపెనీ వారు మరమ్మతులు చేస్తున్నారు. అదీ మేజర్‌గా పాడైపోతే రెండు, మూడు రోజుల పాటు యంత్రాన్ని ఆపివేసి మరమ్మతులు చేయాల్సి వస్తుంది. రోజుకు 90, 100 వరకు స్కానింగ్ పరీక్షలు నమోదవుతంటే మూడు రోజులపాటు ఈ పరికరం పనిచేయకపోతే రోగులు పరిస్థితి ఎంత తీవ్రంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. మరొక స్కానింగ్ యంత్రాన్ని ఏర్పాటు చేయాల్సిన ఆసుపత్రి అధికారులు, అభివృద్ధి కమిటీ పట్టించుకోవటం లేదు. మెడికల్ కళాశాల విద్యార్థులు కూడా ఈ స్కానింగ్ విధానాన్ని తెలుసుకోవాలంటే ఒక్కటే ఉండటంతో పని విధానాన్ని తెలుసుకోలేకపోతున్నారు. ఇంతటి ప్రాముఖ్యత కలిగిన సిటిస్కాన్ పరికరం ఎక్కువ ఖరీదు కావటంతో ఎప్పటికి వస్తుందోనని రోగులు, మెడికల్ కళాశాల విద్యార్థులు ఎదురు చూస్తున్నారు.



ఒకే ఒక్క సిటి స్కాన్ పరికరం

ప్రతిపాదనలైతే పంపాం

ఫిజియోథెరపీ విభాగాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. ఆర్థోపెడిక్ విభాగ ఫిజియోథెరపీ విభాగాన్ని కూడా అభివృద్ధి చేస్తాం. చిన్నపాటి పరికరాలు త్వరలో తెప్పిస్తాం. ఎక్కువ ఖరీదు ఉంటే ప్రభుత్వ ఆదేశాల మేరకు కొనుగోలు చేయాల్సి ఉన్నది. అదే విధంగా సిటీ స్కాన్ ఒక్కటే ఉండటంతో మరొకటి ఏర్పాటు చేయాలని ఆసుపత్రినుంచి, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ నుంచి ప్రతిపాదనలు పంపాం. దస్త్రం ప్రభుత్వ పరిశీలనలో ఉన్నది.




రాజునాయుడు, జీజీహెచ్ సూపరింటెండెంట్

ఉంచాల్సిన పరికరాలు వాటి పనితీరు



పనిచేసే ట్రక్షన్‌కిట్ పరికరం

ట్రాక్షన్‌కిట్ : మెడకు, నడుముకు వెన్నుపూసకు సంబంధించిన శరీర భాగాల్లో సమస్య ఉంటే ఈ పరికరం ద్వారా థెరపీ చేసి నయం చేయవచ్చు



పనిచేసే స్టిమిలేషన్ పరికరం

స్టిమిలేషన్ : పక్షవాతం వచ్చిన వారికి ఈ పరికరం ద్వారా థెరపీ చేసి నయం చేయవచ్చు. పక్షవాత చికిత్సకు ఈ పరికరం ముఖ్యావసరం.

ఐఎఫ్‌టి : కండరాల నొప్పులకు, మోకాళ్ల నొప్పులకు, నడుమ నొప్పులకు ఈ పరికరం ద్వారా థెరపీ చేసి నయం చేయవచ్చు.

టెన్స్: నరాలకు సంబంధించిన నొప్పులకు ఈ పరికరాన్ని ఉపయోగిస్తారు.

అల్ట్రాసౌండ్ : శరీరంలో ప్రత్యేకంగా ఒక చోటే నొప్పి ఉంటే ఆ ప్రదేశంలోనే ఈ పరికంతో గుర్తించి థెరపీ చేస్తారు. అభివృద్ధి చెందిన దేశాల్లోని ఆసుపత్రుల్లో తప్పని సరిగా ఉంటుంది. పలు వ్యాధులు అల్ట్రాసౌండ్ ద్వారానే గుర్తిస్తారు.

ఈ పరికరాలేమి గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలోని ఫిజియోథెరపీ విభాగంలో లేవు.

'అమ్మా రిక్షా.. బాబూ రిక్షా..'

- ప్రయాణీకుల కోసం పడిగాపులు
- రిక్షాల వైపు కన్నెత్తి చూడని వైనం
- ధైన్యంగా మారిన రిక్షా కార్మికుల జీవితాలు
- పట్టించుకోని ప్రభుత్వాలు

ప్రజాశక్తి బాపట్ల రురల్

శారీరక కష్టాన్ని నమ్ముకొని రేయింబవళ్లు శ్రమించే రిక్షావాలాకు ప్రస్తుతం గడ్డు కాలం నడుస్తుంది. బస్సులో ప్రయాణికులను తమ గమ్యాన్ని చేరవేసే బస్సు డ్రైవర్ ఎంత నిష్ణాతుడై వుంటాడో అంతకు మించిన ప్రావీణ్యత ఈ వృత్తిలో మాకు ఉండాలి. ఎక్కడ ఏ మాత్రం తేడా వచ్చినా ప్రయాణికులు మా రిక్షా బండ్లపై కన్నెత్తి చూడని పరిస్థితి. మేము ప్రతి రోజు పట్టణము లోని వీధి–వీధీ , వాడ– వాడ టైర్లు అరిగేలా వెతికినా ఒక్క ప్రయాణికుడు మమ్మల్ని పిలవడం లేదు. ఒకరు ఎక్కినా వారి గమ్యం ఎక్కడికైనా ముట్టినకాడికి తీసుకొని వెళ్లక తప్పదు. అందరం ఒకే ప్రదేశంలో ఉంటే మాలో మాకు పోటీ ఉంటుందని వీధుల్లో ఉన్న నాలుగు రోడ్లు కలసిన చోట నిలబడి 'రిక్షా – రిక్షా' అంటూ అరుస్తూ తిరుగుతున్నా ప్రయోజనం లేదు. అందుకే ఏ ఒక్క ప్రయాణికుడు ఎక్కినా బాడుగకు వెళ్తుంటాం అంటున్నాడు బాపట్ల పట్టణ బాలకృష్ణ వీధికి చెందిన రిక్షా కార్మికుడు కె. కోటేశ్వరరావు. తన చిన్న వయసులో చదువుకోవాలనే తాపత్రయం ఉన్నా కుటుంబ పరిస్థితులు అనుకూలించలేదు. వారసత్వంగా ఈ వృత్తి లోకి అడుగుపెట్టినా, రిక్షావాలా గత మూడున్నర దశాబ్దాల నుంచి రిక్షా కార్మికుడిగా ఈ వృత్తినే నమ్ముకున్నాడు.

పగలనక రాత్రనక రైల్వే స్టేషన్, బస్సు స్టేషన్ల వద్ద నిలబడి బయటలకు వచ్చే ప్రయాణికులను 'అయ్యా రిక్షా , అమ్మా రిక్షా' అంటూ బ్రతిమాలుకొని జీవనం సాగిస్తున్నారు. రోజుకు సుమారు 20–30 కిలోమీటర్లు రిక్షా తొక్కుకుంటూ పొట్టకూటి కోసం శ్రమిస్తున్నాడు. అయినా వారి రోజు సంపాదన రూ. 200 –250 మాత్రమే. వచ్చే ఈ డబ్బుతో కుటుంబం గడబటం అంతంత మాత్రమే. ఆటోలు అధిక సంఖ్యలో ఉండటం వలన రిక్షావాలాకు పనితోపాటు, విలువ కూడా లేకుండా పోతుంది. ప్రభుత్వాలు మారుతున్నా తమ జీవన విధానములో మాత్రం ఎటువంటి మార్పు రావడంలేదని, తమ వైపు ఏ నాయకుడు కన్నెత్తి చూడటం లేదని రిక్షా కార్మికులు ఆవేదన చెందుతున్నారు.



బాడుగుల కోసం ఎదురు చూస్తూ..

ప్రభుత్వం సహకరించాలి

నేను 35 ఏళ్ల నుంచి రిక్షా తొక్కుతూ కుటుంబాన్ని పోషించుకుంటూ వస్తున్నా. రోజుకు వచ్చే రూ . 200 సంపాదన కుటుంబం గడవడానికి నానా తంటాలు పడాల్సిన పరిస్థితి. నా జీవితమంతా ఈ రిక్షావాలాగానే సాగిపోతుంది. ఆటోలు ఎక్కువైపోవటంతో మాకు గిరాకి తగ్గింది. నాలుగు, ఐదు ఏళ్ల క్రితం సిఐటియు ఆధ్వర్యంలో మా రిక్షా కార్మికులంతా కలసి ప్రమాద బీమా 5 లక్షలు కల్పించాలని, పెన్షన్ కు రూ.2000 కు పెంచాలని, వృద్ధాప్య పెన్షన్ 55 సంవత్సరముల నుండే సవరించాలని డిమాండ్ చేసినా ఇప్పటి వరకు ప్రభుత్వాలు పట్టించుకోలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం మాకు పథకాల రూపంలో సహకరించాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నాం.



కోటేశ్వరరావు - రిక్షావాలా



ప్రయాణికుల కోసం తిరుగుతూ...

క్యాంపస్ న్యూస్





మాట్లాడుతున్న విసి

సమిష్టి కృషితోనే ఐఇఎ

సమావేశాలు విజయవంతం : విసి

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో డిసెంబరు నెల 27 నుండి 30వ తేదీ వరకు జరిగిన భారత ఆర్థికసంఘ (ఐఈఎ) శతవసంతాల సమావేశాలను విజయవంతంగా నిర్వహించడం ఆనందదాయకమని వర్సిటీ విసి ఆచార్య ఎ.రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. అందరి సమిష్టి కృషితోనే ఇది సాధ్యమైందన్నారు. వర్సిటీలోని వివిధ కమిటీలకు ధన్యవాదాలు తెలిపేందుకు ఏర్పాటుచేసిన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. నాగార్జున యూనివర్సిటీ అందరి సహకారంతో ముందుకు సాగుతుందని ఈ క్రమంలో మరింత అభివృద్ధి సాధించాలంటే ఇదే తరహాలో కృషిచేయాలన్నారు. స్పోర్ట్స్ నిర్వహణలోనూ నాగార్జున యూనివర్సిటీ ముందంజలోఉందని ఎఎన్‌యు అభివృద్ధికి ప్రభుత్వం కూడా సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. వర్సిటీలో ఐఈఎ సమావేశాలు నిర్వహించేందుకు ప్రోత్సహించిన రాష్ట్ర ముఖ్యమంత్రికి, ఉన్నత విద్యామండలి చైర్మన్, వైస్‌చైర్మన్‌లకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ కె.జాన్‌పాల్, ప్రిన్సిపాళ్ళు నూర్‌బాషా అబ్దుల్, చందన్, ఈ.శ్రీనివాసరెడ్డి, జయరామ్ పాల్గొన్నారు.


వెంకటపాలెం లోని చెరువు

వెంకటపాలెం లోనూ వాకింగ్‌ట్రాక్

ప్రజాశక్తి-తుళ్ళూరు

రాజధాని ప్రాంతం, తుళ్లూరు మండలంలోని వెంకటపాలెంలోనూ వాకింగ్‌ట్రాక్ నిర్మాణం జరుగుతోంది. పంచాయతీ కార్యాలయం దగ్గర నుంచి చలివేంద్రం వైపుకు వెళ్ళే మార్గంలో ఊరిని ఆనుకొని ఉన్న చెరువును వాకింగ్‌ట్రాక్‌గా మార్చనున్నారు. ఇప్పటికే చెరువు చుట్టూ చదును చేశారు. మండల కేంద్రమైన తుళ్లూరులో ఎర్రమాను చెరువును ఇప్పటికే వాకింగ్‌ట్రాక్‌గా అభివృద్ధిచేయగా గంటలమ్మ చెరువు వద్ద పనులు జరుగుతున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు వెంకటపాలెం మీదుగా సచివాలయంకు వెళుతుంటారు. దీంతో గ్రామం వెలుపల చెరువు దగ్గరనుంచి చలివేంద్రం వరకు రోడ్డును సుందరంగా తీర్చిదిద్దారు. రోడ్డుకు ఇరుపక్కలా రంగురంగుల పూలమొక్కలతో పచ్చదనం ఉట్టిపడేలా అభివృద్ధి చేశారు. దీంతో అపరిశుభ్రంగా ఉన్న చెరువును కూడా అభివృద్ధి చేయాలన్న తలంపుతో సిఆర్‌డిఎ అధికారులు వాకింగ్‌ట్రాక్‌గా మార్చే ప్రక్రియ చేపట్టారు.

నేడు యోగా శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి - మంగళగిరిరూరల్

మండలంలోని పెదవడ్లపూడి సాయిబాబ గుడి కళామందిరంలో బుధవారం సాయంత్రం 5గంటలనుండి యోగా శిక్షణా శిబిరాన్ని ప్రారంభిస్తున్నట్లు శ్రీ వెంకటేశ్వర యోగా శిక్షణాకేంద్రం కార్యదర్శి ఎ.రత్నకుమారి తెలిపారు. ఈ శిబిరాన్ని సంస్థ వ్యవస్థాపకులు యోగాచార్యులు శ్రీవెంకటేశ్వర యోగి గురూజి ప్రారంభిస్తారన్నారు. నెలరోజులపాటు జరిగే యోగా శిక్షణలో ఆసనాలు, ప్రాణాయామం, ధ్యానముద్రలు, ఆహారనియమాలు, ఆధ్యాత్మిక విషయాలు బోధించబడతాయన్నారు.

సీడ్ యాక్సెస్ రోడ్డుపై ఆందోళన

సమస్యలపై సిపిఎం వినతి

ప్రజాశక్తి - తాడేపల్లి

తాడేపల్లి పట్టణంలోని 1, 20, 22 వార్డుల్లో మంగళవారం జన్మభూమి కార్యక్రమం జరిగింది. ఆయా వార్డుల్లో కౌన్సిలర్లు కేళి వెంకటేశ్వరరావు, చిన్నపోతుల సుబ్బారావు, కె.లక్ష్మి, అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబునాయుడు ఉపన్యాసాన్ని వివరించారు. చంద్రన్నబీమా కింద నాలుగు కార్డులు అందజేసి సభ ముగించారు. కొత్త ఇళ్ళకోసం 80 మంది దరఖాస్తు చేసుకోగా స్థలాల కోసం 103 మంది కార్డుల కోసం 220 మంది, పింఛన్లకోసం 84 మంది దరఖాస్తులు చేసుకున్నారు. మూడు వార్డుల్లో 71 కార్డులు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా మణిపాల్ ఆసుపత్రి నుండి రాజధాని అమరావతి వరకు వెళుతున్న సీడ్ యాక్సెస్ రోడ్డు బాధితులు అధికారులకు వైసిపి కన్వీనర్ బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి ఆధ్వర్యంలో అర్జీ అందజేశారు. గత నెల 19వ తేదీ సీడ్ యాక్సెస్ రోడ్డుకోసం 11.1 ప్రిలిమినరీ (ప్రాథమిక) భూసేకరణ నోటిఫికేషన్ పత్రికల్లో చూశామని ఆందోళన వ్యక్తం చేశారు. అభ్యంతరాలు ఉంటే 60 రోజుల్లోపుగా తెలియ జేయాలని అందులో కోరిన సంగతిని అధికారుల దృష్టికి తెచ్చారు. ఈ ప్రకటనకు ముందు చట్టప్రకారం భూసేకరణ చట్టంలోని సెక్షన్ 6 ప్రకారం సామాజిక ప్రభావ అధ్యయన నివేదిక, సెక్షన్ 7 ప్రకారం నిపుణుల కమిటీ వివరాలు నివేదిక,సెక్షన్ 8 ప్రకారం ప్రభుత్వ అధ్యయన నివేదిక (సారాంశం)లను తెలుగులో మాకు అందజేయవలసిందిగా కోరారు. జన్మభూమిలో ఇచ్చిన ఈ వినతిని తాడేపల్లి తహాశీల్దార్, గుంటూరు ఆర్‌డిఒ, కలెక్టర్, జాయింట్ కలెక్టర్లకు కూడా పంపిస్తున్నట్లు తెలిపారు. సభలో తాడేపల్లి మున్సిపల్ కమిషనర్ బిక్కిరెడ్డి శివారెడ్డి, చైర్‌పర్సన్ కె.మహాలక్ష్మి, మేకా వెంకటరామిరెడ్డి, వివిధ ప్రజాసంఘాల బాధ్యులు పాల్గొన్నారు.


సీడ్ యాక్సెస్ రోడ్డుపై అధికారులకు వివరిస్తున్న పట్టణ కన్వీనర్ వేణగోపాలసోమిరెడ్డి

సమస్యలపై సిపిఎం అర్జీలు

తాడేపల్లి పట్టణంలోని సుందరయ్యనగర్, మహానాడు ప్రాంతాల్లో నెలకొని ఉన్న సమస్యలపై సిపిఎం నాయకులు జన్మభూమి సభల్లో వినతి పత్రాలు అందజేశారు. విజయవాడ క్లబ్‌వైపు కట్టరోడ్డుపై లేస్తున్న దుమ్ము, ధూళితో ఇళ్ళలో ఉండలేకపోతున్నామని బాధితుల తరపున సిపిఎం నాయకులు అర్జీ ఇచ్చారు. వండుకున్న ఆహారపదార్థాలు కూడా తినలేకపోతున్నామని అందులో పేర్కొన్నారు. సిహెచ్.భుజంగరావు ఇంటి వద్ద గల ర్యాంపు పై నుండి మట్టి, ఇసుక తోలకాలు జరిపే ట్రాక్టర్లు, లారీలు తిరగడం వలన ఇళ్ళపై ఎప్పుడు వాహనాలు పడి ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని స్థానికులు వాపోతున్నారు. అధికారుల దృష్టికి ఈ సమస్య తీసుకొచ్చినా పరిష్కరించలేదని పేర్కొన్నారు. మహానాడు, సుందరయ్యనగర్ ప్రాంతాల్లో నివాసమంటున్న పేదల స్థలాలను రెగ్యులైజేషన్ చేసి పట్టాలు ఇవ్వాలని డిమాండ్‌చేశారు. ప్రస్తుతం చౌకధరల దుకాణాల ద్వారా నడుస్తున్న ప్రజాపంపిణీ వ్యవస్థను నిర్వీర్యం చేయడానికే మాల్స్‌ను తీసుకొస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలోపట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు, స్థానిక నాయకులు పి.గిరిజ, సిహెచ్.భుజంగరావు, పి.రామచంద్రరావు, బొబ్బిలి రామారావు, వెన్నపూస మాల్యాద్రి రెడ్డి, దొడ్డిపాటి వెంకటేశ్వర్లు, తూము విజయలక్ష్మి, దొంతిరెడ్డి విజయభాస్కరరెడ్డి పాల్గొన్నారు.

అవినీతి తగ్గితే చైనాకన్నా ముందుంటాం

సూర్యదేవర మహేంద్రదేవ్

ప్రజాశక్తి - దుగ్గిరాల

మనదేశంలో అవినీతి తగ్గినట్లయితే చైనాకన్నా ముందు అగ్రస్థానంలో ఉంటామని ఇండియన్ ఎకనమిక్ అసోసియేషన్ అధ్యక్షులు సూర్యదేవర మహేంద్రదేవ్ అన్నారు. మండలంలోని తుమ్మపూడి గ్రామంలో ఆయన స్వగృహంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందించడానికి వచ్చిన ఎమ్మెల్యే ఆళ్ళ రామకృషా రెడ్డితో ఆయన అనేక విషయాలు చర్చించారు. ఇండియన్ ఎకనమిక్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎనికైనందుకు ఆయనను అభినందించారు. గతంలో ఆయన కేంద్ర వ్యవసాయ ఉత్పత్తుల ధరల నిర్ధారక సంఘం అధ్యక్షులుగా కూడా పనిచేశారు. రైతుల కోసం ఏమైనా చేయాలని ఎమ్మెల్యే కోరారు. గుంటూరులో జరుగుతున్న సేంద్రియ వ్యవసాయ పతకంపై డాక్టర్ పాలేకర్ విధానాలు వ్యవసాయ పంటల ఉత్పత్తి ధరలతోపాటు పలు అంశాలు చర్చించారు. దేశ ఆర్థిక వ్యవస్థను గురించి మాట్లాడుతూ అవినీతి చీడపురుగులా తయారైందని దాన్ని తగ్గించ గలిగితే అభివృద్ధిలో చైనా కన్నా ముందుంటా మన్నారు. అంతకుముందు డిజిపి మాలకొండ య్యకూడ మార్యదపూర్వకంగా మహేంద్రదేవ్‌ను కలిశారు. హైదరా బాద్‌లో వారివురికి ఉన్న పాత పరిచయాల దృష్ట్యా మహేం ద్రదేవ్‌ను అభినందించడానికి డిజిపి ఆయన స్వగృహానికి వచ్చారు. స్థానికులు కూడా ఆయనను ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యేతోపాటు జడ్పిటిసి ఏళ్ళజయలక్ష్మి, మాజీ మార్కెటింగ్ యార్డు చైర్మన్ పాటిబండ్లకృష్ణప్రసాద్, వైఎస్‌ఆర్‌సిపి మండల అధ్యక్షులు ఎడ్ల సాయికృష్ణ, సిపిఎం నాయకులు వల్లభనేని సాంబశివరావు, స్థానికులు గుంటుపల్లి రమేష్ సత్యనారాయణ ప్రసాద్, కొత్తపల్లి సాంబశివరావు, వాసిరెడ్డి సాయి పాల్గొన్నారు.


మహేంద్రదేవ్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే ఆర్‌కె

వెంకటపాలెంలో 'జన్మభూమి-మాఊరు'

రాజధానిలో కార్మికశాఖాధికారిని నియమించాలి : సిఐటియు


సభలో మాట్లాడుతున్న సిఐటియు రాజధాని డివిజన్ కమిటీ కార్యదర్శి జె.నవీన్ ప్రకాష్

ప్రజాశక్తి-తుళ్ళూరు

రాజధాని ప్రాంత గ్రామాలు వెంకటపాలెం, మందడం పాఠశాలల్లో జన్మభూమి-మాఊరు మంగళవారం జరిగింది. తుళ్ళూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, ఆయుష్, పశువైద్యశాఖ ఆధ్వర్యంలో శిబిరాలు ఏర్పాటుచేశారు. రెవెన్యూ సిబ్బంది పట్టాదారుపాసు పుస్తకాలు, ఆధార్ నమోదు కేంద్రాలను తాత్కాలికంగా అందుబాటులో ఉంచారు. ఈ సందర్భంగా కొందరికి సామాజిక పింఛన్లు, విద్యార్థులకు ఉపకారవేతనాలు పంపిణీచేశారు. మందడంలో మధ్యాహ్నం అభివృద్ధి-సంక్షేమం పేరుతో స్వయం సహాయక సంఘ సభ్యులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సిఆర్‌డిఎ డిప్యూటీ కలెక్టర్లు పాల్గొన్నా రాజధానికి సంబంధించిన ప్రధానమైన అంశాలేవీ ప్రస్తావనకు రాలేదు. సిఐటియు రాజధాని డివిజన్ కమిటీ కార్యదర్శి జె.నవీన్‌ప్రకాష్ రాజధానిలో కార్మికశాఖాధిరిని నియమించాల్సిన అవసరం గురించి మాట్లాడారు. మంగళవారం రాజధాని గ్రామం మందడంలో 'జన్మభూమి-మాఊరు' కార్యక్రమం జరిగింది. రాజధాని ప్రాంతంలో భవన నిర్మాణరంగం విస్తరిస్తోందని, అనేక ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో కార్మికులు వివిధ పనుల నిమిత్తం వస్తున్నారని చెప్పారు. వీరికి తమ హక్కులు, భద్రత, కార్మిక చట్టాలను గురించి అవగాహన లేదన్నారు. సచివాలయంలో 8 గంటల పనివిధానం అమలుకావడం లేదన్నారు. వేతనాలు రూ12,500 లు ఇవ్వాల్సిఉండగా రూ. 8వేలు ఇస్తున్నారని చెప్పారు. ఈ ప్రాంతంలో కార్మికశాఖ కార్యాలయం లేకపోవడంతో అమరావతి వెళ్ళాల్సివస్తోందని చెప్పారు. రాజధాని ప్రాంతంలో కార్మికశాఖాధికారిని నియమించాల్సిన అవసరం ఉందన్నారు. ఎంపీడీవో జె.మోహనరావు స్పందిస్తూ రాతపూర్వకంగా ఇస్తే ప్రభుత్వానికి తెలియజేస్తానని చెప్పారు. కార్యక్రమంలో తహాశీల్దార్ ఎం.పూర్ణచంద్రరావు, ఎంఈవో జి.కోటేశ్వరరావు,ఎంపీపీ వి.పద్మలత, జడ్పీటీసీ బెజవాడ నరేంద్రబాబు, సిఆర్‌డిఎ డిప్యూటీ కలెక్టర్లు, ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

గర్భిణులకు శ్రీమంతం

గర్భిణులు వైద్యాధికారుల సూచనలను పాటిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఎంపీపీ వడ్లమూడి పద్మలత అన్నారు.మంగళవారం రాజధాని ప్రాంతం,తుళ్ళూరు మండలంలోని వెంకటపాలెంలో జన్మభూమి-మా ఊరు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఐసిడిఎస్ ఆధ్వర్యంలో గర్భిణులకు మహిళా ప్రజాప్రతినిధులు, అధికారులు సీమంతాలు జరిపారు.

అధికారులే వెళ్లి సమస్యను పరిష్కరించాలి : వంశీ

ప్రజాశక్తి-ఉంగుటూరు(హనుమాన్‌జంక్షన్)

ప్రజల సమయం,డబ్బు వృథా కాకుండా అధికారులే వారి వద్దకు వెళ్లి తక్షణ పరిష్కారం చేసే విధంగా ప్రజల వద్దకే పాలనకు సిఎం జన్మభూమి-మాఊరు కార్యక్రమం చేపట్టినట్లు గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ అన్నారు. బాపులపాడు మండలం మల్లవల్లిలో మంగళవారం జరిగిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. బాపులపాడు పిహెచ్‌సి ఆద్వర్యంలో ఉచిత వైద్యశిభిరం,పౌష్టికాహారం గురించి తెలియజేస్తూ ఐసిడిఎస్ ఆద్వర్యంలో చిరుధాన్యాల ప్రదర్శన ఏర్పాటుచేశారు. ఎంపిపి తుమ్మల కోమలి, మండల ప్రత్యేక అధికారి పి.సత్యనారాయణ, ఎంపిడిఓ ఆర్.కేశవరెడ్డి, సర్పంచ్ చాకిరి కొండలరావు, ఎంపిటిసి వేముల శ్రీనివాసరావు, జలవనరులశాఖ రాష్ట్ర ఎపెక్స్ కమిటీ సభ్యులు ఆళ్ల గోపాలకృష్ణ, టిడిపి మండల అధ్యక్షులు వీరమాచినేని సత్యప్రసాద్,గ్రామపార్టీ అధ్యక్షులు వై.వెంకయ్యరావు,వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.అనంతరం రేమల్లెలో జన్మభూమి గ్రామసభ జరిగింది.గ్రామసభల్లో చంద్రన్న సంక్రాంతి కానులకు అందజేశారు.బాపులపాడు మండలం మడిచర్ల,కొత్తపల్లిలో తహశీల్దారు కె.గోపాలకృష్ణ ఆద్వర్యంలో జన్మభూమి గ్రామసభలు జరిగాయి.ఈ సభల్లో గ్రామస్తులు పలు సమస్యలు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీ

డ్రైయినేజి వ్యవస్థ,వాటర్ ట్యాంకు బాగుచేయాలి :

గ్రామంలో శిథిలావస్థలో ఉన్న వాటర్ ట్యాంకును బాగుచేసి ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలని,డ్రైయినేజి వ్యవస్థ అభివృద్ధి చేసి మురుగునీటిని ఊరికి దూరంగా పంపాలని,రోడ్లు అభివృద్ధి చేయాలని తదితర సమస్యలు ఎమ్మెల్యే వంశీ దృష్టికి మల్లవల్లి గ్రామస్తులు తీసుకోచ్చారు. విద్యుత్ లైన్‌మెన్ లేక కరెంటుతో తాము నానా అవస్థలు పడుతున్నామని ఎమ్మెల్యేకు వివరించారు. దీనికి స్పందించి ఎమ్మెల్యే వంశీ మాట్లాడుతూ శిథిలమైన వాటర్ ట్యాంకు డ్రైయినేజి పైపులైను మరమత్తులకు నా సొంత నిధులు రూ.25వేలు ఇస్తానని, వాటితో అది బాగుచేయాలని అధికారులకు సూచించారు.డ్రైయినేజి వ్యవస్థపై గ్రామసర్పంచ్‌ను ఎమ్మెల్యే వివరణ కోరగా రోడ్లు నిర్మాణ సమయంలో కొంత భూమి ఇస్తే డ్రైయినేజి వ్యవస్థ అభివృద్ధి చేయ్యొచ్చని ప్రజల సహకారం కొరవడిందన్నారు.ఎమ్మెల్యే వంశీ మాట్లాడుతూ గ్రామాల భివృద్ధికి ప్రజల సహకారం ఉండాలన్నారు.లైన్‌మెన్‌ను ఈనెలాఖరులోగా నియమించనున్నట్లు ఆశాఖ డిఈ తెలిపినట్లు పేర్కొన్నారు.

సోలార్ మోటార్‌కు డబ్బుకట్టి 5నెలలు

సోలార్ మోటార్‌కు డబ్బులు కట్టి 5నెలలు గడుస్తున్నా ఇంతవరకు మోటారు బిగించలేదని మల్లవల్లి గ్రామస్తుడు సాకె సాంబశివరావు జన్మభూమి గ్రామసభలో ఆవేదన వ్యక్తం చేశారు.రూ.57,500లు చెల్లించి నెలలు గడుస్తుందని,సోలార్ మోటారు విషయమై అధికారుల స్పందన సరిగాలేదని ఎమ్మెల్యే వంశీకి తెలిపారు.దీనికి స్పందించిన ఎమ్మెల్యే వంశీ మాట్లాడుతూ అధికారులతో మాట్లాడి సోలార్ మోటారు వీలైనంత తొందరగా బిగించేవిధంగా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

నేడు సావిత్రీభాయి పూలే సంస్మరణ సభ

ప్రజాశక్తి - గన్నవరం

గన్నవరం వికెఆర్ కళాశాల ఆవరణలో బుధవారం అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఆద్వర్యంలో సావిత్రీబాయ్ పూలే జయంతి సభ నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షులు మల్లంపల్లి జయమ్మ మంగళవారం తెలిపారు. అభ్యుదయ విలువల కోసం ఆమె ఎంతో శ్రమించారని చెప్పారు. కుల దురంహకారాన్ని, అణచివేతను వ్యతిరేస్తూ ఆ వ్యవస్థను ప్రతిఘటించారని గుర్తు చేశారు. అణగారిన వర్గాల ప్రజలను, స్త్రీలను అక్కున చేర్చుకున్నారని తెలిపారు. బాల్యవివాహాలకు వ్యతిరేకంగా, వితంతు పునర్వివాహాలు జరిపించేందుకు 150 ఏళ్ల క్రిందటే పెద్ద ఎత్తున పోరాటాలు చేశారని వివరించారు. అభాగ్య వితంతు స్త్రీలకు ధైర్యం చెప్పి వారికి, వారి బిడ్డలకు ఆత్మవిశ్వాసం కల్పించిన ధీశాలి సావిత్రీబాయ్ పూలే అన్నారు. ఆమె జయంతిని పురస్కరించుకుని సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈసభలో ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షులు కాట్రగడ్డ స్వరూపారాణి, జిల్లా కార్యదర్శి పి న్నమనేని విజయ, సామాజిక విశ్లేషకులు డాక్టర్ కొడాలి రాజేశ్వరి, సీనియర్ న్యాయవాది అనుమోలు వెంకటేశ్వరరావు, కళాశాల ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసరావు పాల్గొంటారని వివరించారు.

అమరవీరుల పోరాట స్ఫూర్తిని కొనసాగిస్తాం

సిపిఎం తూర్పుకృష్ణా కార్యదర్శి ఆర్.రఘు

ప్రజాశక్తి - గన్నవరం

పేదల బాగు కోసం తమ ప్రాణాలు తృణ ప్రాయంగా అర్పించిన అమరవీరులు జాస్తి బసవరావు స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు ఉదృతం చేస్తామని సిపియంజిల్లా కార్యదర్శి(తూర్పుకృష్ణా) ఆర్.రఘు అన్నారు.మంగళవారం గన్నవరం మండలం కేసరపల్లిలో అమరవీరులు జాస్తిబసవరావు వర్ధంతి సభ నిర్వహించారు. దీనికి గ్రామ పార్టీ సీనియర్ నాయకులు సుదాబత్తుల బుజ్జి అధ్యక్షత వహించారు. రఘు మాట్లా డుతూ పోరాటాల చరిత్ర కమ్యునిస్టుల సొంతమని గుర్తు చేశారు. అరవై ఏళ్ల క్రితం గన్నవరం తాలుకాలో భూ పోరాటాలు పెద్ద ఎత్తున సాగాయని, అప్పట్లో పోలీసుల తుపాకీ గుళ్లకు జాస్తి బసవరావు బలైపోయారని చెప్పారు. అప్పటికీ , ఇప్పటికీ రాజకీయ పరిస్థితులు మారినా అమరవీరుల స్ఫూర్తిని కొనసాగిస్తూ పేదల పక్షాన పోరాటాలు చేస్తున్నామన్నారు. కేసరపల్లిలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇప్పించడమే బసవరావుకు ఇచ్చే నిజమైన నివాళి అన్నారు. సిపియం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వై.నరసింహారావు మాట్లాడుతూ విమానాశ్రయ విస్తరణలో ఇళ్లు , భూములు కోల్పోయే వారి పక్షాన పోరాటాలు చేశామన్నారు. ఏలూరు కాలువ మళ్లింపు వద్దని నెలల తరబడి సాగిన పో రాటంలో కీలక పాత్ర పోషించామన్నారు. పోరాటం చేయడం వల్లే కాలువ మళ్లింపు ఆగిపోయిందని, విమానాశ్రయ విస్తరణలో ఇళ్లు పోయే వారికి ప్రత్యామ్నాయ ఇళ్లు కట్టించి ఇస్తామని చెప్పారని గుర్తుచేశారు. రైతులకు న్యాయమైన పరిహారం వచ్చిందన్నారు. ప్రభుత్వం నుంచి ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ఎర్ర జెండాలు పట్టుకుని బసవ రావుని గుండెల్లో పెట్టుకుని పోరాటాలు చేస్తూనే ఉంటామన్నారు. పెట్టుబడిదారుల ప్రయోజనం కోసం రేషన్ డిపోల వ్యవస్థను నిర్వీర్యం చేయాలని చూస్తోందని మండిపడ్డారు. ఏఎంసి ఛైర్మన్ పొట్లూరి బసవరావు మాట్లాడుతూ ఒకపుడు కేసరపల్లి కమ్యునిస్టులకు కంచుకోటగా ఉండేదన్నారు. ఇక్కడ నుంచే భూపోరాటాలు, కిలో రూపాయికి బియ్యం విక్రయ పోరాటాలు సాగినట్లు గుర్తు చేశారు. దాంట్లో తన మేనమామ జాస్తి బసవరావు కీలక పాత్ర పోషించారన్నారు. 69ఏళ్లుఅయినా బసవరావుని మర్చిపోకుండా వర్ధంతి కార్యక్రమాలు నిర్వహిస్తున్న బుజ్జిని అభినందించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బసవరావు స్థూపంపై రఘు జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు అనుమోలు వెంకటేశ్వరరావు, పిల్లి మహేష్, డిఎస్.ప్రసాద్, మల్లంపల్లి జయమ్మ, సుదాబత్తులు కమల, ఇతర పెద్దలు పాల్గొన్నారు. అనంతరం అల్పాహారం పంపిణీ చేశారు.


గన్నవరం మండలం కేసరపల్లిలో జాస్తి బసవారావు వర్థంతి సభలో మాట్లాడుతున్న సిపిఎం తూర్పుకృష్ణా కార్యదర్శి ఆర్.రఘు, వేదికపై పొట్లూరి బసవారావు

వెల్దిపాడు విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-ఉంగుటూరు

క్రీడల్లో ఉంగుటూరు మండలం వెల్దిపాడు జెడ్పీ హైస్కూలు విద్యార్థులు తమ ప్రతిభ చాటి డివిజన్‌లో మొదటి బహుమతి గెలుపొందినట్లు పాఠశాల హెచ్ఎం ఎస్ రామాంజనేయులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. డిసెంబరు 27,28 తేదీల్లో మైలవరంలోని ఎస్ఎస్‌కె హైస్కూలులో నూజివీడు డివిజన్ బాలికల విభాగంలో జరిగిన 81వ గ్రిగ్ పోటీలు సీనియర్ విభాగంలో డివిజన్‌స్థాయిలో వాలీబాల్ పోటీల్లో ప్రథమ బహుమతి గెలుపొందినట్లు పేర్కొన్నారు. వ్యాయామోపాధ్యాయురాలు డి.రాజేశ్వరీలను మంగళవారం ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులు,విద్యార్థులు అభినందించారు.ఈకార్య పాఠశాల స్కూల్ అసిస్టెంట్ టి.మదుసూధనరావు తదితరులు పాల్గొన్నారు.


వాలీబాల్ బృందంతో పాఠశాల ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులు

37వ రోజుకు డెల్టాకార్మికుల దీక్షలు

ప్రజాశక్తి-ఉంగుటూరు(హనుమాన్‌జంక్షన్)

డెల్టా యాజమాన్య మొండి వైఖరిని నిరసిస్తూ కార్మికులు చేపట్టిన నిరసన దీక్షలు 37వ రోజులకు చేరాయి. మంగళవారం సిపిఎం బాపులపాడు మండల నాయకులు అబ్దుల్ భారీ, సిపిఐ గన్నవరం నియోజకవర్గ నాయకులు కొండా వీరాస్వామి ఈ దీక్షా శిభిరాన్ని సందర్శించి కార్మికులకు సంఘీభావం తెలిపారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను యాజమాన్యం వెంటనే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్రప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని ఈ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ దీక్షలో ఫ్యాక్టరీ కార్మికులు పి.సత్యనారాయణ, జి.శ్రీనివాసరావు, వై.నాగరాజు, బి.నాగేశ్వరావు,కె.డేవిడ్‌రాజు,కె.సత్యనారాయణ, ఎస్.విల్సన్‌రాజు, సిహెచ్.కోటేశ్వరావు, సిహెచ్.భాగ్యరాజు,కె.సంపత్‌కుమార్, బాబు తదితరులు పాల్గొన్నారు.


సంఘీభావంగా దీక్షల్లో కూర్చున్న సిపిఎం నాయకులు

సమగ్ర సమాచారంతో గ్రామసభలకు రండి : అనురాధ


మహిళలకు శ్రీమంతాలు చేస్తున్న అనురాధ

ప్రజాశక్తి-ఉంగుటూరు

జన్మభూమి-మాఊరు గ్రామసభలకు అధికారులు సమగ్ర సమాచారంతో రావాలని జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ గద్దె అనురాధ అన్నారు. మండలంలోని ఇందుపల్లి, నాగవరప్పాడు,ఆముదాలపల్లి, వేమండలలో మంగళవారం గ్రామసభలు జరిగాయి. ఇందుపల్లి గ్రామసభలో ప్రజలడిగిన ప్రశ్నలకు అధికారులు సరిగా సమాధానం ఇవ్వకపోవడంతో ఆమె పైవిధంగా స్పందించారు. ప్రజలడిగిన ప్రశ్నలకు వెంటనే జవాబివ్వడానికి అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. ద్ధంగా ఉండాలని అధికారులపై విస్మయం వ్యక్తం చేశారు. స్వచ్ఛత అవార్డు అందుకున్న గ్రామంలో ఇంకా కొంతమందికి ఎందుకు మరుగుదొడ్లు లేవని అధికారులను ప్రశ్నించారు. జడ్‌పిహైస్కూల్లో పాత కలపను ఎవరికీ తెలియకుండా అమ్ముకోవడాన్ని గ్రామస్తులు జడ్‌పిచైర్‌పర్సన్ దృష్టికి తెచ్చారు. మూడేళు ్లగా ఒకరి పింఛను మరోఖాతా నంబర్లో జమ అవుతున్నా అధికారులు దాన్ని సరిచేయలేదని లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం 15 మంది గర్భిణీలకు జడ్‌పిచైర్‌పర్సన్ అనురాధ చేతులు మీదుగా సామూహిక శ్రీమంతం చేసి చీరలు,తాంబూలాలు అందించారు. ఈకార్యక్రమంలో ఎంపిపి గుదె ఇందిర,ఎంపిడివో పిఎస్ఆర్ ప్రసాద్,గ్రామసర్పంచ్ పి.కోటేశ్వరమ్మ,ఎంపిటిసి పి.రాంబాబు,వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.నాగవరప్పాడులో జరిగిన గ్రామసభలో జడ్‌పిచైర్‌పర్సన్ పాల్గొని ప్రజాసమస్యలు తెలుసుకున్నారు.ఈకార్యక్రమంలో ఎంపిపి గుదె ఇందిర,సర్పంచ్ కె.లక్ష్మీ,ఎంపిటిసి టివిలక్ష్మణస్వామి,ఎంపిడివో పలుశాఖా అధికారులు పాల్గొన్నారు.ఇళ్లస్థలాలు ఇవ్వాలని,ఉపాధి హామీ పథకం పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని,రుణమాఫీ డబ్బులు విడుదల చేయాలని,రెండో పంటకు ఏలూరు కాలువ నుంచి నీరు వదలాలని,త్రాగునీరు విడుదల చేయాలని గ్రామస్తులు సమస్యలు జడ్‌పిచైర్‌పర్సన్ అనురాధను దృష్టికి తీసుకొచ్చారు.ఆముదాలపల్లిలో మాజీ ఎమ్మెల్యే దాసరి వెంకటబాలవర్ధనరావు జన్మభూమి గ్రామసభలో పాల్గొన్నారు.చంద్రన్న సంక్రాంతి కానుకలు లబ్ధిదారులకు అందజేశారు.రైతులు తమ పొలాల్లో చెత్తను తగలబెట్టవద్దని సందేశం ఇస్తూ వ్యవసాయశాఖ రూపొందించిన గోడ పత్రికలను దాసరి చేతులు మీదుగా ఆవిష్కరించారు.ఈకార్యక్రమంలో తహశీల్దారు ఎం.శ్రీనివాసు,ఈవోపిఆర్‌డి ముత్తవరపు నరసింహారావు,సర్పంచ్ సిహెచ్ విజయలక్ష్మీ,ఎంపిటిసి దాసరి రామ్మోహనరావు,పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.అనంతరం వేమండలో గ్రామసభ జరిగింది.ఈకార్యక్రమంలో సర్పంచ్ ఎస్.సాంబశివరావు,ఎంపిటిసి కె.రజని తదితరులు పాల్గొన్నారు.వివిధ సమస్యలపై ఇందుపల్లిలో 86,నాగవరప్పాడులో 60,ఆముదాలపల్లిలో 13,వేమండలో 42 ధరఖాస్తులు ప్రజల నుంచి అందినట్లు అధికారులు తెలిపారు.




క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎంపిపి రాపర్ల రామాంజమ్మ

ఉపాధ్యాయులు ఉత్తమ సమాజ స్థాపకులు

ప్రజాశక్తి-ఈపూరు

ఉపాధ్యాయులు విద్యాబోధనలో మెరుగైన ఫలితాలు సాధిస్తూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపిపి రాపర్ల రామాంజమ్మ అన్నారు. స్థానిక ఈపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో యుటిఎఫ్ క్యాలెండర్, డైరీ, జిఓబుక్, పాకెట్ క్యాలెండర్‌లను ఆమె ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ యుటిఎఫ్ డైరి, జిఓబుక్ ఉపాధ్యాయులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. సమగ్ర సమాచారం తెలిపేలా డైరి, జిఓబుక్‌ను రూపొందించి ఉపాధ్యాయులకు అందింటం ఆనందించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో టిడిపి మండలాధ్యక్షుడు రాపర్ల జగ్గారావు, యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ జి.నాగరాజు, ఏపి మోడల్‌స్కూల్ ప్రిన్సిపల్ వేళాంగిణి మేరి, యుటిఎఫ్ మండలాధ్యక్షులు వి.నాగేశ్వర రావు, ప్రధానకార్యదర్శి ఎ.వీరాంజనేయులు, ఎన్.లింగారావు, టి.నాగరాజు, బి.భాస్కర్, వివి.పద్మావతి, నాగేశ్వరరావు, గోవిందునాయక్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బొల్లా బ్రహ్మనాయుడు

ఆక్రమణలకు పాల్పడుతున్న అధికారపార్టీ

ప్రజాశక్తి -వినుకొండ

అధికార పార్టీకి చెందిన కొందరు నేతలు భూ ఆక్రమణలకు పాల్పడుతున్నారని వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త బొల్లా బ్రహ్మనాయుడు ఆరోపించారు. పట్టణంలోని వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బొల్లాపల్లి మండలం గుమ్మనంపాడులో ప్రభుత్వం అగ్రహార భూములు సర్వేచేసి రైతులకు పట్టాలు ఇస్తుందన్నారు. కొంత మంది టిడిపికి చెందిన ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాల వారు వందలాది ఎకరాలను దౌర్జన్యముగా, టిడిపి అండతో బినామీ పేర్లతో భూములను ఆక్రమిస్తున్నట్లు ఆయన విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీల ఆధీనంలో ఉన్న భూములు ఇప్పటికి వరకు అనుభవించారని ఆరోపించారు. ఇటువంటి దౌర్జన్యాలు, భూ ఆక్రమణలను వైసిపి ఖండిస్తుందని, పేదల పక్షాన తాము అండగా ఉండి పోరాటం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో డి. గోవిందునాయక్, పుష్పరెడ్డి, చిన్నబ్బాయి, దండు చెన్నయ్య, గురవయ్య, గంధం బాలిరెడ్డి, ఆదిరెడ్డి, వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు, పాల్గొన్నారు.

13 నుండి జాతీయ స్థాయి కబడ్డీ పోటీలు

ప్రజాశక్తి - నరసరావుపేట

జనవరి 13 నుండి 16వ తేది వరకు ఎ.ముప్పాళ్ళలో జాతీయ స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తల్లపనేని రామారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలు నాకౌట్ కమ్‌లీగ్ పద్ధతిలో డే అండ్ నైట్ నిర్వహిస్తారన్నారు. విజేతలకు బహూమతులు అందజేస్తారని తెలిపారు. క్రీడాకారులకు భోజన వసతి కల్పించడం జరుగుతుంది. వివరాలకు 9849150567 నంబర్లను సంప్రదించాలన్నారు.

సమస్యల పరిష్కార వేదికలుగా జన్మభూమి సభలు : మంత్రి పత్తిపాటి

ప్రజాశక్తి - నాదెండ్ల


సమస్యల పరిష్కారానికి జన్మభూమి మాఊరు కార్యక్రమాన్ని ఒక వేదికగా మలచుకోవాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖామంత్రి పత్తిపాటి పుల్లారావు అన్నారు. మంగళవారం మండలంలోని సాతులూరులో నిర్వహించిన 5వ విడత జన్మభూమి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ మూడున్నర సంవత్సర కాలంలో ఈ గ్రామానికి రూ.24 కోట్లతో అభివృద్ధి చేశామన్నారు. గ్రామానికి 163 రేషన్ కార్డులు, 18 కొత్త కార్డులు వచ్చినట్లు మంత్రి తెలిపారు. గ్రామాన్ని మండల టిడిపి పార్టీ నాయకుడు బండారు పల్లి సత్యనారాయణ గ్రామాన్ని ఎంతో అభివృద్ధి చేశారన్నారు. గతంలో లేని విధంగా గ్రామంలో 30 సిసి రోడ్లు గ్రామానికి నిర్మించారన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ కోనా శశిధర్ మాట్లాడుతూ



వినుకొండలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జివి

పండగల అన్నిటితో పాటు జన్మభూమి ఒక పండుగలా జరుపుకోవాలన్నారు. ఈ గ్రామాలలో కుటుంబ వికాశంలో 15 అంశాలు ప్రభుత్వం నిర్ధేశించిందని, అది ప్రజలకు ఎంతో ఉపయోగపడతాయన్నారు. జన్మభూమి కార్యక్రమంలో అన్నీ శాఖలకు సంబంధించిన అధికారులు పాల్గొంటారని, ఎవ్వరెవ్వరు ఏ ఏ సమస్యలు ఉన్నట్లయితే పై అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ ముని వెంకటయ్య, నరసరావుపేట అర్డీవో రవీంద్ర, నరసరావుపేట డిఎస్పీ కె.నాగేశ్వరరావు, నెల్లూరి సదాశివరావు, ఎంపిపి కాటా సాయిలక్ష్మి, జెడ్‌పిటిసి చింతలపుడి నాగలక్ష్మీ వెంకయ్యచౌదరి, గ్రామ సర్పంచ్ పోపూరి వింద్యారాణి, టిడిపిఒ సులోచన, ఎపిఎమ్ ప్రియదర్శిని, తహశీల్దార్ మేడూరి శిరీష, ఎంపిడిఒ జి.కాశయ్య, ఎంఇఒ ఆంజనేయులు, ఎస్సై కె.చంద్రశేఖర్, రూరల్ సిఐ శోభన్‌బాబులు పాల్గొన్నారు. అనంతరం అంగన్‌వాడీ సెంటర్‌లో గర్భిణులకు సామూహిక శ్రీమంతం నిర్వహించారు.

నరసరావుపేట : పట్టణ ప్రజలకు మౌళిక వసతులు కల్పించి అభివృద్ధి చేయడంలో ముందంజలో ఉందని, మిగిలిన సమస్యలు ఉంటే జన్మభూమి ద్వారా తెలుసుకొని పరిష్కరిస్తామని స్పీకర్ కోడెల శివప్రసాదరావు అన్నారు. స్టేడియంలోని క్రీడా ప్రాంగణంలో పట్టణంలోని 1,2,32,33,34 వార్డుల జన్మభూమి కార్యక్రమం మున్సిపల్ కమిషనర్ ఎ.భానుప్రతాప్ అధ్యక్షతన నిర్వహించారు. కోడెల మాట్లాడుతూ పట్టణంలో 2,003 ఇళ్ళు, 74 సిసి రోడ్లు, 43 మందికి రూ.62 లక్షల చంద్రన్న బీమా పథకం ద్వారా నగదును అందించామని అన్నారు. మూడున్నర కోట్ల వ్యయంతో సప్తా వద్ద ముంపు నివారణకు డ్రైనేజీ నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. రూ.13 కోట్లతో స్టేడియం వద్ద సప్టాను తొలగించి బ్రిడ్జి నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. మిగిలిన ప్రాంతాలలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు రూ.4.50 కోట్లతో నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. కొత్తగా మంజూరైన



రొంపిచర్లలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ షరీఫ్

రేషన్ కార్డులు, పింఛన్లు లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నాగసరపు సుబ్బరాయగుప్త, వైస్ చైర్మన్ మీరావలి, కౌన్సిలర్లు యర్రంశెట్టి రాము, కోవూరి శివప్రసాద్, అబ్దుల్ గఫార్, చంద్రశేఖర్, సయ్యద్ మహబూబ్‌బి పాల్గొన్నారు. కార్యక్రమంలో డిఇఇ జె.శివరామకృష్ణ, టిపిఒ ఎ.సాంబయ్య, మేనేజర్ కెవియస్‌యస్.శర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

వినుకొండ : పేదలకు పక్కా గృహాలు



సాతులూరులో మాట్లాడుతున్న మంత్రి పత్తిపాటి

అందించేందుకు ప్రభుత్వం ప్రణాళికతో ఎన్‌టిఆం గృహకల్ప పథకాన్ని తీసుకువచ్చిందని వినుకొండ పట్టణానికి 4 వేల ఇళ్లు ప్రభుత్వం మంజూరు చేసిందని, త్వరలో అపార్ట్‌మెంట్ నిర్మాణం చేసి పేదలకు అందజేస్తామని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు తెలిపారు. జన్మభూమి - మా ఊరు సభలు నియోజకవర్గంలోని ఐదు మండలాలతో పాటు వినుకొండ పట్టణంలో ప్రారంభించారు. పట్టణంలోని 1వ వార్డులో గల ప్రభుత్వ పాఠశాల్లో నిర్వహించిన సభకు ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. వినుకొండ ప్రాంతానికి తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు రూ.102 కోట్లు ప్రభుత్వం విడుదల చేసిందని, వాటర్ గ్రిడ్ ద్వారా ఎన్‌ఎస్‌పీ కాలువల నుంచి సాగర్ జలాలను వినుకొండ ప్రాంత ప్రజలకు అందజేస్తామని చెప్పారు. చంద్రన్న బాట పథకం ద్వారా నియోజకవర్గంలో 99 కిలోమీటర్లు సిమెంటు రోడ్లు వేశామన్నారు. ప్రతి వార్డుతో పాటు గ్రామాల్లో చంద్రన్న బాట ద్వారా రోడ్ల వేస్తున్నామన్నారు. వినుకొండ నియోజకవర్గానికి 2 వేల పెన్షన్లు ఇవ్వనున్నట్లు తెలిపారు. మూడున్నరేళ్ళల్లో 1వవార్డు అభివృద్ధికి రూ.94లక్షలు ఖర్చు చేయడం జరిగిందన్నారు. అలాగే 2వ వార్డులోని ఇందిరానగర్‌లో జరగిన జన్మభూమి- మా ఊరు సభకు ఎమ్మెల్యే జీవీ హజరయ్యారు. సమావేశానికి మున్సిపల్ ఛైర్మన్ పఠాన్ సమీరాఖానమ్ షమీమ్, కౌన్సిలర్ బూదాల చిన్నా, టీడీపీ నాయకులు పీవీ సురేష్‌బాబు, సౌదాగర్ జానీబాషా తదితరులు పాల్గొన్నారు. పేదలకు రూ.200లకు మంచినీటి కొళాయి కనెక్షన్లు ఇస్తామని ఎమ్మెల్యే చెప్పారు. 1వ వార్డులోని 22 మంది



ఈపూరులో వైద్యపరీక్షలు చేయించుకుంటున్న స్పేషల్ కలెక్టర్

లబ్ధిదారులను మున్సిపల్ అధికారులు గుర్తించి రూ.200ల కొళాయి కనెక్షన్లు మంజూరు చేశారని వారు ప్రతి నెలా నీటి పన్ను రూ.100 చెల్లించాల్సి ఉంటుందన్నారు. పట్టణంలో ఇంటి పన్నులు పెంచైనా సరే పేదలకు రూ.200 తాగునీటి కొళాయి కనెక్షన్లు మంజూరు చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు.

రొంపిచర్ల : ప్రజా సమస్యల పరిష్కారం కోసమే జన్మభూమి- మా ఊరు కార్యక్రమం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామని నూజివీడు ఎమ్మెల్సీ మహ్మద్ షరీఫ్ అన్నారు. జన్మభూమి కార్యక్రమం మాచవరం, నల్లగార్లపాడు, అచ్చయ్యపాలెం గ్రామాలలో నిర్వహించారు. మొదటిగా ముఖ్యమంత్రి ప్రచురణ చదివి జన్మభూమి ప్రతిజ్ఞ చేయించి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మాచవరం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న మహ్మద్ షరీఫ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో ప్రతి సమస్య ఖచ్చితంగా పరిష్కారం అవుతుందన్నారు. పాదయాత్రలో తమ దృష్టికి వచ్చిన అనేక సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి ప్రతినిత్యం కష్టపడుతున్నారన్నారు. గూడు లేని పేదలకు 2019 నాటికి 19 లక్షల నిర్మాణాలకు శ్రీకారం చుట్టిందన్నారు. రాష్ట్రాభివృద్ధి కోసం నిరంతరం పాటుపడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడను ప్రజలు ఆదరించాలన్నారు.

సమస్యలపై అధికారులను నిలదీసిన గ్రామస్తులు

మండలంలో మాచవరం, నల్లగార్లపాడు, అచ్చయ్య పాలెం గ్రామాల్లో మొదటి రోజు సభల్లో గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై అధికారులను గ్రామస్తులు నిలదీశారు. మాచవరం గ్రామంలో మంచినీటి సమస్య తీవ్రంగా ఉందని, రోడ్లు సక్రమంగా లేవని, నల్లగార్లపాడు గ్రామంలో వ్యవసాయాధికారులు రైతులకు విత్తనాల పంపిణీలో పక్షపాత వైఖరిని చూపించారని, అర్హులకు కాకుండా, అనర్హులకు పింఛన్లు పంపిణీ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రేషన్ కార్డు, పింఛన్లు, గృహ నిర్మాణాల కోసం గ్రామస్తులు అధిక సంఖ్యలో దరఖాస్తు చేసుకున్నారు. ఈ సమస్యలను వెంటనే పరిశీలించి వాటిని పరిష్కరిస్తామని అధికారులు గ్రామస్తులకు తెలిపారు. అర్హులైన లబ్ధిదారులకు రేషన్ కార్డులు, పింఛన్లు, విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నరసరావుపేట నియోజకవర్గ ప్రత్యేక అధికారి వై.చంద్రబాబు, మండల ప్రత్యేక అధికారి వెంకటేశ్వరరావు, ఎంపిపి మొండితోక రామారావు, మార్కెట్ యార్డు చైర్మన్ లింగా వెంకటేశ్వర్లు, ఎండిఒ కె.మాధ్యుబాబు, తహశీల్దార్ కె.నాసరయ్య, ఎఒ.సరళ, డిసి ఛైర్మన్ కె.కొండలు, వైస్ చైర్మన్ వై.కోటిరెడ్డి, మండల టిడిపి అధ్యక్షులు మెట్టు వెంకటేశ్వరరెడ్డి, మండల ఆర్గనైజింగ్ సెక్రటరీ పచ్చవ కృష్ణ, పచ్చవ కోటేశ్వరరావు, వివిధ శాఖలాధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



నరసరావుపేటలో మాట్లాడుతున్న కోడెల

ప్రత్తిపాడు : ప్రభుత్వ పథకాలను ప్రజలందరూ వినియోగించుకోవాలని జెడ్‌పిటిసి పి.భాగ్యారావు అన్నారు. మండలంలోని నడింపాలెంలో సర్పంచ్ బాలశౌరి అధ్యక్షతన నిర్వహించిన సభలో ఆయన పాల్గొని ప్రశంగించారు. నియోజకవర్గంలో సుమారు రూ.2వేల కోట్లతో పలు అభివృద్ధి పనులు నిర్మించామన్నారు.

ఈపూరు : ప్రజా సమస్యల పరిష్కారానికే జన్మభూమి-మాఊరు కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందని స్పెషల్ కలెక్టర్ ఎల్. విజయచందర్ అన్నారు. మండలంలోని బోడేపూడ వారిపాలెం, కొండ్రముట్ల గ్రామాల్లో సభ నిర్వహించారు. గ్రామస్తులు వివిధ సమస్యలపై దరఖాస్తులను అధికారులకు అందజేశారు. బోడేపూడివారిపాలెంలో స్పెషల్ కలెక్టర్ విజయచందర్ వైద్య శిబిరాన్ని పరిశీలించి వారికి తగు సూచనలు చేశారు. అనంతరం బీపీ పరీక్ష చేయించుకున్నారు. గ్రామస్తులతో మాట్లాడారు. గ్రామ సమస్యలను తెలియజేయాలన్నారు. కొండ్రముట్లలో ప్రాథమికోన్నత పాఠశాల్లో మధ్యాహ్న భోజనాన్ని ఎంపిపి రాపర్ల రామాంజమ్మ రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులతో మాట్లాడారు. సాయంత్రం సమయంలో ఆటలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అయితే కొండ్రముట్ల సర్పంచ్ రామారావు కార్యక్రమంపై సమాచారం ఇవ్వకపోవటంతో సభకు గైర్హాజరయ్యారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారిణి సుభాషిణి, సర్పంచ్ యోగయ్య ఎంపిడిఒ ఈవూరి బూసిరెడ్డి, తహశీల్దార్ టి.ప్రశాంతి,డిప్యూటీ తహశీల్దార్ ఎం.నాగేశ్వరరావు, మండల జన్మభూమి కమిటి సభ్యులు రాపర్ల జగ్గారావు,



పత్తిపాడులో వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

ఈపూరు సోసైటి అధ్యక్షులు నాగేశ్వరరావు, ఇన్‌చార్జ్ ఎంఇఒ ఆర్.గోవిందరాజులు, విద్యుత్‌శాఖ ఎఇ ఎం.సతీష్ కుమార్, ఏపిఒ ప్రసాద్, ఏపిఎం సతీష్,ఆర్‌డబ్ల్యూయస్ ఏఈ నరేంద్రరెడ్డి, పిఆర్ఎఇ రామకృష్ణ, ఏఓ సుబ్బారావు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలని సిపిఎం వినతి

ప్రజాశక్తి-పిడుగురాళ్ళ

పిడుగురాళ్ళ పట్టణంలోని ఐదవ వార్డులో గల ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో జన్మభూమి మాఊరు ఐదవ విడత కార్యక్రమాన్ని మంగళవారం మున్సిపల్ చైర్మన్ భవనాశి హైమావతి యల్లారావు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సత్తెనపల్లి డిఎస్‌పి కాలేషా వలి హాజరైయ్యారు. అనంతరం సిపిఎం నాయకులు ఏపూరి గోపాల రావు మాట్లాడుతూ సందరయ్య కాలనీలో పదేళ్లుగా పేద ప్రజలు నివసిస్తున్నారని, పలుమార్లు జన్మభూమిలో కాలనీలో నివసిస్తున్న వారికి ఇళ్ల పట్టాలు అర్జీలు పెట్టుకున్నపటకి ఆ సమస్యను పరిష్కరించ కపోవటం అన్యాయం అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సుందరయ్య కాలనీలో ప్రధాన రహదారి, అంతర్గత రహదారులు, మంచినీటి సౌకర్యం, వీధి దీపాలు, వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని జన్మభూమి అధికారులను ఆయన నిలదీశారు. గతంలో ఉన్నటువంటి ప్రభుత్వ పాఠశాలను మరల తిరిగి పునర్దురించాలని కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆయన కోరారు. సిపిఎం పట్టణ నాయకులు తెలగపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ సుందరయ్య కాలనీకి పట్టాలు, మౌలిక సౌకర్యాలు కోసం జరిగే పోరాటాలలో కాలనీ వాసులు ఐక్యంగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం జన్మభూమి అధికారులకు వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం స్వీకరించిన జన్మభూమి అధికారులు సమస్యను పై అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్తామన్నారు. కార్యక్రమానికి 5వ వార్డు కౌన్సిలర్ సత్యవతి అధ్యక్షత వహించారు.కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అద్దంకి రత్నాకర్,మున్సిపల్ కమిషనర్ కాసు శివరామి రెడ్డి, పట్టణ యస్సై రఫీ, టిడిపి నాయకులు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

సత్తెనపల్లిటౌన్ : పట్టణంలోని 21వ వార్డులో నిర్వహించిన కార్యక్రమంలో కోడెల హజరయ్యారు. సభకు మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు మారెళ్ల మల్లేశ్వరరావు అధ్యక్షత వహించారు. కోడెల మాట్లాడుతూ 21వ వార్డులో ఇప్పటి వరకు కోటి రూ.20 లక్షలతో అభివృద్ధి పనులు జరిగాయని అన్నారు. వార్డు కౌన్సెలర్ చౌత్రపు సావిత్రి, ఆమె భర్త శ్రీనివాసరావు పేదలకు ఇళ్ల స్థలాలివ్వాలని కోడెలకు వినతిపత్రం అందజేశారు. స్పందించిన కోడెల వార్డు పరిధిలో ఉన్న జిల్లాపరిషత్ స్థలంలో ఇళ్లు వేసుకుని నివాసం ఉంటున్న 180 పేద కుటుంబాలకు ఇళ్ల పట్టాలు ఇప్పించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సభలో పట్టణంలోని 640 పేదలకు ఒక్కోక్కరికి రూ.5.50 లక్షల చొప్పున జి3 ఇళ్లు కట్టించి ఇస్తామని అన్నారు. కార్యక్రమంలో చంద్రన్న సంక్రాంతి కానుకలను, చంద్రన్న బీమా చెక్కులను, స్కాలర్స్ షిప్‌లను, డ్వాక్రా మహిళలకు


వినతిపత్రం అందిసుత్తన్న కాలనీ వాసులు,సిపిఎం నాయకులు

బ్యాంకు లింకేజి లోన్లు అందజేశారు. సభలో సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు.

సత్తెనపల్లి రూరల్ : మండలంలోని భట్లూరులో నిర్వహించిన కార్యక్రమంలో కోడెల హాజరై మాట్లాడారు. ముందుగా రూ.7లక్షల ఉపాధిహామీ నిధులతో నిర్మించిన అంగన్‌వాడీ నూతన భవనాన్ని ప్రారంభించారు. 5వవిడత జన్మభూమి మాఊరు కార్యక్రమంలో 305 అర్జీలు వచ్చినట్లు ఎంపిడిఒ పిఎస్ పద్మాకర్ తెలిపారు.

అమరావతి : మండల పరిధిలోని ముత్తాయిపాలెంలో వందశాతం సిసిరోడ్లు, మరుగుదొడ్లు పూర్తిచేసిన టిడిపికే దక్కుతుందని ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ తెలిపారు. ముత్తాయిపాలెంలో ఏర్పాటుచేసిన జన్మభూమి మాఊరు కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. పలు సిసిరోడ్లుకు ఆయన శంకుస్థాపనలు చేశారు. అనంతరం లబ్ధిదారులకు చంద్రన్న కానుకలను పంపిణీ చేశారు. మండల పరిధిలోని వైకుంఠపురంలో జన్మభూమి నోడల్ అధికారి ఆధ్వర్యంలో జన్మభూమి నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామస్థులు మరుగుదొడ్లు నిర్మించుకుని చాలా రోజులు అవుతున్నా తమకు ఇంకా బిల్లులు రాలేదని అధికారులను ప్రశ్నించారు. నిర్మాణం పూర్తయిన మరుగుదొడ్లకు వెంటనే బిల్లులు మంజూరయ్యేలా చూస్తామని అధికారులు హామీ ఇచ్చారు. జన్మభూమి కార్యక్రమం కింద రెండు గ్రామాలోల విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ భాస్కరరావు, ఎంపిడిఒ రాజగోపాల్, ఎంపిపి చిట్టెమ్మ, మండల పాల్గొన్నారు.

అచ్చంపేట : మండలపరిధిలోని మాదిపాడు, చల్లగిరి పంచాయతీల వద్ద కార్యక్రమాన్ని నిర్వహించారు. రేషన్‌కార్డులు, పింఛన్లు, గృహనిర్మాణాలు, నివేశనస్థలాలు వంటి సమస్యలపై అధిక సంఖ్యలో అర్జీలు వచ్చాయి. మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాల్లో ఆటలపోటీలు నిర్వహించినట్లు జడ్‌పిపిహెచ్ పాఠశాల హెచ్‌ఎం వి.లక్ష్మీనారాయణ తెలిపారు.

ఫిరంగిపురం : ఫిరంగిపురం మండలం గొల్లపాలెంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ హాజరై మాట్లాడారు. గ్రామంలో అంగన్వాడీ సెంటర్లు రెండు అద్దె భవనాలలో నడుస్తున్న విషయం తెలసుకున్న ఆయన స్థలం చూస్తే వేసవి నాటికి అంగన్ వాడీ భవనాలు నిర్మిస్తామని దీనిపై పంచాయతీ వారు పరిశీలన చేయాలని సూచించారు. గృహ నిర్మాణ పథకం క్రింద ఇళ్లు నిర్మించుకునే వారికి ఎప్పుడు కట్టుకుంటమంటే అప్పుడు మంజూరుపత్రాలు అందచేస్తామని, అవసరమైతే అదనపు ఇళ్లు తీసుకువస్తామని ఎమ్మెల్యే అన్నారు. ఈ సందర్భంగా 39 మందికి విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.1200 చొప్పున్న చంద్రన్న స్కాలర్ షిప్ రూ.46,800లను ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్, నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ సీనియర్ ఐఎఎస్ పి.లక్ష్మి నరసింహం అందచేశారు.డ్వాక్రా మహిళాలకు వడ్డీలేని రుణం (వడ్డీ మాఫీ) క్రింద రూ. 2,50,636 పత్రాలను అందచేశారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి ఎస్ఐ ఆనందరావుకు సూచించారు. పంచాయతీ కార్యాలయ అవరణలో నుదురుపాడు ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్, నియోజవర్గ స్పెషల్ ఆఫీసర్ పి లక్ష్మీనరసింహం శిబిరంను సందర్శించి వైద్యాధికారి ఎ రాజేష్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గర్భిణీలకు సీమాంతాలు నిర్వహించారు.

రెంటచింతల : మండలంలోని పాల్వాయిగేటు, గోలి గ్రామాల్లో నిర్వహించారు. కార్యక్రమాలకు ఎంపిడిఒ శ్రీదేవి అధ్యక్షత వహించారు. స్పెషల్ ఆఫీసర్ ఉపాధి ఏపిడి శివనారాయణ హాజరై మాట్లాడారు. అనంతరం గతంలో దరఖాస్తు చేసుకున్న కార్డుదారులకు రేషన్‌కార్డులు అందజేశారు. గోలి గ్రామంలో 64, పాల్వాయిగేటులో 140 అర్జీలు అందినట్లు తహశీల్దార్ తెలిపారు. విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. స్థానిక వైద్యాధికారి హెల్త్‌క్యాంప్‌లు నిర్వహించి 162 మందికి వైద్యసేవలందించారు.

నకరికల్లు : మండలంలోని చాగల్లు, కండ్లకుంట గ్రామాల్లో నిర్వహించారు. కార్యక్రమానికి ప్రత్యేకాధికారి ఆషారాణి హజరై మాట్లాడారు.

దుర్గి : మండలంలోని ధర్మవరం, శ్యామరాజుపురం గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాలకు మండల ప్రత్యేకాధికారి సిఆర్‌డిఎ డిప్యూటీ కలెక్టర్ ఎన్ ఏసురత్నం హాజరై మాట్లాడారు.

బెల్లంకొండ : మండలంలోని వెంకటాయపాలెంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ హాజరై మాట్లాడారు. నాగిరెడ్డిపాలెంలో అనారోగ్యంతో మరణించిన వెంకట్రావ్ కుటుంబానికి అంత్య క్రియలకు రూ.5000 వేలు అందజేశారు .రేషన్ కార్డులు, వృద్ధాప్య పించను కార్డులు, సురక్ష బేబి కిట్లు , అందిచారు.


నిరాహారదీక్షలలో పాల్గొన్న ఎంఆర్‌పిఎస్ నాయకులు

రెండోరోజుకు ఎంఆర్‌పిఎస్ రిలే దీక్షలు

ప్రజాశక్తి-అచ్చంపేట

ఏబిసిడి వర్గీకరణకు బిల్లు ప్రవేశపెట్టాలని ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందాకృష్ణ మాదిగ పిలుపు మేరకు అచ్చంపేటలోని తహశీల్దార్ కార్యాలయం ఎదుట జరుగుతున్న రిలే నిరాహరదీక్షలు మంగళవారం రెండవరోజుకు చేరాయి. ఎంఆర్‌పిఎస్ నాయకులు మాట్లా డుతూ రెండు తెలుగు రాష్ట్రాలలోని ముఖ్యమంత్రులు అఖిల పక్ష కమిటీలను వేసి ఢిల్లీలో జరిగే శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లో ప్రవేశపెట్టే విధంగా ఒత్తిడి తీసుకురావాల న్నారు. దీక్షలో ఎస్ నాగేశ్వరరావు, రమేష్, నల్లయ్య, కళ్యాణ్, కోటేశ్వరరావు, శ్రీను, బాబురావు పాల్గొన్నారు.


పుస్తకాలను అందజేస్తున్న ఉపాధ్యాయులు ప్రజా ప్రతినిధులు

చంద్రన్న విద్యాజ్యోతి మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి-అచ్చంపేట

రానున్న 10వ తరగతి పరీక్షల్లో మండలానికి మంచిపేరు తీసుకురావాలని అచ్చంపేట మండల జడ్‌పిటిసి మెంబర్ నల్లమేకల వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం జడ్‌పిహెచ్ పాఠశాల్లో 10వతరగతి విద్యార్థులకు చంద్రన్న విద్యాజ్యోతి పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి పివి రామారావు హాజరయ్యారు. ఈసందర్భంగా రామారావు మాట్లాడుతూ విద్యార్థులు వ్యాయమా విద్య ఎంతో అవసరమన్నారు. ఇటీవల గురుకుల పాఠశాలలో చదువుకునే పూర్ణిమ, ఆనంద్‌లు ఎవరెస్ట్ శిఖరం ఎక్కి ఖ్యాతి సంపాదించుకున్నారని అన్నారు. మండల పరిధిలోని చామర్రులో నిరుపేద కుటుంబంలో పుట్టి గ్రంథాలయాల్లోని ప్రథమపేపర్‌లో వచ్చిన పాఠ్యాంశాలను చదువుకుని ఈరోజు మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న చామర్రు గ్రామవాసి గురించి ఆయన విద్యార్థులకు వివరించారు. 164 మంది విద్యార్థులకు విద్యాజ్యోతి పుస్తకాలను అందజేశారు. అదేవిధంగా 8వతరగతి విద్యార్థులకు యూనిఫాం పంపిణీ చేశారు.ఈకార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం వి లక్ష్మీనా రాయణ, ఉపాధ్యాయులు రాజశేఖర్, లక్ష్మీనారాయణ, శీలం మాస్టర్, విద్యాకమిటి ఛైర్మన్ భారతి పాల్గొన్నారు.

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మాజీ యార్డుచైర్మన్ ఆళ్ల సాంబయ్య అన్నారు. మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో పదవతరగతి విద్యార్థులకు చంద్రన్న విద్యాజ్యోతి స్టడీ మెటీరియల్ పుస్తకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.


స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేస్తున్న ఆళ్ల సాంబయ్య


ప్రమాదాల స్థలాను పరిశీలిస్తున్న డిఎస్‌పి

ట్రాఫిక్ సమస్యలపై డీఎస్పీ పరిశీలన

ప్రజాశక్తి-మాచర్ల

పట్టణంలో ప్రమాదాల జోన్‌లలో గురజాల డిఎస్పీ ప్రసాద్ స్థానిక అధికారులతో కలసి పరిశీలించారు. ప్రమాదాల నివారణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మంగళవారం అధికారులతో చర్చలు నిర్వహించారు. సాగర్ రింగ్‌రోడ్డు వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతుం డడంతో నాలుగురోడ్ల కూడలి కావడం, షాపులు ఎక్కువగా ఉండడంతో ఆసమస్యను పరిష్కరించడానికి కావలసిన పట్టణ సిఐ సాంబశివరావు, రూరల్ సిఐ ధిల్లీఫ్‌కుమార్‌తో కలసి ఆప్రాంతాన్ని పరిశీలించారు. ట్రాఫిక్‌సమస్యపై దృష్టిసారించి త్వరలోనే ప్రమాదాల నివారణకోసం చర్యలు చేపడతామని డిఎస్పీ తెలిపారు.కార్యక్రమంలో పట్టణ ఎస్సై లక్ష్మయ్య పాల్గొన్నారు.

బ్యాంకు సేవలపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - దుర్గి

మండల కేంద్రమైన దుర్గిలోని మోడల్ పాఠశాల్లో 9వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఒకేషనల్ కోర్సుల్లో భాగంగా మంగళవారం స్థానిక ఎస్‌బిఐ మేనేజర్ అనుమతితో బ్యాంకు సేవల పై బ్యాంకులో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బ్యాంకులలో ఆన్‌లైన్ సేవలు, లావాదేవీలు, లాకర్ల వివరాలు తదితర విషయాల పై తెలిపారు. ఎటిఎం పనితీరు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తులసీజ్యోతి, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

సుబ్బారావు మృతికి సంతాపంగా న్యాయవాదులు విధులు బహిష్కరణ

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

న్యాయవాది, అడ్వకేట్ నోటరీ బూసి సుబ్బారావు అకాల మరణం తీరనిలోటని బార్ అసో సియేషన్ అధ్యక్షులు కొల్లా వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక బార్


బూసి సుబ్బారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పిస్తున్న న్యాయవాదులు

అసోసియేషన్‌హాల్‌లో బూసి సుబ్బారావు సంతాపసభ మంగళవారం నిర్వహించారు. బూసి సుబ్బారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా కొల్లా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ స్నేహశీలి, మంచి వ్యక్తి అయిన బూసి సుబ్బారావు మననుంచి దూరమవడం బాధాకరమని అన్నారు. బూసి సుబ్బారావు మృతికి సంతాపం ప్రకటించిన న్యాయవాదులు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోర్టు విధులను బహిష్కరించారు. సంతాపసభ కార్యక్రమంలో న్యాయవాదులు టి మల్లిఖార్జునరావు, పక్కాల సూరిబాబు, మల్లారెడ్డి, గాలయ్య, ఎజిపి అనుముల జయరామ్, ఏపిపి, బార్ అసోసియేషన్ కార్యదర్శి రాజవరపు నరసింహరావు, ఉపాధ్యక్షులు సీతారామాంజనేయులు పాల్గొన్నారు.



బహుమతి ప్రధానం చేస్తున్న నళినీకాంత్, తదితరులు

ఆటలతో మానసిక ఉల్లాసం

సిపియం నగర కార్యదర్శి నళినీకాంత్

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక నల్లచెరువు శివారు నంబూరు సుబానీ కాలనీలో నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని ఐద్వా, సిఐటియు, ఆవాజ్‌లు సంయుక్తంగా సోమవారం ఆటల పోటీలు నిర్వహించారు. స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో ఉల్లాసంగా ఆటల పోటీల్లో పాల్గొన్నారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు సిపియం నగర కార్యదర్శి కె.నళినీకాంత్ చేతులమీదుగా బహుమతి ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభకు స్థానిక పార్టీ నాయకులు షేక్ సైదా అధ్యక్షత వహించగా, నళినీకాంత్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ మానసిక ఉల్లాసం అవసరమన్నారు. దానికి క్రీడలు దోహదపడతాయన్నారు. అలాగే కాలనీలో సమస్యల పరిష్కారం కోసం ప్రజలంతా ఐక్యంగా ఉండాలన్నారు. ఆవాజ్ జిల్లా కార్యదర్శి ఎం.అక్బర్ మాట్లాడుతూ ముస్లిం మహిళల్లో అక్షరాస్యత పెరగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. బాల్య వివాహాలకు స్వస్థి పలకాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి ఎంఆర్ దేవి, సిఐటియు నగర అధ్యక్షులు శ్రీనివాస్, శ్రామిక మహిళ నగర కన్వీనర్ షకీల, ఫరీద్ ప్రసంగించారు.

చైతన్య స్ఫూర్తి సేవా సంస్థ వితరణ

కార్పొరేషన్: స్థానిక పట్టాభిపురం మున్సిపల్ ఉన్నత పాఠశాలలోని పేద విద్యార్థులకు చందు హనుమాయమ్మ దుస్తులు పంపిణీ చేశారు. మంగళవారం చైతన్య స్ఫూర్తి సేవ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో దుస్తులు, పుస్తకాలు, పెన్నులను అందించారు. ఈ సందర్భంగా హనమాయమ్మ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఇతోధికంగా తోడ్పడాలనే ఉద్ధేశ్యంతోనే తమ సేవా సంస్థ ద్వార ఉపకరణాలు



విద్యార్థులకు దుస్తులు అందిస్తున్న చందు హనుమాయమ్మ

అందించామన్నారు. కార్యక్రమంలో నూతలపాటి తిరుపతయ్య, పి.మోహనరావు, స్కూల్ ప్రదానోపాధ్యాయులు హరగోపాల్ పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందనలు

గుంటూరు అర్బన్: రామకృష్ణ శారదామిషన్ వారు సిస్టర్ నివేదిత' 150 జన్మదినోత్సవం సందర్భంగా డిసెంబరు 26న నిర్వహించిన వ్యాసరచన, వృక్తత్వ పోటీల్లో సంగడిగుంటలోని గుంటూరు చలమయ్య కర్పూరపు వెంకట నారాయణ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనపరిచారు. ఈ సందర్భంగా కళాశాల కార్యదర్శి రామకృష్ణప్రభు మంగళవారం విద్యార్థునులను అభినందించారు. వ్యాసరచనలో జి.శ్రీలత ద్వితీయ, నాజియా పర్వీన్ తృతీయ, వృక్తత్వ పోటీల్లో బి.సాయికీర్తి ప్రధమ బహుమతులు సాధించారని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ శ్రీనివాసరావు, అద్యాపకులు శ్రీధర్, రాజరాజేశ్వరి పాల్గొన్నారు.

జాతీయ వైద్య కమిషన్ బిల్లు

ప్రజల ఆరోగ్యానికి గొడ్డలి పెట్టు

నిరసనగా వైద్య సేవల బంద్ పాటించిన వైద్యులు

ప్రజాశక్తి-గుంటూరు

కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్న 'జాతీయ వైద్య కమిషన్' బిల్లును తక్షణమే ఉపసంహరించుకోవాలని ప్రైవేటు వైద్యులు ముక్తకంఠం తో డిమాండ్ చేశారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ దేశవ్యాప్త పిలుపు మేరకు గుంటూరు నగరంలో వైద్యులు మంగళవారం వైద్యసేవలు బంద్ పాటించారు. ఈ సందర్భంగా జిటిరోడ్డులోని ఐఎంఎ హాల్‌లో నిర్వహించిన సమావేశానికి అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ జి.వేణుగోపాల్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకురానున్న కమిషన్ ప్రజలకు తీవ్ర నష్టం చేకూరుస్తుందని, వైద్య రంగాన్ని నీర్వీర్యం చేస్తుందన్నారు. ఆయుర్వేద, హోమియో వైద్యులంతా ఒక సంవత్సరంపాటు సాధారణ శిక్షణ పొంది, ఇంగ్లీషు వైద్యం చేయటానికి అనుమతులు ఇచ్చేలా కమిషన్‌లో ప్రతిపాదనలు పొందుపరిచారని, అంతేకాకుండా ఎంబిబిఎస్ ఉత్తీర్ణులైన వారందరూ తిరిగి ప్రభుత్వం నిర్వహించే అర్హత పరీక్షలో ఉత్తీర్ణత కాకపోతే వారు వైద్య సేవలందించటానికి అనర్హులుగా పేర్కొన్నారన్నారు. భవిష్యత్ ఎంబిబిఎస్ గ్రాడ్యుయేట్లపై ఈ నిర్ణయం తీవ్ర ప్రభావం చూపిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా నగరంలోని పలువురు వైద్యులు మాట్లాడుతూ ప్రభుత్వం ఏకపక్ష విధానాలు విడనాడాలని కోరారు. డాక్టర్ గట్టిపాటి బాబూరావు మాట్లాడుతూ ఇదొక పిచ్చి డాక్యుమెంట్ అని అభివర్ణించారు. రాజకీయ, ఆర్థిక సంక్షోబానికి ఇది సూచిక అని పేర్కొన్నారు. ఈ రంగంలో ఏదైనా లోపాలుంటే అందరితో చర్చించి అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో ఐఎంఎ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆవుల శ్రీనివాసరావు, డాక్టర్ రాఘవ శర్మ, డాక్టర్ నందకిషోర్, డాక్టర్ చేబ్రోలు విశ్వేశ్వరరావు తదితరులు ప్రసంగించారు.



మాట్లాడుతున్న డాక్టర్ జి.వేణుగోపాల్

ఎపిఎంఎస్‌ఆర్‌యు మద్దతు

ఐఎంఎ ఆందోళనకు ఆంధ్రప్రదేశ్ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ (సిఐటియు) మద్దతు పలికింది. ఐఎంఎ హాల్లో నిర్వహించిన సమావేశానికి మెడికల్ రిప్రజెంటేటివ్‌లు పెద్ద సంఖ్యలో హాజరై సంఘీభావం తెలిపారు. వైద్యుల సమావేశంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పియస్ శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ నేషనల్ మెడికల్ కమిషన్ ఏర్పాటు ద్వారా ఇప్పటి వరకూ ఒక ప్రొఫెషనల్ బాడీగా ఉన్న ఇండియన్ మెడికిల్ కౌన్సిల్‌ను పొలిటికల్ బాడీగా మార్చటానికి ప్రయత్నం జరుగుతుందన్నారు. ఇది ధనవంతులకు, కార్పొరేట్, ప్రైవేటు యాజమాన్యాలకు అనుకూలంగా ఉందని, వైద్య విద్యలో అవినీతిని ప్రోత్సహించటానికి, తద్వారా వైద్య విద్య మరింత భారంగా మార్చడానికి ఈ బిల్లు దోహదం చేస్తుందన్నారు. వైద్యులు చేసే ఆందోళనకు తమ యూనియన్ సంపూర్ణ మద్దతు ఇస్తుందని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు చల్లా వెంకటప్పయ్య, టి.మురళీకృష్ణ, జి.శ్రీనివాసరావు, ఎం.హనుమంతరావు, వై.సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

ఎఐఆర్‌టిడబ్ల్యూఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-గుంటూరు

ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ 2018 క్యాలెండర్‌ను స్థానిక బ్రాడీపేటలోని సిఐటియు కార్యాలయంలో మంగళవా రం సిఐటియు జిల్లా కార్యదర్శి వై.నేతాజి, జిల్లా ఉపాధ్యక్షులు పాశం రామారావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పాశం రామారావు మాట్లాడుతూ దేశంలో కోట్లాది మందికి ఆహార ధాన్యాలు, పప్పుదినుసులు, నిత్యావసర వస్తువులు చేరవేయటంలో రవాణా రంగం కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ఈ క్రమంలోనే రవాణా వర్కర్ల సమస్యలపై ఎఐఆర్‌టిడబ్ల్యూఎఫ్ పనిచేస్తుందన్నారు. మోటారు వాహనాల చట్ట సవరణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న ప్రయత్నాలు విరమించుకోవాలని డిమాండ్ చేశారు. వర్కర్లందరూ ఐక్య పోరాటాల ద్వారా నూతన రోడ్డు భద్రతా బిల్లును తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎఐఆర్‌టిడబ్ల్యూఎఫ్ జిల్లా కార్యదర్శి నన్నపనేని శివాజీ, అధ్యక్షులు షేక్ మస్తాన్‌వలి, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బి.లక్ష్మణరావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు అప్పారావు, బి.ముత్యాలరావు, కె.కృష్ణకాంత్ తదితరులు పాల్గొన్నారు.

గొట్టిపాడులో శాంతి భద్రతల పర్యవేక్షణ

ప్రజాశక్తి-గుంటూరు అర్బన్

ప్రత్తిపాడు మండలం పెదగొట్టిపాడు గ్రామంలో రెండు సామాజిక వర్గాల మధ్య ఏర్పడిన ఘర్షణ కారణంగా శాంతిభద్రతలను మంగళవారం అర్బన్ ఎస్పీ సి.హెచ్. విజయరావు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా పోలీస్ పికెట్ కట్టుదిట్టంగా ఏర్పాటు చేసినట్టు, మున్ముందు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గ్రామంలోని ప్రజలతో మాట్లాడి శాంతియుత వాతావరణం నెలకొల్పటానికి చర్యలు తీసుకుంటున్నట్టు ఎస్పీ తెలిపారు. గ్రామంలోని ప్రతి ఇంటి పరిసరాలు తెలుసుకోవటానికి డ్రోన్ కెమెరాలతో వీడియో చిత్రీకరణ, ఫోటోలు తీయిస్తున్నట్టు పేర్కొన్నారు. కొన్ని రోజులపాటు 144 సెక్షన్ అమల్లో ఉంటుందని ఎస్పీ విజయరావు తెలిపారు. కార్యక్రమంలో డిఎస్పీలు, సి.ఐ.లు, పలువురు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.



గ్రామ పరిశీలనలో అర్బన్ ఎస్పీ విజయరావు

నేడు సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు

ప్రజాశక్తి-గుంటూరు అర్బన్: సావిత్రిబాయి పూలే 187 జయంతి వేడుకల సందర్భంగా బుధవారం సిపిఎం కార్యాలయంలోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సేవా తత్పరత కలిగిన బహుజన, మహిళా ఉపాధ్యాయిలకు సావిత్రిబాయి పూలే విశిష్ఠ పురస్కారాలు అందజేయనున్నట్టు ఫెడరేషన్ అధ్యక్షుడు ఎస్.ఎం.ప్రకాష్‌కుమార్ మంగళవారం ఒక ప్రకనలో తెలిపారు.

ఆర్‌విఆర్ అండ్ జెసి కళాశాలలో యూత్ ఫెస్ట్

ప్రజాశక్తి-కార్పొరేషన్

ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కళశాలలో ఈ నెల 5,6 తేదీలలో యూత్‌ఫెస్ట్-2018ని నిర్వహిస్తున్నామని కళాశాల అధ్యక్షులు డాక్టర్ కొండబోలు బసవపున్నయ్య తెలిపారు. మంగళవారం ఎస్‌విఎన్ కాలని కళాశాల సిటి కార్యాలయంలో కార్యక్రమ పోస్టర్‌ని ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా బసవపున్నయ్య మాట్లాడుతూ విద్యార్థులలో పోటీతత్వం ద్వారా నైపుణ్యాలు పొంపొందుతాయన్నారు. ఆర్‌విఆర్‌లో ప్రతి సంవత్సరం యూత్‌ఫెస్ట్‌ని నిర్వహిస్తున్నామన్నారు. కళాశాల కార్యదర్శి రాయపాటి గోపాలకృష్ణ మాట్లాడుతూ యూత్‌ఫెస్ట్‌కి ముఖ్య అతిథిలుగా ఏపిపిఎస్సీ చైర్మన్ డాక్టర్ పి.ఉదయభాస్కర్, టుబాకో బోర్డు కార్యదర్శి అద్దంకి శ్రీధర్‌బాబు, హాజరవుతారన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ కోటా శ్రీనివాస్ మాట్లాడుతూ రెండు రోజుల పాటు జరిగే కార్యక్రమాలలో సివిల్ కార్నివాల్, చెక్, సిస్‌సోరియస్, అరిస్టార్, ఎలక్ట్రిక్ అరంజ్, మ్యాన్‌మీట్, మెక్‌మంత్ర పోటీలు విభాగాల వారీగా జరుగుతాయన్నారు. కార్యక్రమంలో కోశాధికారి డాక్టర్ మద్దినేని గోపాలకృష్ణ, డైరెక్టర్స్ డాక్టర్ ఎ.సుధాకర్, డాక్టర్ బి.రవీంధ్రబాబు, రిజిస్ట్రార్ డాక్టర్ ఎన్‌వి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరణ చేస్తున్న డాక్టర్ కొండబోలు బసవపున్నయ్య, తదితరులు

తాలుకా స్థాయి ధర్నాలను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-గుంటూరు అర్బన్: పెన్షన్ సాధన సమితి ఆధ్వర్యంలో ఈనెల 9న నిర్వహించే తాలుకా స్థాయి ధర్నాలను విజయవంతం చేయాలని పెన్షన్ సాధన సమితి జేఏసీ ఛైర్మన్ షేక్.బాజిత్ తెలిపారు. మంగళవారం ఎపీ ఎన్‌జీఓ హోమ్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అన్ని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో జిల్లా స్థాయి పెన్షన్ సాధన సమితి కమిటి ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కమటీ ద్వారా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించటానికి కార్యాచరణ రూపొందిస్తున్నట్టు పేర్కొన్నారు. ఉద్యోగులు ఐక్యమత్యంతో మెలుగుతూ సమస్యల పరిష్కారానికై సమితి పిలుపునిచ్చే ఆందోళనా కార్యక్రమాలలో పాల్గొనాలని తెలిపారు. పోరాటాల ద్వారానే హక్కులు సాధించుకుంటామన్నారు.

రసాభాసగా 'జన్మభూమి మావూరు'



జన్మభూమిలో అధికారులను నిలదీస్తున్న అర్జీదారులు

ప్రజాశక్తి-గుంటూరు సిటీ ప్రతినిధి

జనవరి 2 నుంచి 8 వరకు జరిగే అయిదో విడత 'జన్మభూమి మావూరు' కార్యక్రమం మంగళవారం నగరంలోని పలు వార్డుల్లో ఆలస్యంగా ప్రారంభమైంది. తొలిరోజే అధికారులతో స్థానికులు వాగ్వివాదానికి దిగటంతో కొద్దిసేపు గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసుల రక్షణలో కార్యక్రమాన్ని అధికారులు మమ అనిపించారు. గత జన్మభూమిలో పెట్టుకున్న దరఖాస్తుల సంగతి ఏమైందని, వాటికి నేటికీ మోక్షం లేదని, ఈ సారైనా తమ సమస్యలు పరిష్కరిస్తారా? అని అర్జీదారులు అధికారులను నిలదీశారు. అర్జీదారులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేక అధికారులు నీళ్ల నమిలారు. కొత్తగా అర్జీపెట్టుకునే వారికి దరఖాస్తు ఫారాలు అందుబాటులో లేకపోవడంతో ఉన్నవాటి కోసం కొద్దిసేపు తోపులాటలు జరిగాయి. తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే మహ్మద్ ముస్తఫా అర్జీదారుల తరపున అధికారులను నిలదీశారు. నగరంలో మంగళవారం 18 వార్డు నల్లచెరువు 22 వలైను మున్సిపల్ స్కూల్, 19 వార్డులో నల్లచెరువు 4వలైను, 32 వార్డులోని రవీంద్రనగర్‌లోని మున్సిపల్ స్కూల్, వార్డునెం 1లో మంగళ్‌దాస్ నగర్ 2 వలైన్, 12వార్డులోని అహ్మద్‌నగర్ మొదటిలైన్, 53 వార్డులో నల్లచెరువు దగ్గర శ్రీనివాసకాలనిలలో మొదటి రోజు జన్మభూమి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు జిఎంసికి చెందిన సూపరిండెంట్ ఇంజనీర్ డి.మరియమ్మ, డిప్యూటీ కమిషనర్ ఎం.ఏసుదాస్, సిటీ ప్లానర్ ఎస్.చక్రపాణి, అడిషనల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, డిప్యూటీ కమిషనర్ డి.శ్రీనివాసరావు, డిప్యూటీ సిటీ ప్లానర్ బి.సత్యనారాయణలు పర్యవేక్షించారు. స్వచ్ఛ ఆంధ్రమిషన్ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ డాక్టరు సి.ఎల్.వెంకటరావు పలు వార్డులను కలియ తిరిగి అర్జీదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అన్నింటిని పరిష్కరిస్తామని కార్యక్రమాలకు హాజరైన వారికి నచ్చజెప్పారు. ఈ కార్యక్రమం జరిగే చోట డిజిటల్ స్క్రీన్లను ఏర్పాటు చేసి సాయంత్రం సీఎం ప్రజలచేత చేయించిన జన్మభూమి ప్రతిజ్ఞను ప్రత్యక్ష ప్రసారం చేశారు. ఈ సందర్భంగా సీఎం తమ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. జన్మభూమి కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు సూచించారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో నిర్వహించిన జన్మభూమి కార్యక్రమానికి ఎమ్మెల్సీ మహ్మద్ జానీ, తూర్పు నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జ్ మద్దాలి గిరి, హజ్‌బోర్డు డైరెక్టర్ హసన్ బాషా, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మహ్మద్ హిదాయత్ లు టిడిపి అమలు పరుస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు.

ఎన్ని సమస్యలను పరిష్కరించారో చెప్పాలి ?

తూర్పు నియోజక వర్గ ఎమ్మెల్యే మహ్మద్ ముస్తఫా



అర్జీదారుల తరపున అధికారులను ప్రశ్నిస్తున్న తూర్పు ఎంఎల్ఎ ముస్తఫా

పేదల సమస్యలను పరిష్కరించేందుకు ఏర్పాటు చేసిన జన్మభూమి కార్యక్రమాన్ని స్వాగతిస్తున్నామని, అయితే జన్మభూమి పేరుతో ప్రజలను మభ్య పెడితే చూస్తూ ఊరుకోమన్నారు. గత నాలుగు జన్మభూముల్లో ఎన్ని దరఖాస్తులు వచ్చాయి? ఎన్ని పరిష్కరించారు? మిగిలిన వాటిని ఎప్పుడు పరిష్కరిస్తారు? ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వం పై ఉందని గుర్తుచేశారు. అంగన్‌వాడి కార్యకర్తలకు గత 5 నెలలుగా జీతాల సమస్యను ఎందుకు పరిష్కరించరు? వీటిపై సమాదానం చెప్పాలని నిలదీశారు. టిడిపి ప్రభుత్వం మైనారిటీ సమస్యలను పరిష్కరించడంలో ఘోరంగా విఫలమైందన్నారు. గత జన్మభూమి సమస్యలు నేటి జన్మభూమి వరకూ పరిష్కారం కాలేదని విమర్శించారు.



క్యాలెండర్‌ని ఆవిష్కరిస్తున్న
జిల్లా ప్రదాన న్యాయమూర్తి హరిహరనాధ శర్మ

ఆలిండియా లాయర్స్ యూనియన్ క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-గుంటూరు లీగల్

ఆలిండియా లాయర్స్ యూనియన్(ఐలు) కోర్టు క్యాలెండర్‌ని జిల్లా ప్రదాన న్యాయమూర్తి ఎ.హరిహరనాధ శర్మ ఆవిష్కరించారు. మంగళవారం జిల్లా కోర్టులోని ఆయన ఛాంబర్‌లో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ ఐలు రాష్ట్ర వ్యాప్తంగా న్యాయవాదుల సంక్షేమం కోసం మంచి మంచి కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. ఐలు ముద్రించిన కోర్టు క్యాలెండర్ న్యాయవాదులకు, కక్షిదారులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఐలు రాష్ట్ర కార్యదర్శి నర్రా శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి ఇల్లా మధుబాబు, నగర అధ్యక్ష,కార్యదర్శులు సయ్యద్ బాబు, నీలం శంకరరావు, బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ కొండవీటి శ్రీనివాసరావు, బార్ అసోసియేషన్ ప్రదాన కార్యదర్శి ఎస్‌కె.సుభాని, న్యాయవాదులు శేషగిరిరావు, ఉమాకాంత్, కెవికె.సురేష్, వై.ఏసుకుమారి, లక్ష్మీ పాల్గొన్నారు.



శుభాకాంక్షలు తెలుపుతున్న పబ్లిక్ ప్రాసిక్యూటర్లు

రామకోటేశ్వరరావుకు నూతన సంవత్సర శుభాకాంక్షలు

ప్రజాశక్తి-గుంటూరు లీగల్

విజయవాడలోని డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ జాయింట్ డైరెక్టర్ భైరా రామకోటేశ్వరరావును మంగళవారం గుంటూరు డిప్యూటి డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ పాతూరి మధుసూధనరావు, పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ నక్కా శారదామణి, ప్రశాంతికుమారి, కట్టా కాళిదాసు, లక్ష్మీ రాంనాయక్, కార్యాలయ సిబ్బంది శివకుమార్ కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా భైరా మాట్లాడుతూ ప్రతి నెల కేసు కార్యక్రమాల సమీక్షా సమావేశం నిర్వహించాలని, సకాలంలో కేసు డైరీలను సమర్పించాలన్నారు. కేసులలో మంచి కన్విక్షన్ రేటుని పెంచాలని సూచించారు.

స్మైల్ డెంటల్ ద్వారా ఉచిత పరీక్షలు

ప్రజాశక్తి-కార్పొరేషన్

స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని స్మైల్ డెంటల్ క్లినిక్ నాల్గవ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం ఉచిత దంత పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్లినిక్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ గోళ్ల కిరణ్ మాట్లాడుతూ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన ఉచిత దంత పరీక్షలను ప్రజలు అధిక సంఖ్యలో ఉపయోగించుకున్నారని తెలిపారు. తమ హాస్పిటల్‌లో అంతర్జాతీయ స్థాయి సదుపాయాలు ఉన్నాయని, గుంటూరుతో పాటుగా ఒంగోలు, బెంగుళూరుల్లో శాఖలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో సిఇఒ డాక్టర్ మానసారెడ్డి పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-గుంటూరు అర్బన్

గుంటూరు ప్రభుత్వాసుపత్రి మినిస్ట్రీరియల్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ రాజునాయుడు పాల్గొని కేక్ కట్ చేసి ఉద్యోగులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సరంలో అందరూ ఆర్యోగ్యంగా ఉండాలని, ఆసుపత్రికి వచ్చే రోగుల పట్ల మర్యాదపూర్వకంగా మెలగాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఎంఒ ఆదినారాయణ, ఎ.డి.రోజారమణి, ఎ.ఒ. ప్రవీణ్ మేనేజర్ విజయ్‌కుమార్, ఉదోగ్యుల సంఘం అధ్యక్షుడు ప్రేమజ్యోతిబాబు తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఆసుపత్రి అధికారులు, సిబ్బంది

స్థానిక సమస్యల పరిష్కారమే జన్మభూమి లక్ష్యం



మాట్లాడుతున్న పశ్చిమ ఎమ్మెల్యే మోదుగుల వేణుగోపాలరెడ్డి

ప్రజాశక్తి-కార్పొరేషన్

వార్డులలో నెలకొన్న స్థానిక సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఐదో విడత జన్మభూమి మా ఊరు కార్యక్రమం జరుగుతుందని గుంటూరు నగర పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మోదుగుల వేణుగోపాలరెడ్డి తెలిపారు. నగరంలోని నల్లచెరువు 22 లైన్, నాలుగో లైన్, రవీంధ్రనగర్‌లలో జరిగిన జన్మభూమిలో ఆయన పాల్గొని మాట్లాడారు. వార్డులలో ఇప్పటి వరకు రేషన్‌కార్డు లేనివారు, డ్రైనేజి, తాగునీరు వంటి సమస్యలతో పాటు తమ వార్డు అభివృద్ధికి అవసరమైన అన్ని దరఖాస్తులు జన్మభూమిలో అందించాలని తెలిపారు. ప్రజల నుండి అందిన దరఖాస్తులను పరిశీలించి సాధ్యమైనంత త్వరగా పరిష్కారం చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఆయా విభాగాల అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిందని తెలిపారు. కమిషనర్ సిహెచ్.అనురాధ మాట్లాడు తూ నగరంలో నూరు శాతం ఓడిఎఫ్ అమలు చేయాటానికి ప్రజలు సహకరించాలని కోరారు. మంగళవారం సంక్షేమ పథకాల అమలు, తీరుతెన్నులపై చర్చలు జరుగుతాయన్నారు. నగరపాలక సంస్థ నుండి అందాల్సిన సేవలకు సంబందించి జన్మభూమిలో ఫిర్యాదు అందిస్తే తక్షణం పరిష్కారం లభిస్తుందని తెలిపారు. జన్మభూమి సందర్భంగా ఆయా వార్డులలో వైద్య శిబిరాలు, పిల్లలకు ఆటల పోటీలు, మహిళలకు రంగ వల్లుల పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. జన్మభూమిని ముందస్తు సంక్రాంతిలా జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి అధికారులు నల్లచెరువు 22 లైన్‌లో డి.మరియన్న, నల్లచెరువు నాలుగో లైన్‌లో యం.ఏసుదాసు, రవీంధ్రనగర్‌లో ఎస్.చక్రపాణి, ఆయా డివిజన్ల జన్మభూమి కమటి సభ్యులు, టిడిపి వార్డు అధ్యక్షులు పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న సిపిఐ నాయకులు

కమ్యూనిస్టు ఉద్యమానికి స్ఫూర్తి బర్ధన్

కార్పొరేషన్ : దేశంలో కమ్యూనిస్టు ఉద్యమానికి ఎబి బర్ధన్ జీవితం స్ఫూర్తి అని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు తెలిపారు. మంగళవారం స్థానిక కొత్తపేటలోని మల్లయ్యలింగం భవన్‌లో సిపిఐ సీనియర్ నాయకులు బర్ధన్ రెండవ వర్ధంతిని నిర్వహించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ అధ్యక్షతన వహించిన ఈ కార్యక్రమంలో ముప్పాళ్ల మాట్లాడుతూ బర్ధన్ విద్యార్థి నాయకుడిగా, కార్మిక నాయకుడిగా కమ్యూనిస్టు విలువలకు కట్టుబడి పనిచేశారన్నారు. పార్టీ జాతీయ కార్యదర్శిగా దేశంలో కమ్యూనిస్టు ఉద్యమ విస్తరణకు అంకితభావంతో పాటుపడ్డారన్నారు. సభలో సిపిఐ నాయకులు ఎ.మారుతివరప్రసాద్, మాల్యాద్రి, బాలస్వామిరెడ్డి, రాంబాబు, శ్రీనివాసరావు, బాలాజి పాల్గొన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న గెడ్డమ్మ

రజక వృత్తిదారుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-గుంటూరు

ఎపి రజక వృత్తిదారుల సంఘం 2018 క్యాలెండర్‌ను బిసి కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆర్ గెడ్డమ్మ మంగళవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గెడ్డమ్మ మాట్లాడుతూ వృత్తిదారులకు సత్వర సేవలు అందించటానికి కృషి చేస్తానని చెప్పారు. ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలని కోరారు. రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి మానేపల్లి దుర్గారావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 50 సంవత్సరాలు నిండిన వృత్తిదారులకు సబ్సిడీ రుణాలు పొందుటకు అనర్హులనే నిబంధనను రద్దు చేయాలని కోరారు. జిల్లా ఆధ్యక్షులు వల్లభాపురం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలతో పాటు, అపార్ట్‌మెంట్లలో పనిచేస్తున్న వాచ్‌మెన్‌ల పైనా దౌర్జన్యాలు, దాడులు, నేరాలు, మోపబడుతున్నాయని, రజకుల రక్షణకు ప్రత్యేక రక్షణ చట్టం బిల్లును రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశపెట్టాలని కోరారు. ఫెడరేషన్ రుణాలకు సంబంధించి 2017-2018 సంవత్సరానికి 10 వేల గ్రూపులు రాష్ట్ర వ్యాప్తంగా రిజిస్ట్రేషన్ చేసుకుంటే కేవలం180 గ్రూపులకు మాత్రమే రుణాలు ఇవ్వటానికి లక్ష్యంగా నిర్ధేశించుకున్నారన్నారు.ప్రభుత్వం చెప్పే మాటలకు ఆచరణ చేసే పనులకు పొంతన లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షులు ఈమని రామారావు, సహాయ కార్యదర్శి చింతల ఏడుకొండలు, లక్ష్మణరావు, నిడుబ్రోలు సాంబశివరావు, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డివైఎఫ్ఐ నాయకులు బూరుగ శ్రీనివాసరావు

సమగ్ర క్రీడావిధానం ప్రకటించాలి

ప్రజాశక్తి - తాడేపల్లి

ప్రభుత్వం సమగ్ర క్రీడావిధానాన్ని ప్రకటించాలని జన విజ్ఞానవేదిక (జెవివి) నాయకులు బూరుగ శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. నూతన సంవత్సరం సందర్భంగా తాడేపల్లి ముగ్గురోడ్డులో డివైఎఫ్ఐ, ఐద్వా ఆధ్వర్యంలో నిర్వహించిన ఆటల పోటీల ముగింపు సభ, బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సభకు స్థానిక నాయకులు దర్శనపు విజయబాబు అధ్యక్షత వహించారు. శ్రీనివాసరావు తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ ప్రభుత్వాలు గ్రామసీమల్లో శిక్షణ ఇచ్చి క్రీడాకారులను వెలికితీస్తే మట్టిలో మాణిక్యాలను తయారుచేయవచ్చని సూచించారు. సరైన క్రీడా పరికరాలు కూడా అందించలేని పరిస్థితుల్లో పాలకవర్గపార్టీలు ఉన్నాయని విమర్శించారు. సోషలిస్టు చైనా, ఇతర దేశాలు పతకాలు సాధిస్తున్నాయన్నారు. అక్కడ క్రీడలకు ఇస్తున్న ప్రాధాన్యతను తెలియజేశారు. యువతి యువకులు నూతన సంవత్సరం, సంక్రాంతి సందర్భంగా చెడు అలవాట్లవైపు మరలకుండా ఉండేందుకే డివైఎఫ్ఐ ఆటలపోటీలు నిర్వహిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక పెద్దలు జిమ్మళ్ళమూడి సుధాకర్, బి.క్రీస్తుదాసు, మామిళ్ళ చిననాగేశ్వరరావు, ఎం.లీలమ్మ, జి.గోపమ్మ, డివైఎఫ్ఐ నాయకులు బి.మౌనీష్, హరీష్, తదితరులు పాల్గొన్నారు.

పాశ్చాత్య పోకడలతో భారత సంస్కృతికి ప్రమాదం

అంతరిక్ష శాస్త్రవేత్త చందు సాంబశివరావు

ప్రజాశక్తి-కార్పొరేషన్

ప్రపంచంలో మేటిగా నిలిచిన భారతీయ సంస్కృతి పాశ్చాత్య పోకడలతో ప్రమాదంలో పడుతుందని అంతరిక్ష శాస్త్రవేత్త చందు సాంబశివరావు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో సంస్కృతి సంస్థ ఆధ్వర్యంలో మోదుగు శ్రీసుధ రచించిన కవితా సంపుటి ఆవిష్కరణ సభ జరిగింది. సాహితీవేత్త మోదుగుల రవికృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో చందు సాంబశివరావు అమోహం కవితా సంపుటిని ఆవిష్కరించారు. సాహితీ విమర్శకులు పిన్నమనేని మృత్యుంజయరావు, రచయిత గోటేటి లలితాశేఖర్‌లు కవితా సంపుటిని సమీక్షించారు. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ కవితలను మానవీయ కోణం నుంచి వ్రాయడం అంత తేలికైన విషయం కాదన్నారు. మానవ జీవనం తోటి వారికి ఇబ్బందులు కల్గించకుండా ఉండాలని, అమోహం కవితా సంపుటిని రచించిన సుధ మానవ ఆలోచనలకు రూపం ఇచ్చారన్నారు. అంతర్లీనంగా ఉన్న భావాలను కవితలగా రూపమిచ్చిన శ్రీసుధ, దానిని పుస్తక రూపం ఇచ్చిన సంస్కృతి సంస్థ అభినందనీయులన్నారు. పుస్తకాన్ని సమీక్షించిన లలితా శేఖర్ మాట్లాడుతూ సూక్ష్మబద్ధమైన అనుభూతిని అక్షరబద్ధం చేయడంలో సుధ విజయం సాధించిందన్నారు. కవితలన్నింటిలో హృదయం స్వచ్ఛమైన ప్రశాంతంగా ఉండటం ఈ కవితలలో చూడవచ్చన్నారు. వచన కవిత్య అనుభూతి గాఢత్వం ఇందులో ఉందన్నారు. కార్యక్రమంను సంస్కృతి సంస్థ అధ్యక్షులు ఎస్.బాలచందర్ పర్యవేక్షించారు.



మాట్లాడుతున్న రచయిత శ్రీసుధ



'అమోహం' పుస్తకావిష్కరణ చేస్తున్న చందు సాంబశివరావు, తదితరులు



'ఇంటింటి భాగోతం' నాటకంలో ఓ సన్నివేశం

మహిళ ప్రాధాన్యతను తెలిపిన 'ఇంటింటి భాగోతం'

ప్రతి ఇంటిలో మహిళ అనేక పాత్రలో ఉంటుంది. గృహిణిగా, తల్లిగా ఇంటి పని, పిల్లల పనితో తీరిక లేకుండా గడుపుతుంది. ఈ కాలంలో తన ఆరోగ్యంను కూడా పట్టించుకోదు. కాని సమాజంలో మహిళల పట్ల లింగ వివక్ష తీవ్రంగా ఉంటుంది. అవకాశం కల్పిస్తే పురుషులతో సమానంగా ఏ రంగంలోను వెనుకబాటు లేకుండా మహిళలు నేటి కాలంలో సమాన అవకాశాల కోసం కృషి చేస్తున్నారనే సారాంశంతో వల్లూరు శివప్రసాద్ రచించిన 'ఇంటింటి భాగోతం' నాటకం ప్రతి ఒక్కరికి మహిళ ప్రాధాన్యతను విపులంగా చూపింది. అరవింద్ ఆర్ట్స్, తాడేపల్లి కళాకారులు ప్రదర్శించిన నాటకంకు గంగోత్రి సాయి దర్వకత్వం వహించారు.

అదనపు కౌంటర్ తెరవండి

ప్రజాశక్తి - రొంపిచర్ల

రొంపిచర్ల ఎస్‌బిఐ నందు ప్రజలు ఆర్థిక లావాదేవీలు నిర్వహించుటకు గానూ ఒకే ఒక్క కౌంటర్ మాత్రమే ఉండటంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 'అదనపు కౌంటర్ ఏర్పాటు చేయండి' అంటూ డిమాండ్ చేస్తున్నారు. మండలంలో మొత్తం 27 గ్రామాలుండగా సుమారుగు 15 గ్రామాల ప్రజలు ఈ ఎస్‌బిఐలో ఖాతాదారులుగా ఉన్నారు. ఈ బ్యాంకు నందు నగదు కౌంటర్ ఒక్కటే ఉండటంతో ఖాతాదారులు చాలా ఇబ్బందిపడుతున్నారు. రొంపిచర్ల ఎస్‌బిఐ నందు మొత్తం 17వేల ఖాతాలు ఉన్నాయి. ఇందులో సేవింగ్స్, కరెంట్ ఖాతాలు రెండు కలిపి 11 వేలు ఉండగా, లోను ఖాతాలు మరో 6 వేలు ఉన్నాయని బ్యాంక్ అధికారులు తెలిపారు. దీనికి తోడు ఇద్దరు ఫీల్డ్ ఆఫీసర్లు ఉండాల్సిన బ్యాంక్‌లో ఒక్కరు మాత్రమే ఉండటం, క్లర్క్ పనిచేసేవారు కూడా తక్కువగా ఉండటంతో బ్యాంక్ సిబ్బందిపై అధనపు భారం పడుతుంది. ప్రభుత్వాలు డిజిటల్ లైజేషన్, కంప్యూటరీ కరణ పేరుతో సిబ్బందిని అరకొరగా ఏర్పాటు చేయడంతో ప్రస్తుతం ఉన్న సిబ్బంది రాత్రి 9 గంటల వరకు పనిచేయాల్సి వస్తుంది. బ్యాంక్‌లో లావాదేవీలు ఆలస్యంగా జరగుతుండటంతో దూర ప్రాంత గ్రామాల ప్రజలు పలు ఇబ్బందులకు గురవుతున్నారు. తిండి, తిప్పలు లేకుండా రోజంతా అక్కడే పడిగాపులు పడవలసి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనుక సిబ్బందిని పెంచి రెండవ నగదు కౌంటర్ ఏర్పాటు చేయాలని ఖాతాదారులు కోరుతున్నారు.



బ్యాంకులో నగదు కౌంటర్ వద్ద నెట్టుకుంటున్న ఖాతాదారులు

మనతో మనమే పోటీపడి గెలవాలి

యండమూరి వీరేంద్రనాథ్



విద్యార్థినులకు సూచనలు ఇస్తున్న యండమూరి

ప్రజాశక్తి-నకరికల్లు

మనతో మనమే పోటీ పడి గెలవాలని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు ప్రఖ్యాత తెలుగు నవలా రచయిత ఎండమూరి వీరేంద్రనాథ్ తెలిపారు. జంపని ఆంజనేయులు జ్ఞాపకార్థం లైఫ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని కండ్లకుంట జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు పదవతరగతి పరీక్షలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఎండమూరి వీరేంద్రనాథ్ మాట్లాడుతూ చదువును కష్టంగా కాకుండా ఇష్టపడి చదివినట్లయితే విజయం మీసొంతమవుతుందన్నారు. ప్రతి విద్యార్థి చదువుతో పాటు క్రీడలలో కూడా రాణించాలన్నారు. సూక్ష్మ నైపుణ్యాలను పెంచుకోవడం ద్వారా మానసిక ధైర్యం పెరుగుతుందన్నారు. పరీక్షలపై భయాన్ని వీడి సమయాన్ని వృధా చేసుకోకుండా సన్నద్ధం కావాలన్నారు. జీవితంలో గెలవాలంటే ధైర్యంగా ఎదురీదాలన్నారు. తాను 35 సినిమాలకు రచయితగా పనిచేశానని అన్నారు. మూడు సినిమాలకు దర్శకత్వం వహించానని అన్నారు. ఈసందర్భంగా విద్యార్థులను పలు ప్రశ్నలు వేశారు. అనంతరం ఎండమూరి వీరేంద్రనాథ్ స్థాపించిన సరస్వతీ విద్యాపీఠం తరుపున విద్యార్థులకు సర్టిఫికెట్లను, గోల్డ్‌మెడల్‌ను బహుకరించారు. ఈ కార్యక్రమంలో లైఫ్ ఫౌండేషన్ అధినేత కళ్లకుంట శ్రీను, నరసరావుపేట విద్యాధికారి రామారావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



హైస్కూల్లో శిక్షణ తీసుకుంటున్న వాలీబాల్ క్రీడాకారులు

వాలీబాల్ పోటీలకు శిక్షణ

ప్రజాశక్తి - తాడేపల్లి

తాడేపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థినీ విద్యార్థులకు వాలీబాల్ పోటీలకు శిక్షణ ఇస్తున్నారు. జన్మభూమి జరిగే ఈ పదిరోజులు శిక్షణ ఉంటుందని ప్రధానోపాధ్యాయులు రాయల సుబ్బారావు తెలిపారు. అనంతరం నిర్వహించే పోటీల్లో క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. తమ పాఠశాల క్రీడలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఆయన చెప్పారు.